అనుదినం... జనస్వరం

నవతెలంగాణ

మంగళవారం 9-1-2018 సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 4 సంచిక : 12 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar, Mahaboobnagar, Warangal | www.navatelangana.com | 12+16 పేజీలు వెల: 5.00

అమాంతం ఎగిసిన
అదానీ సంపద

2017లో 125% వృద్ధి

- ముఖేష్ ఆస్తులు 78% పైకి
- డిమార్ట్ అధినేత సంపదలో 80% పెరుగుదల


ఇతర కార్పొరేట్లదీ అదే దారి..



నవతెలంగాణ-బిజినెస్ డెస్క్

దేశంలో పేద, మధ్య తరగతి ప్రజల ఆదాయాలు పడిపోతుంటే మరోవైపు కార్పొరేట్ల నికర ఆస్తుల విలువ మాత్రం భారీగా పెరిగిపోతోంది. నోట్ల రద్దు, జీఎస్టీ అమలు లాంటి చర్యల వల్ల ప్రజలు ఆర్థికంగా ఇబ్బందులు పడుతుంటే బడా పెట్టుబడిదారులు మాత్రం పెద్ద ఎత్తున బాగు పడ్డారు. వృద్ధిరేటు పడిపోయినా, ఉత్పత్తి రంగం దెబ్బతిన్నా... దేశంలోని బడా వ్యాపారవేత్తల ఆర్థిక రేఖ మాత్రం పడిపోలేదు. ఇందుకు నిదర్శనం గతేడాది పలువరి సంపద పరుగులు పెట్టడమే. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ మిత్రుడు గౌతమ్ అదానీ సంపద అమాంతం పెరిగింది. దేశంలోనే నౌకాశ్రయాల నిర్వహణలో అదానీ అతిపెద్ద

9



పోరు..డౌటే!

పంచాయతీ ఎన్నికలపై సస్పెన్స్

పంచాయతీరాజ్ సంస్థల ఎన్నికలు గడువులోగా నిర్వహించే అవకాశాలు కనిపించడం లేదు. కొత్త చట్టం రూపొందించే పనిలో ఉన్న టీఆర్ఎస్ ప్రభుత్వం ఆ దిశగా ముందస్తు ఏర్పాట్లు చేయడంలో వెనకపడిందనే వ్యాఖ్యానాలు వినిపిస్తున్నాయి. సమయం తక్కువగా ఉండటం, చేయాల్సిన పని ఎక్కువగా ఉన్న నేపథ్యంలో ఎన్నికల వాయిదా తప్పనిసరి అని ఉన్నతాధికారులు చెబుతున్నారు. మరోవైపు రాష్ట్ర ఎన్నికల సంఘం అధికారులు పంచాయతీరాజ్ ఎన్నికలకు సన్నద్ధమవుతున్నారు. ఓటర్ల జాబితాలు, ఇతర అంతర్గత ప్రక్రియ విషయంలో ఏర్పాట్లు చేసుకుంటున్నది. జిల్లా కలెక్టర్లకు ఇప్పటికే ఎన్నికల నిర్వహణకు సంబంధించిన ఆదేశాలు ఇచ్చింది.





- అవకాశాలు తక్కువే: మంత్రివర్గ ఉపసంఘం
- నివేదికకు మూడు నెలల సమయం
- కొలిక్కిరాని తండాల పంచాయతీలు
- రిజర్వేషన్ల ఖరారుకు మరింత సమయం
- సకాలంలో ప్రక్రియ సొంతం పూర్తవడం కష్టమే

వివరాలు 6లో

మరుగుదొడ్డే నివాసం



వివరాలు 9లో

- ఖమ్మం జిల్లా బోనకల్ మండలం చిరునోములో..

లెఫ్ట్, అంబేద్కరిస్ట్ ప్రొఫెసర్లే టార్గెట్!

బూతులతో పేట్రేగిపోతున్న కాషాయమూకలు

- నిన్న ఎస్‌యూలో సుజాత... నేడు హెచ్‌సీయూలో లక్ష్మీనారాయణ





నవతెలంగాణ బ్యూరో- హైదరాబాద్

శాతవాహన యూనివర్సిటీలో ప్రొఫెసర్ సూరేపల్లి సుజాతపై కాషాయమూకల దాడి ఘటనను మరువకముందే, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ (హెచ్‌సీయూ)లో మరో సంఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. హెచ్‌సీయూ ప్రొఫెసర్ లక్ష్మీనారాయణపై బూతుపురాణం మొదలైంది. యూనివర్సిటీలు కేంద్రంగా చేసుకుని వామపక్ష, అంబేద్కరిస్ట్ భావజాలమున్న ప్రొఫెసర్లు, అధ్యాపకులే టార్గెట్‌గా కాషాయమూకలు రెచ్చిపోతున్నారు. ఇంత జరుగుతున్నా వర్సిటీ అధికారులు మాత్రం బూతుపురాణం చేసిన వారిపై చర్యలు తీసుకునేందుకు జంకుతున్నారు. హెచ్‌సీయూలో మృదుస్వభావిగా పేరున్న దళిత సామాజిక వర్గానికి చెందిన ప్రొఫెసర్‌గా లక్ష్మీనారాయణ అర్థశాస్త్రం విభాగంలో అధ్యాప కులుగా పనిచేస్తున్నారు. గతేడాది నవంబర్ 25న అర్థశాస్త్రానికి సంబంధించి విద్యార్థులకు ఓ పరీక్ష నిర్వహించారు. దీనిలో విద్యావ్యాపారీకరణ, కాషాయీకరణ తో వస్తున్న మార్పులకు సంబంధించిన ఒక ప్రశ్న ఉంది. ఈ పరీక్షాపత్రంలో 'కాషాయీకరణ' పేరును పేర్కొనడాన్ని సహించలేని ఏబీవీపీ నేతలు ఆ ప్రొఫెసర్‌పై సోషల్ మీడియాలో ఇష్టం వచ్చినట్టు బూతులు తిడుతూ పోస్టు చేశారు. ఏబీవీపీ సెంట్రల్ యూనివర్సిటీస్ జాతీయ

9

రోడ్డు ప్రమాదాల్లో
ఎనిమిది మంది మృతి

- బొలెరో బోల్తా పడి ఐదుగురు కూలీలు
- ట్రాక్టర్‌ను ఢీకొని మరో ఇద్దరు..కారు పల్టీకొట్టి ఇంకొకరు
- 30 మందికి పైగా గాయాలు
- ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో ఘటనలు
- కూలీల కుటుంబాలకు రూ.6 లక్షల చొప్పన ఇచ్చేందుకు సీడ్ ఆర్గనైజర్ల అంగీకారం



వివరాలు 9లో

సర్పంచినీ వదలని వీడీసీ



దళిత సర్పంచ్ గ్రామ బహిష్కరణ

- ఆ కుటుంబానికి సహకరిస్తే రూ.5 వేల జరిమానా
- భూమి లాక్కునేందుకు పెత్తందార్ల కుట్ర

నవతెలంగాణ-ముప్కాల్

నిజామాబాద్ జిల్లాలో వీడీసీల అకృత్యాలు నిత్యకృత్యంగా మారాయి. తన మాట వినినిబడుగు బలహీనవర్గాలపై గ్రామాభివృద్ధి కమిటీలు పేట్రేగుతున్నాయి. నిన్న బాల్కొండ మండలం చిట్టాపూర్‌లో గంగపుత్రులను బహిష్కరించిన సమస్య సమసిపోక ముందే.. మెండోరా మండలం బుస్సాపూర్‌లో మరో అకృత్యం వెలుగుచూసింది. ఏకంగా దళిత సర్పంచ్‌ని, ఆ కుటుంబాన్ని బహిష్కరించిన ఘటన కలెక్టర్, పోలీస్ కమిషనర్‌కు ఫిర్యాదు చేయడంతో ఆలస్యంగా సోమవారం వెలుగుచూసింది.

వివరాల్లోకెళ్తే...

బుస్సాపూర్ సర్పంచ్ జక్కుల మమత, ఆమె భర్త సొంగల శ్రీనివాస్‌కు సర్వే నెంబర్ 8666, 8066, 8078, 8692లో పూర్వీకుల ద్వారా వచ్చిన 3 ఎకరాల 30 గుంటల భూమి ఉన్నది. భూ ప్రక్షాళనలో భాగంగా హక్కుదారులుగా పేర్కొంటూ రెవెన్యూ అధికారులు సర్పంచ్ మమత, కుటుంబ సభ్యులకు నోటీసులు అందజేశారు. అయితే, అదే గ్రామానికి చెందిన వీడీసీలోని కొందరు పెత్తందార్లు ఆ భూమిని కాజేయాలనుకున్నారు. 'ఆ భూమి గురడి రెడ్డి సంఘానికి సంబంధించినది. మీ తాతలు మాకు అమ్మారు. అందుకు అంగీకరిస్తూ ఇప్పుడు సంతకాలు చేయండి' అంటూ హుకూం జారీ చేశారు. దానికి వారు అంగీకరించలేదు. ఇదంతా గతేడాది నవంబర్ 29న జరిగింది. దీంతో

9

టీఆర్ఎస్ మునిగిపోయే నావ

- రాష్ట్రంలో అధికారం మాదే...
- నెలాఖరులో రాహుల్ పర్యటన
- త్వరలో బస్సు యాత్ర
- రాహుల్‌గాంధీకి కృతజ్ఞతలు: ఇష్టాగోష్టిలో ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



వివరాలు 9లో

ఇద్దరు రైతుల ఆత్మహత్యాయత్నం

- లంచం ఇవ్వలేక ఒకరు...

పొలం పోతున్నదని మరొకరు

- జగిత్యాల, మెదక్ జిల్లాల్లో ఘటనలు

వివరాలు 9లో

ట్రంప్ టవర్‌లో అగ్ని ప్రమాదం

- అమెరికాలో ఘటన.. ఇద్దరికి గాయాలు

వివరాలు 7లో



ప్రచారానికి పోదాం సార్.. అన్నారంతే..

నిఘా..

ఢిల్లీ తెలంగాణభవన్‌లో వింత పోకడ

- అధికారుల మధ్య సమన్వయలోపం
- ఒకరిపైఒకరికి అనుమానం
- కిందిస్థాయి అధికారుల ఆఫీసు గదుల్లో కెమెరాలు
- మీడియా కదలికలపైనా దృష్టి
- భవన్‌లో 20 నిఘా కెమెరాల ఏర్పాటు





నవతెలంగాణ-న్యూఢిల్లీబ్యూరో

'అచ్చి పెళ్లి బుచ్చి చావుకు వచ్చిందని' తెలంగాణ భవన్‌లో పైస్థాయి అధికారుల తీరు ఇతర సిబ్బందిని ఇబ్బంది పాల్జేస్తోంది. తెలంగాణభవన్‌లో జరుగుతున్న వ్యవహారాలు కొంతమంది అధికారుల, సిబ్బంది వల్ల లీకులవుతున్నాయని పెద్దసార్లకు అనుమానం వచ్చింది. అనుమానం వచ్చిందే తడువు ఓ ఆలోచనా వచ్చింది. మీడియాపై నేరుగా ఆంక్షలు విధించడం సాధ్యం కాదు కాబట్టి అధికారులను కట్టడి చేయాలని నిర్ణయించుకున్నారు. ఇందుకు భద్రత పేరుతో ఏకంగా అధికారుల ఆఫీసు రూముల్లోనే నిఘా కెమెరాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. అసిస్టెంట్ కమిషనర్ కార్యాలయంతో సహా రెసిడెంట్ కమిషనర్ పీఎస్ ఆఫీసు రూముల్లో నిఘా

9

సోషల్ మీడియాపై ఆంక్షలు?

- ఆ దిశగా కేంద్రం అడుగులు : డీజీపీల సమావేశంలో ప్రధాని మోడీ



టెకన్పూర్ (ఎంపీ) : సోషల్ మీడియాపై ఆంక్షలు విధించే దిశగా కేంద్రం అడుగులు వేస్తోందా? సోమవారం జరిగిన డీజీపీల సమావేశంలో ప్రధాని మోడీ చేసిన ప్రసంగాన్ని బట్టి కేంద్రం ఆ దిశగా అడుగులు వేస్తున్నట్టు స్పష్టమవుతున్నది. సైబర్ క్రైం, సోషల్ మీడియా ద్వారా తలెత్తుతున్న సమస్యలపై ప్రత్యేకంగా దృష్టిసారించాలని కోరారు. మధ్యప్రదేశ్ గ్వాలియర్‌లో బీఎస్ఎఫ్ అకాడెమీలో సోమవారం డీజీపీ, ఐజీపీల వార్షిక సదస్సులో ప్రధాని ప్రసంగించారు. రాడికల్, అక్రమ ఆర్థిక వ్యవహారాలపై సమాచారం పంచుకునే దిశగా ప్రపంచవ్యాప్తంగా ఏకాభిప్రాయం ఉందని, ఇది సాధించడంలో కీలకపాత్ర పోషిస్తామని ప్రధాని చెప్పారు. సైబర్ సెక్యూరిటీ సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యతనివ్వాలని ఆదేశించారు. సోషల్ మీడియా ప్రాముఖ్యతపై మోడీ మాట్లాడుతూ సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించేందుకు టెక్నాలజీని ఉపయోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కేంద్ర హోంశాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్, సహాయమంత్రులు హన్స్‌రాజ్ గంగారామ్ అహిర్, కిరణ్ రిజుజు, అధికారులు హాజరయ్యారు.

కక్ష సాధింపు రాజకీయాలేనా..?

మనది బనానా రిపబ్లికా..? : శత్రుఘ్నసిన్హా

న్యూఢిల్లీ: కక్ష సాధింపు రాజకీయాలు తగునా అని బీజేపీ ఎంపీ, బాలీవుడ్ నటుడు శత్రుఘ్నసిన్హా ప్రశ్నించారు. ఆధార్ దుర్వినియోగంపై కథనం రాసినందుకు జర్నలిస్టును కేసుల్లో లాగుతారా అని సిన్హా తన ట్విట్టర్ ద్వారా ప్రశ్నించారు. మనం బనానా రిపబ్లిక్‌లో జీవిస్తున్నామా అని ఆయన విమర్శించారు. ఇదేమి న్యాయం? కక్ష సాధింపు రాజకీయాలేనా? దేశం, సమాజం కోసం వినియోగం ఎవరైనా ముందుకు వస్తే బాధితులుగా మారాల్సిందేనా అని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఆధార్ డేటాకేసేపై ది ట్రిబ్యూన్ జర్నలిస్ట్ రచనా ఖైరా రాసిన కథనంపై ఢిల్లీ పోలీస్ స్టేషన్‌లో భారత విశిష్ట ప్రాధికార సంస్థ(యూఐడీఏఐ) కేసు పెట్టిన విషయం తెలిసిందే. కేసును ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేసిన ఎడిటర్స్ గిల్డ్‌కు సిన్హా అభినందనలు తెలిపారు.

జర్నలిస్టుపై కేసు వెనక్కి తీసుకోవాలి: జర్నలిస్టు సంఘాల డిమాండ్

ట్రిబ్యూన్ జర్నలిస్టు పై నమోదైన ఎఫ్ఐఆర్‌ను వెనక్కి తీసుకోవాలని వార్తా పత్రికల ఉద్యోగుల సంఘం డిమాండ్ చేసింది. ఒక బిలియన్‌కి పైగా ఆధార్‌కార్డుల వివరాల దుర్వినియోగమవుతున్నాయని ట్రిబ్యూన్ జర్నలిస్టు తన రిపోర్టులో పేర్కొన్న విషయం తెలిసిందే. యూఐడీఏ అధికారుల ఫిర్యాదు మేరకు ఢిల్లీ పోలీసులు ఆ పత్రిక రిపోర్టర్ పై ఎఫ్ఐఆర్ నమోదుచేశారు. సమాచార సాంకేతిక చట్టం, ఆధార్ చట్టంతో పాటు వివిధ సెక్షన్ల కింద పోలీసులు జర్నలిస్టుపై కేసులు నమోదు చేశారు. తప్పును ఎత్తిచూపిన జర్నలిస్టుపై కేసులు పెట్టడాన్ని 'పత్రికా స్వేచ్ఛ'పై దాడిగా జర్నలిస్టు సంఘాలు అభివర్ణించాయి. యూనిక్ ఐడెంటిఫికేషన్ అథారిటీ ఆఫ్ ఇండియా (యూఐడీఏఐ) చర్యను వార్తా పత్రిక, ఏజెన్సీ ఉద్యోగుల సమాఖ్య ఖండించింది.

బెయిల్ కోసం జార్ఖండ్ హైకోర్టుకు లాలూ

రాంచీ: పశుదాణా కుంభకోణం కేసులో జైలు శిక్షను ఎదుర్కొంటున్న ఆర్జేడీ చీఫ్ లాలూప్రసాద్ బెయిల్ కోసం జార్ఖండ్ హైకోర్టును ఆశ్రయించనున్నారు. 'తీర్పు ప్రతిని పూర్తిగా చదివిన తర్వాత వచ్చే సోమవారంలోగా తాము బెయిల్ కోసం హైకోర్టును ఆశ్రయించనున్నాం' అని లాలూ తరఫు న్యాయవాది ప్రభాత్ కుమార్ చెప్పారు. ఇదేవిధంగా లాలూ సోదరి మరణించిన నేపథ్యంలో పెరోల్ కోరుతూ న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తారా అని ప్రశ్నించగా అలాంటిదేమీ లేదన్నారు.

జనాకర్షక బడ్జెట్ కాబోదు : నీతి ఆయోగ్

న్యూఢిల్లీ: అందరూ భావిస్తున్నట్టు వచ్చే కేంద్ర బడ్జెట్ ప్రజాకర్షక బడ్జెట్ కాకపోవచ్చునని నీతి ఆయోగ్ ఉపాధ్యక్షుడు రాజీవ్ కుమార్ అన్నారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ... ఎన్డీఏ ప్రభుత్వం ప్రవేశపెట్టబోయే పూర్తిస్థాయి చివరి బడ్జెట్ ఇది. అందరూ అనుకుంటున్నట్టు ఇది 2019లో జరగబోయే సాధారణ ఎన్నికల కోసం ప్రవేశపెట్టే జనాకర్షక బడ్జెట్ కాబోదు అని అభిప్రాయపడ్డారు. 'ఈ ప్రభుత్వాన్ని, నరేంద్ర మోడీ లాంటి బడ్జెట్‌ను అనుమతించబోరని నేను ఖచ్చితంగా నమ్ముతాను' అని తెలిపారు. ఒకవేళ అలాంటిది ప్రవేశ పెట్టినా, అది పేద ప్రజల సంక్షేమం కోసమే అని చెప్పారు. ఈసారి ముఖ్యంగా ఆరోగ్య సదుపాయాలు, ప్రాథమిక విద్య, వ్యవసాయం, నిర్మాణరంగం, ఆర్థిక రంగంలో ఉత్పాదక సామర్థ్యాన్ని పెంచేలా ఉండవచ్చునని ఆయన అన్నారు. దీనికి సంబంధించి ప్రధాని ఈ నెల 10వ తేదీన 30మంది ఆర్థికవేత్తలతో సమావేశం నిర్వహించనున్నట్టు తెలియజేశారు. ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీ, నీతి ఆయోగ్ సీఈవో అమితాబ్ కాంత్, ఉపాధ్యక్షుడు రాజీవ్ కుమార్, ప్రధాని ఆర్థిక సలహాదారు బిబేక్ డెబ్రోయ్, ఇతర ప్రముఖులు ఈ సమావేశానికి హాజరు కానున్నారు.

ఏనుగు దాడిలో అయ్యప్ప భక్తుడు మృతి

తిరువనంతపురం : ఏనుగు దాడిలో అయ్యప్ప భక్తుడు మృతిచెందాడు. దీంతో నిత్యం అయ్యప్ప భక్తులతో కిటకిటలాడే ఆ ప్రాంతంలో విషాదం నెలకొంది. ఈ ఘటన శబరిమలలో సోమవారం చోటుచేసుకుంది. కరిమల పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చెన్నైకి చెందిన 14మంది భక్తులు అయ్యప్ప దర్శనానికి శబరిమలకు బయలుదేరారు. కరిమల అటవీ ప్రాంతంలోని కొండలపై భక్తులు నడుచుకుంటూ వెళ్తుండగా అకస్మాత్తుగా ఆ బృందంలోని నీతిష్ కుమార్‌పై ఏనుగుదాడి చేసింది. దీంతో అతడు తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే వారు అతన్ని దగ్గర్లోని పూటొహిల్స్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అతను అప్పటికే మృతి చెందినట్టు డాక్టర్ ధ్రువీకరించారని పోలీసులు తెలిపారు.

సినిమా హాళ్లలో జాతీయ గీతంపై వెనక్కి తగ్గిన కేంద్రం

- ఆరు నెలల్లో మార్గదర్శకాలు రూపొందిస్తామని సుప్రీంకోర్టుకు తెలిపిన హోంశాఖ

న్యూఢిల్లీ: జాతీయ గీతంపై మునుపటి విధానాన్ని కొనసాగించాలని కేంద్ర ప్రభుత్వం సుప్రీంకోర్టుకు తెలిపింది. 2016, నవంబర్30న సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలను ఆరు నెలల వరకూ నిలిపి వేయాలని కేంద్రం కోరింది. సినిమా హాళ్లలో చిత్ర ప్రదర్శనకు ముందు జాతీయ గీతాలాపన చేయాలని, ఆ సమయంలో లేచి నిలబడాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. సుప్రీంకోర్టు నిర్ణయాన్ని సమర్థించిన కేంద్ర ప్రభుత్వం ఇప్పుడు ఆఅంశంపై పునరాలోచనలో పడ్డట్టు తెలుస్తోంది. దీనికి సంబంధించి కేంద్ర హోంశాఖ ఐదు పేజీల అఫిడవిట్‌ను సోమవారం సుప్రీంకోర్టుకు సమర్పించింది. ఈఅంశంపై మార్గదర్శకాలను రూపొందించేందుకు అంతర్గత మంత్రుల కమిటీని ఏర్పాటు చేసినట్టు కేంద్రం తెలిపింది. విస్తృతమైన సంప్రదింపులు అవసరమని ఓసారి మార్గదర్శకాలు రూపొందించిన తర్వాత నోటిఫికేషన్ జారీ చేస్తామని కేంద్రం తెలిపింది. జాతీయ గీతాలాపన తప్పనిసరి చేయడంపై తమలోనే (న్యాయమూర్తుల్లోనే) భేదాభిప్రాయాలు వ్యక్తం కావడంతో ఈ అంశంపై కేంద్రమే మార్గదర్శకాలు రూపొందించాలని 2017 అక్టోబర్‌లో విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు సూచించింది.

కర్నాటకలో దళితుల బంద్ విజయవంతం

- బాలికపై లైంగికదాడి, హత్యకు నిరసన

హుబ్లీ: కర్ణాటకలో దళితులు నిర్వహిస్తున్న బంద్ విజయవంతమైంది. దళితులపై జరుగుతున్న హింసను ఖండిస్తూ పలు దళిత సంఘాలు బంద్‌కు పిలుపునిచ్చాయి. విజయపుర జిల్లాలో దళిత బాలికపై లైంగిక దాడి జరిపి హత్య చేసినందుకు, కేంద్ర మంత్రి అనంత కుమార్ హెగ్డే రాజ్యాంగ విరుద్ధంగా చేసిన రెచ్చగొట్టే వ్యాఖ్యలు, మహారాష్ట్రలోని భీమా-కోరేగావ్ ఉత్సవాల సందర్భంగా దళితులపై జరిగిన దాడులు, దళిత వ్యతిరేక వ్యాఖ్యలకు నిరసనగా దళిత సంఘాలు బంద్ పిలుపునిచ్చాయి. స్థానికంగా ఉన్న దాదాపు 40 దళిత సంఘాలు ఈ బంద్‌కు మద్దతు ప్రకటించాయి. ప్రధానంగా కర్ణాటకలోని హుబ్లీ-ధర్వాడా ప్రాంతాలలో బంద్ పిలుపుతో పలువురు దళితులు వీధుల్లోకి వచ్చారు. బస్సులు, ఆటోలు తదితర రవాణా వాహనాలపై బంద్ ప్రభావం బాగా పడింది.

మహాత్మాగాంధీని గాడ్సేనే హతమార్చాడు

- బాపూజీ హత్యకేసులో మళ్లీ దర్యాప్తు అవసరంలేదు
- సుప్రీంకోర్టుకు న్యాయ సహాయకుడి నివేదిక



న్యూఢిల్లీ: జాతిపిత మహాత్మాగాంధీని నాథూరామ్ గాడ్సేనే హత్య చేశాడని, ఇందులో విదేశీ హస్తమేమీ లేదని ఈకేసుపై అమికస్ క్యూరీ(న్యాయ సహాయకుడు)గా ఉన్న సీనియర్ న్యాయవాది అమరేందర్ శరణ్ సుప్రీంకోర్టుకు తెలియజేశారు. హత్య కేసును తిరిగి దర్యాప్తు చేయాల్సిన అవసరం లేదని, ఈ మేరకు తన అభిప్రాయాన్ని నివేదిక రూపంలో సుప్రీంకోర్టుకు సోమవారం సమర్పించారు. నివేదికను పరిశీలించిన జస్టిస్ ఎస్ఏ.బాబ్డే నేతృత్వంలోని ధర్మాసనం.. విచారణను ఈ నెల 12కు వాయిదా వేసింది. మహాత్మాగాంధీ హత్య కేసు పునర్విచారణ కోరుతూ దాఖలైన పిటిషన్‌పై సుప్రీంకోర్టు అమికస్ క్యూరీగా సీనియర్ న్యాయవాది అమరేందర్ శరణ్‌ను నియమించిన విషయం తెలిసిందే. నేషనల్ ఆర్కైవ్స్ నుంచి అవసరమైన పత్రాలు, ఇతర అంశాలు క్షుణ్ణంగా పరిశీలించాకే ఈ నివేదికను రూపొందించినట్టు అమరేందర్ వెల్ల డించారు. నాలుగో బుల్లెట్ గాంధీ ప్రాణం తీసిం దన్న అంశం ఉత్తదేనని ఆయన తేల్చేశారు. 1948 జనవరి 30న గాంధీజీ హత్యకు గురైన విషయం తెలిసిందే. నాథూరామ్ గాడ్సే తుపాకీతో కాల్చి బాపూజీని హత్య చేశాడు. ఈకేసు విచారణ చేపట్టిన న్యాయస్థానం గాడ్సే, నారాయణ్ ఆప్టేకు ఉరిశిక్ష విధించింది. 1949 నవంబర్‌లో వీరిని ఉరి తీశారు. ఇదిలా ఉండగా.. బాపూజీ హత్య కుట్రలో మూడో వ్యక్తి ప్రమేయం ఉందంటూ ముంబయికి చెందిన పరిశోధకుడు పంకజ్ ఫడ్నవీస్ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ కేసును మళ్లీ విచారించాలని కోరారు. దీనిపై గతేడాది అక్టోబరులో విచారణ చేపట్టిన న్యాయస్థానం ఆ మూడో వ్యక్తి జీవించి ఉన్నాడో లేదో చెప్పాలని పిటిషనర్‌కు సూచించింది.



రాజస్థాన్‌లో గోగూండాల రాజ్యం

మైనార్టీలు లక్ష్యంగా దాడులు

- బీజేపీ సర్కారు వత్తాసు
- బాధితులను నిందితులుగా చేర్చుతున్న వైనం
- నిజనిర్ధారణ బృందం పరిశీలనలో వెల్లడి
- రాష్ట్రంలో రెండు రోజులు పర్యటించిన భూమి అధికార్ ఆందోళన్ నేతలు

నవతెలంగాణ-న్యూఢిల్లీబ్యూరో

రాజస్థాన్‌లో గోగూండాలు రాజ్యమేలుతున్నారని, మైనార్టీలు లక్ష్యంగా దాడులకు పాల్పడుతున్నారని భూమి అధికార్ ఆందోళన్ నిజనిర్ధారణ బృంద పరిశీలనలో వెల్లడైంది. గోగూండాలకు బీజేపీ నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యక్షంగా, పరోక్షంగా ప్రోత్సాహమిస్తోందని తేలింది. తటస్థంగా ఉండాల్సిన అధికారిక యంత్రాంగం సైతం గోగూండాలకు వత్తాసు పలుకుతూ.. బాధితులను నిందితు లుగా చేర్చుతోందని తెలిసింది. ఈనెల 6, 7వ తేదీల్లో భూమి అధికార్ ఆందోళన్ నేతృత్వంలోని ఓ బృందం రాజ స్థాన్‌లో పర్యటించింది. గోరక్షపేరిట అమాయకులను హత్య చేసిన ఘటన ప్రాంతాలను బృందం సందర్శించింది. బాధిత కుటుంబాలతో చర్చించింది. ఈబృందంలో సీపీఐ(ఎం) ఎం పీలు కేకే రాగేష్, బద్రుద్దుజా ఖాన్‌తో పాటు అఖిల భారత రైతు సంఘం నేతలు అమ్రారాం, విజుకృష్ణన్, కృష్ణప్రసాద్ తదితరులున్నారు. ఈబృందం రాష్ట్రంలోని అల్వార్, భారత్ పూర్,ఉదయ్‌పూర్, రాజసమంద్ ప్రాంతాల్లో పర్యటించింది.

రాజస్థాన్ పర్యటన వివరాలు, ప్రస్తుతం రాష్ట్రంలో పరిస్థితిని ఢిల్లీలోని 36 క్యానింగ్‌లైన్‌లో గల అఖిలభారత రైతు సంఘం కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బృందం నేతలు వివరించారు. ఈ సందర్భంగా ఎంపీ కేకే రాగేష్ మాట్లాడుతూ.. భారత్‌పూర్ జిల్లాలోని ఘాట్‌మీకా గ్రామంలో గోగూండాలు హత్య చేసిన ఉమర్‌ఖాన్ కుటుంబాన్ని పరామర్శించినట్టు తెలిపారు. మేవాత్ ప్రాంతానికి చెందిన ఈ గ్రామంలో హిందువులు, ముస్లిములు కలిసిమెలిసి జీవిస్తున్నారని చెప్పారు. గ్రామంలో అత్యధికులు పశుపోషణ ఆధారంగా కుటుంబం పోషించుకుంటున్నారని వివరించారు. మృతుని కుటుంబం కడుపేదరికంలో ఉందని, గోరక్షక మూతాలు ఉమర్‌ఖాన్‌ను హత్య చేసిన తరువాత బీజేపీ నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఒక్క పైసా పరిహారం అందలేదని తెలిపారు. పైగా మేవాత్ ప్రాంతంలోని ముస్లిములందరినీ నేరగాళ్లుగా ముద్రించే ప్రయత్నం అక్కడి జిల్లా యంత్రాంగం, బీజేపీ ప్రజాప్రతినిధులు చేస్తున్నారని విమర్శించారు. పోలీసు డిపార్ట్‌మెంట్‌లో కొంతమంది మతతత్వశక్తులతో కలిసి పని చేస్తున్నారని చెప్పారు. గోరక్షకుల కోసం పోలీసు పోస్టు సైతం ఏర్పాటు చేశారని దుయ్యబట్టారు. పైగా అల్వార్‌లో పెహ్లూఖాన్ హత్యలో నిందితుల పేర్లను ఛార్జిషీట్ నుంచి పోలీసులే తొలగించారని విస్మయం వ్యక్తంచేశారు. ఈ విషయమై అల్వార్ కలెక్టర్, ఎస్పీని కలిశామని చెప్పారు. బాధితుల పట్ల ఇరువురు వ్యతిరేక వైఖరి ప్రదర్శించారని వివరించారు.



బాధితులను పరామర్శిస్తున్న భూమి అధికార్ ఆందోళన్ నేతలు

లవ్‌జిహాద్ పేరిట రాజసమంద్‌లో అతికిరాతకంగా నరికిచంపిన ప్రాంతాన్ని సైతం బృందం పరిశీలించినట్టు తెలిపారు. ఈ ప్రాంతానికి చెందిన కలెక్టర్, ఎస్పీని కలిశామని చెప్పారు. మృతుడు అఫ్రజుల్ కుటుంబానికి ప్రభుత్వం ఐదు లక్షల పరిహారం ప్రకటించిందని, కానీ ఇప్పటి వరకు చెల్లించలేదని అన్నారు. ఉదయ్‌పూర్‌లో ప్రజా విచారణ చేపట్టామని తెలిపారు. అలాగే ఈ జిల్లాలో బహిరంగ మలవిసర్జన చేస్తున్న మహిళల చిత్రాలు తీయొద్దని అడ్డుకున్న జాఫర్‌ఖాన్‌ను హత్య చేసిన ప్రతాప్‌గడ్‌లోనూ పర్యటించామని తెలిపారు. జాఫర్‌ఖాన్ భార్య రషీదాబీతో మాట్లాడినట్టు చెప్పారు. తమ కుటుంబానికి ప్రభుత్వం నుంచి ఎలాంటి పరిహారమూ లభించలేదని ఆమె వాపోయిందని అన్నారు. రాజస్థాన్‌లో మతోన్మాద హత్యలపై పోరాటం చేయాల్సి న ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్ పార్టీ పూర్తిగా విఫలమైందని మరో ఎంపీ బద్రుద్దుజా ఖాన్ విమర్శించారు. ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు బీజేపీ, ఆర్ఎస్ఎస్ నాయకులు ప్రజల మధ్య వైషమ్యాలు రెచ్చగొడుతున్నారని అన్నారు. ఇకపై రాష్ట్రంలో ఇలాంటి ఘటనలు జరగకుండా చర్యలు చేపట్టాలని ఎస్పీకి, కలెక్టర్‌కు సూచించామని చెప్పారు. రాజస్థాన్‌లో నిజనిర్ధారణ బృందం జరిపిన పర్యటన వివరాలతో ఓ నివేదికను రూపొందిస్తామని అఖిలభారత రైతు సంఘం నేత విజు కృష్ణన్ తెలిపారు. ఫిబ్రవరి 2, 3వ తేదీల్లో నిర్వహించనున్న జాతీయ సదస్సులో ఈ నివేదికను విడుదల చేయనున్నట్టు చెప్పారు. అనంతరం ఈ నివేదికను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో పాటు జాతీయ మానవ హక్కుల కమిషన్‌కు నివేదిస్తామని వివరించారు.

ఐటీ రంగంలో పెరుగుతున్న మోసాలు

హైదరాబాద్ : ఉద్యోగాల పేరుతో యువతను నట్టేట ముంచే ఎత్తుగడలతో చెలరేగిపోతున్న బూటకపు ఐటీ కంపెనీల బెడద నానాటికీ తీవ్రమవుతున్నది. ఈ పరిస్థితి హైదరాబాద్ యువతకు పెద్ద సమస్య కాగా, ఆ మోసాలపై అందుతున్న ఫిర్యాదులను పరిశీలించడం పోలీసు యంత్రాంగానికి పెద్ద సవాలుగా మారింది. సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో గత ఏడాది కాలంలో ఈ రకమైన 72 ఫిర్యాదులు పోలీసులకు అందాయి. సైబరాబాద్ పరిధిలో 72 కేసులు, హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో 52, రాచకొండ పరిధిలో 38 కేసులు నమోదయ్యాయి. ఉద్యోగాల కల్పన వేదికలుగా సేవలు అందిస్తున్న మాన్‌స్టర్ డాట్‌కామ్, నౌకరీ డాట్‌కామ్‌ల నుంచి మోసగాళ్లకు అభ్యర్థుల వివరాలు సులభంగా లభిస్తున్నాయని ఏసీపీ (సైబర్ క్రైమ్) తెలియజేశారు. ఈ సమాచారం కోసం ఆయా కంపెనీలకు కొంత కమిషన్ కూడా ఇస్తున్నట్టు ఆయన తెలిపారు. ఆ రకంగా సేకరించిన సమాచారం ఆధారంగా ఐటీ ఉద్యోగాల పేరుతో వారు మోసాలకు పాల్పడుతున్నారు. వెబ్‌సైట్ నుంచి తమకు అందిన వివరాల ఆధారంగా ఎంపిక చేసినట్టు నచ్చజెబుతూ, వేర్వేరు కారణాలు చూపిస్తూ వారి నుంచి వసూళ్లు చేస్తున్నాయి. ఈ తరహా మోసగాళ్లు ఎక్కువగా ఢిల్లీ, బెంగళూరు కేంద్రాలుగా కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. ఉద్యోగాలతో పాటు కెనడా, ఆస్ట్రేలియా దేశాలకు వీసాల పేర కూడా మోసాలు అధికమవుతున్నాయని ఆయన చెప్పారు. వీసా మోసాలలో దాదాపు 70 శాతం నైజీరియన్ ముఠాల ద్వారానే జరుగుతున్నాయని ఆయన చెప్పారు. జాగ్రత్త !!



కార్యరూపం దాల్చని గోవాలో యుద్ధ నౌకల తయారీ

'మేక్ ఇన్ ఇండియా' పేరుతో చేసిందంతా హడావిడేనా ?



న్యూఢిల్లీ : 'మేక్ ఇన్ ఇండియా' పేరుతో భారత ప్రధాని మోడీ చేసిన హడావిడి అంతా ఉత్తదేనని తేలిపోయింది. గోవాలో యుద్ధ నౌకల నిర్మాణానికి సంబంధించి ద.కొరియాతో చేసుకున్న 32వేల కోట్ల రూపాయల ఒప్పందం కార్యరూపం దాల్చలేదు. ప్రాజెక్టు వ్యయం పెరిగిపోవ టం, సమాచార బదిలీ, ఇతర కారణాల వల్ల ప్రాజెక్టు నిలిచిపోయినట్టు వార్తలు వెలువడుతున్నాయి. తూర్పు, పశ్చిమ తీరంలో భారత కోస్ట్‌గార్డ్ కోసం 24 మినీ కౌంటర్ యంసీయంవీ(యుద్ధ నౌకలు) తయారు చేయాలని భారత ప్రభుత్వం నిర్ణయించింది. సముద్రంపై శత్రుదేశాల బాంబు దాడుల్ని యంసీయంవీ నౌకలు తిప్పిగొట్టగలవు. ఇలాంటివి ప్రస్తుతం భారత నౌకాదళం వద్ద కేవలం నాలుగు మాత్రమే ఉన్నాయి. 'మేక్ ఇన్ ఇండియా'లో భాగంగా విదేశీ షిప్ యార్డ్ భాగస్వామ్యంతో గోవాలో యుద్ధ నౌకల తయారీ చేపట్టాలని మోడీ సర్కార్ 2015లోనే నిర్ణయించింది. రక్షణ శాఖకు సంబంధించి కీలకమైన ఈ ప్రాజెక్టు గత ఏడాదే పట్టాలెక్కాల్సింది. అన్నీ అనుకున్నట్టుగా జరిగితే, గోవా షిప్ యార్డ్‌లో యుద్ధ నౌకల తయారీ ప్రారంభమయ్యేది. ఈ ప్రాజెక్టు కోసం మోడీ సర్కార్ సీరియస్‌గా ప్రయత్నాలు చేయకపోవటమే ఒప్పందం పక్కకు పోవడానికి కారణమని వార్తలు వెలువడ్డాయి. ద.కొరియాతో ఒప్పందం దాదాపు రద్దయినట్టే ! అందుకే ఈప్రాజెక్టుకు సంబంధించి కేంద్రం కొద్ది రోజుల క్రితం 'ఆసక్తి వెల్లడి' (ఇతర దేశాల కోసం) ప్రకటనలు జారీ చేసింది. త్వరలో ఈ ప్రాజెక్టుపై కొత్త టెండర్లను కేంద్రం ప్రకటించనున్నది.

విస్తృత ధర్మాసనానికి 'స్వలింగ సంపర్కం' కేసు

- సెక్షన్ 377లోని అంశాలను పరిశీలించాలని విస్తృత ధర్మాసనాన్ని కోరిన సుప్రీం

న్యూఢిల్లీ: ఇష్టపూర్వకంగా ఇద్దరు వ్యక్తుల మధ్య జరిగే స్వలింగ సంపర్కాన్ని చట్టబద్ధం చేయాలని కోరుతూ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరిపిన సుప్రీం కోర్టు ఈ అంశంపై సమీక్ష జరపాలని విస్తృత ధర్మాసనానికి సూచించింది. ప్రధాన న్యాయమూర్తి దీపక్ మిశ్రా, ఏఎం ఖాన్విల్కర్, డివై చంద్రచూడ్‌లతో కూడిన ధర్మాసనం ఇండియన్ పీనల్ కోడ్(ఐపీసీ) సెక్షన్ 377 లోని అంశాలపై చర్చించాలని విస్తృత ధర్మాసనాన్ని కోరింది. స్వలింగ సంపర్కం నేరమని సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ నవతేజ్ సింగ్ జోహార్ మరో నలుగురు వ్యక్తులు సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. పిటిషనర్ తరుపు న్యాయవాది అరవింద్ దతార్ వాదిస్తూ.. సెక్షన్ 377లోని నిబంధనలు రాజ్యాంగానికి విరుద్ధంగా ఉన్నాయని అన్నారు. ఏకాభిప్రాయంతో ఇద్దరు వ్యక్తుల మధ్య జరిగే లైంగిక చర్యను నేరమని మీరు జైల్లో వేయలేరు, లైంగిక భాగస్వామిని ఎన్నుకునే హక్కు ప్రతి ఒక్కరికీ ఉంటుంది. ఈ హక్కు ప్రాథమిక హక్కుల్లో భాగమని ఆయన వాదించారు. ఈ సెక్షన్‌లలోని అంశాలపై పున:సమీక్ష జరపాలని విస్తృత ధర్మాసనాన్ని సుప్రీం కోర్టు కోరింది. అలాగే 2009లో సెక్షన్ 377 నిబంధనలు రాజ్యాంగానికి వ్యతిరేకంగా ఉన్నాయని ఎన్‌జీవోకు చెందిన 'నాజ్ ఫౌండేషన్', ఢిల్లీ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ఆ కేసులో ఢిల్లీ హైకోర్టు తీర్పును కూడా ఆయన ప్రస్తావించారు. నిబంధనలు రాజ్యాంగబద్ధంగానే ఉన్నాయని తీర్పునిస్తూ 2014లో ఢిల్లీ హైకోర్టు తీర్పును కొట్టివేసింది. ఆ తీర్పును సవాలు చేస్తూ ఇప్పుడు మళ్లీ కొత్త ఫిటిషన్ దాఖలు అయ్యింది. ఇప్పుడు ఈ విషయంపై విస్తృత ధర్మాసనం విచారించనుంది.

జిగ్నేశ్ ఢిల్లీ సభకు అనుమతి నిరాకరణ



న్యూఢిల్లీ : దళిత నేత, గుజరాత్ ఎమ్మెల్యే జిగ్నేశ్ మెవానీ మంగళవారం దేశ రాజధానిలో యువ గర్జన పేరుతో నిర్వహించ తలపెట్టిన సభకు పోలీసులు అనుమతి నిరాకరించారు. రాబోయే గణతంత్ర దినోత్స వేడుకలను పురస్కరించు కొని ఢిల్లీలో 144వ సెక్షన్ అమలులో వున్నందున శాంతి భద్రతల దృష్ట్యా మెవానీ సభకు అనుమతి నిరాకరించామని పోలీసులు తెలిపారు. ఈ సభలో దళితులకు భూమి, ఆత్మ గౌరవం, విద్యా తదితర అంశాలపై జిగ్నేశ్ ప్రసంగించాలనుకున్నట్టు తెలుస్తోంది. ర్యాలీ తర్వాత తాను ప్రధాన మంత్రి కార్యాలయానికి ఒక చేతిలో మనుస్మృతి, మరో చేతిలో రాజ్యాంగాన్ని పట్టుకొని వెళతానని, రెండింటిలో ఏదో ఒకటి ఎంచుకోవాల్సిందిగా ప్రధానిని కోరతానని దళిత ఎమ్మెల్యే ఇప్పటికే ప్రకటిం చారు. భీమా-కోరేగావ్‌లో హిందూత్వమూకల నాయకత్వ నీడన పెట్టిన చిచ్చు, ఆతర్వాత మహారాష్ట్ర బంద్ నేపథ్యంలో ముంబయిలో ఈ నెల 4న జరగాల్సిన సభకు జిగ్నేశ్, జేఎన్‌యూ విద్యార్థి ఉమర్ ఖాలీద్‌కు పోలీసులు అనుమతి నిరాకరించిన విషయం తెలిసిందే. పోలీసుల నిర్ణయానికి వ్యతిరేకంగా సభా ప్రాం గణం వద్ద వేలాది మంది విద్యార్థులు ఆ రోజు పెద్దఎత్తున ఆందోళన చేశారు. ఆందోళన చేస్తున్న విద్యార్థులను, ఆ కార్యక్రమనిర్వాహకులు సచిన్ బన్సోడె, ఛత్రా భారతి, సాగర్ బలరావ్, ఎఎల్‌సీ కపిల్‌లను పోలీసులు అరెస్టు కూడా చేశారు.

సీఎం గురించి మాట్లాడితే నాలుక కోస్తా

- జ్యోతిరాధిత్య సింధియాపై బీజేపీ నేత దురుసు వ్యాఖ్యలు

భోపాల్ : కాంగ్రెస్ నేత జ్యోతిరాధిత్య సింధియాపై బీజేపీ నాయకుడు దురుసు వ్యాఖ్యలు చేశారు. సీఎం శివరాజ్ సింగ్ చౌహాన్‌పై వేలెత్తి చూపిన వారి చేతులు నరకుతామని, గొంతెత్తితే నాలుక కోస్తామని మధ్యప్రదేశ్ నేత రాధేశ్యాం హెచ్చరించారు. సీఎం చౌహాన్ కుమారుడు కార్తికేయ చౌహాన్ సమక్షంలో జ్యోతిరాదిత్య సింధియాను ప్రస్తావిస్తూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. మధ్యప్రదేశ్‌లోని కొలారస్‌లో ఆదివారం జరిగిన బహిరంగ సభలో కాంగ్రెస్ నేతలను ఉద్దేశించి బీజేపీ నేత రాధే శ్యాం ధకడ్ చేసిన ప్రసంగ వీడియో సామాజిక మాధ్యమంలో వైరల్ అయ్యింది. జ్యోతిరాధిత్య సింధియా సీఎం నుద్దేశించి అభ్యంతరకరంగా మాట్లాడుతున్నారని ఆరోపించారు. కాగా ఈ వ్యాఖ్యలపై కాంగ్రెస్ సానుకూలంగా స్పందించింది. 'వ్యక్తిగత శత్రుత్వంపై ద్వేషపూరిత రాజకీయాలపై మాకు నమ్మకంలేదు. మర్యాదపూర్వకమైన భాషను ఉపయోగించడంపై దృష్టిపెట్టాలని కాంగ్రెస్ అధ్యక్షులు రాహుల్ గాంధీ మాకు ఇప్పటికే ఆదేశించారు' అని కాంగ్రెస్ అధికార ప్రతినిధి పంకజ్ చతుర్వేది చెప్పారు.

12న అంతరిక్షంలోకి 31శాటిలైట్లు

- శ్రీహరి కోట నుంచి ప్రయోగం

బెంగళూరు: ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీహరికోట నుంచి ఈ నెల 12న 31 ఉపగ్రహాలను ఇస్రో ప్రయోగించబోతున్నది. గతంలో ప్రకటించినట్టుగా ఈ నెల 10న కాకుండా రెండురోజుల వాయిదా వేసుకుని 12న ఈ ప్రయోగాన్ని చేపట్టనున్నది. భూమిని పరిశీలించే కార్టోశాట్ స్పేస్‌క్రాఫ్ట్‌తోపాటు అమెరికా, ఇతర నాలుగు దేశాలకు చెందిన 28 శాటిలైట్‌లు సహా రెండు శాటిలైట్‌లను 12న ఉదయం 9గంటల 30 నిమిషాలకు పంపించనున్నట్టు ఇస్రో పబ్లిక్ రిలేషన్స్ డైరెక్టర్ దేవి ప్రసాద్ కార్నిక్ తెలిపారు. ఎనిమిదవ నావిగేషన్ శాటిలైట్ ప్రయోగం గత ఏడాది ఆగస్టులో విఫలమైన విషయం విదితమే. 12న అంతరిక్షంలోకి పంపబోతున్న పోలార్ శాటిలైట్ లాంచ్ వెహికల్ (పీఎస్ఎల్వీ-సీ4) ప్రయోగమే 2018లో మొదటిది కానున్నది.

సెన్సార్‌బోర్డు సర్టిఫికెట్ ఇచ్చినా...

'పద్మావత్' చల్లారడంలేదు

న్యూఢిల్లీ : పద్మావతి సినిమా పేరును పద్మావత్‌గా మార్చారు. దాదాపు 20కి పైగా కత్తెరలు వేశారు. ఆ తర్వాత విడుదలకు సెన్సార్ బోర్డు ఆమోదం తెలిపింది. ఈనెల 25న విడుదలకు సిద్ధమవుతున్న పద్మావత్‌పై హిందూత్వ వాదులు వివాదాన్ని రేపుతూనే ఉన్నారు. ఆ సినిమా విడుదలను తాము అనుమతించబోమని బీజేపీ పాలిత రాష్ట్రం రాజస్థాన్ హోం మంత్రి గుల్బచన్ కటారియా చెప్పారు. శాంతి భద్రతలను దృష్టిలో ఉంచుకుని మేం ఈ సినిమాను వ్యతిరేకిస్తున్నామని, విషయాన్ని నేను ప్రధాని దృష్టికి కూడా తీసుకెళ్తానని అన్నారు. రాజ్‌పుత్రులు కూడా 'పద్మావత్'పై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కేవలం సినిమా పేరును మాత్రమే మారిస్తే సరిపోదని, సినిమాలోని పాత్రధారుల పేర్లను కూడా మార్చాలని రాజ్‌పుత్ కర్ణిసేన డిమాండ్ చేసింది. తమకు అభ్యంతరకర సన్నివేశాలుంటే చూస్తూ ఊరుకోబోమని, ఆ తర్వాత జరిగే పరిణామాలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు.

బెంగళూరు బార్‌లో ఘోర అగ్నిప్రమాదం

- ఐదుగురు సజీవ దహనం

బెంగళూరు : సోమవారం తెల్లవారుజామున బెంగళూరులోని కలాసిపాళ్యం ప్రాంతంలోని ఓ బార్‌లో జరిగిన ఘోర ప్రమాదంలో మహిళతో సహా ఐదుగురు సజీవ దహనమయ్యారు. బార్ పూర్తిగా అగ్నికి ఆహుతయ్యింది. మృతులంతా ఆ బార్‌లో ఉద్యోగులు కావడం గమనార్హం. వీరంతా పొట్టకూటి కోసం బెంగళూరుకు వలస వచ్చిన వారని పోలీసులు తెలిపారు. మంటలు వ్యాపించినప్పుడు వారు లోపల నిద్రిస్తున్నట్టు చెప్పారు. మృతుల్లో తూమకూరుకు చెందిన స్వామి(23), ప్రసాద్(20), మహేశ్(35)లతోపాటు హసాన్ నుంచి వచ్చిన మంజునాథ్(45), మాండ్యాకి చెందిన కీర్తి(24)లుగా గుర్తించారు. ఆదివారం అర్ధరాత్రి దాటిన తర్వాత 2.30 గంటల ప్రాంతంలో మంటలు చెలరేగాయి. కాగా, ఘటనపై ఇప్పటికే విచారణ ప్రారంభించామనీ... ప్రమాదానికి గల కారణాలు ఇంకా తెలియరాలేదని వెస్ట్ డివిజన్ డీసీపీ ఎమ్ఎన్ అనుచేత్ పేర్కొన్నారు.



గోరఖ్‌పూర్‌లో ఆస్పత్రిలో

ఉత్తరప్రదేశ్‌లోని గోరఖ్‌పూర్ బీఆర్‌డీ ఆస్పత్రిలోనూ సోమవారం తెల్లవారుజామున మంటలు వ్యాపించాయి. ఆస్పత్రి ప్రిన్సిపల్ కార్యాలయం, పక్కనే ఉన్న రికార్డుల రూమ్‌లో మంటలంటున్నట్టు పోలీసులు తెలిపారు. ఈ ప్రమాదంలో ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదు. 'షార్ట్ సర్క్యూట్ వల్లే ఈ ప్రమాదం జరిగినట్టు ప్రాథమిక దర్యాప్తుల్లో తేలింది' అని ఎస్పీ గణేశ్ సహ చెప్పారు.

ముంబయి సెషన్స్ కోర్టులో

ముంబయిలోని సెషన్స్ కోర్టు బిల్డింగ్‌లో మంట లు వ్యాపించాయి. సెషన్స్ కోర్టు మూడో ఫ్లోర్‌లో ఉదయం 7.50గంటల సమయంలో మంటలంటు న్నట్టు గుర్తించారు. వెంటనే అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు.

కట్టెబట్టుకున్నడు.. బిల్ల కట్టుకున్నడు...

గట్లాంటప్పుడు వీఆర్‌ఏ ఎందుగ్గాడు...? :

సాయిలు మృతిపై ఆయన భార్యా పిల్లల ఆవేదన

- డ్యూటీకి పాయ్యొత్తానని చెప్పిండు.. మల్లరాలే...
- ఇది ముమ్మాటికీ ఇసుక మాఫియా హత్యే : టీ మాస్
- మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామని వెల్లడి
- కేసీఆర్ సమాధానం చెప్పాలి : గద్దర్


గద్దర్‌కు తమగోస వినిపిస్తున్న సాయిలు కుటుంబసభ్యులు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

'కట్టెబట్టుకున్నడు.. బిల్ల కట్టుకున్నడు... గట్లాంటప్పుడు మా నాన్న వీఆర్‌ఏ ఎందుగ్గాడు...?' అంటూ ఇటీవల మరణించిన వీఆర్‌ఏ సాయిలు కూతురు లావణ్య, కొడుకు విఠల్.. టీఆర్‌ఎస్ సర్కారును ప్రశ్నించారు. 'ఆ రోజు రాత్రి అన్నం అయ్యిందా..? అని అడిగిండు. అన్నం పెడితే తిన్నడు. డ్యూటీకి పోతున్నా అని చెప్పిండు.. గట్ల చెప్పినోడు గటే పోయిండు.. మల్లరాలే...' అని సాయిలు భార్య సాయమ్మ కన్నీటి పర్యంతమైంది. ఆయన్ను కచ్చితంగా ఇసుక మాఫియానే పొట్టనబెట్టుకున్నదని వారు ఈ సందర్భంగా చెప్పారు. ఇసుక ట్రాక్టర్‌తో ఢీకొట్టించి చంపారని గద్గద స్వరంతో తెలిపారు.

కామారెడ్డి జిల్లా పిట్లం మండలం కారెంగావ్ గ్రామానికి చెందిన వీఆర్‌ఏ సాయిలు ఇటీవల మరణించిన సంగతి తెలిసిందే. ఇసుక మాఫియా కుమ్మక్కై ట్రాక్టర్‌తో ఢీకొట్టించటం వల్లే ఆయన మరణించాడని ఆరోపిస్తూ తెలంగాణ సామాజిక ప్రజా సంఘాల ఐక్య వేదిక (టీ మాస్ ఫోరం) ఆధ్వర్యాన సోమవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. సీఐటీయు రాష్ట్ర ఉపాధ్యక్షులు సుధాభాస్కర్, టీ మాస్ ఫోరం రాష్ట్ర కన్వీనర్ జాన్‌వెస్లీ, నాయకులు శ్రీరాంనాయక్, మన్నారం నాగరాజు, వీఆర్‌ఏల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వంగూరు రాములు తదితరులు ఈ సందర్భంగా మాట్లాడారు. కార్యక్రమానికి సాయిలు భార్య సాయమ్మ, కూతురు లావణ్య, కొడుకు విఠల్‌తోపాటు సాయిలు తండ్రి నారాయణ, తమ్ముడు సంతోశ్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సాయిలు వీఆర్‌ఏ అని చెప్పేందుకు అవసరమైన అన్ని సాక్ష్యాలను వారు మీడియా ముందుంచారు.

ఆ సందర్భంగా జాన్‌వెస్లీ మాట్లాడుతూ.. తెలంగాణాలో ఒకే కుటుంబానికి చెందిన వారు వీఆర్‌ఏలుగా వంతుల వారీగా పనిచేయటం ఆనవాయితీగా వస్తున్నదని తెలిపారు. ఈ క్రమంలో సాయిలు 2017 జూన్ నుంచి వీఆర్‌ఏగా విధులు నిర్వర్తిస్తున్నాడని చెప్పారు. స్థానిక తహశీల్దారు కూడా ఆయనకు డ్యూటీలు వేశారని గుర్తుచేశారు. అందుకనుగుణంగా రిజిస్టర్‌లో తహశీల్దారు సంతకాలు కూడా చేశాడని తెలిపారు. ఈ నేపథ్యంలో ఇసుక మాఫియాకు వత్తాసు పలుకుతున్న ప్రభుత్వం.. సాయిలు మృతిపై వక్రభాష్యాలు చెబుతున్నదని విమర్శించారు. సాయిలు అసలు వీఆర్‌ఏనే కాదంటూ మంత్రి కేటీఆర్ చెప్పటం సిగ్గుచేటన్నారు. ఇప్పటికైనా నిజాలను నిగ్గు తేల్చాలని డిమాండ్ చేశారు. సాయిలు మృతికి కారణమైన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

లేదంటే పిట్లం తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తామని హెచ్చరించారు. 16న రాష్ట్రంలోని అన్ని ఎమ్మార్వో ఆఫీసులను ముట్టడిస్తామని తెలిపారు. 22న కలెక్టరేట్ల వద్ద ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ అంశంలో బాధితులకు న్యాయం చేయాలని కోరుతూ రాష్ట్ర మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామని తెలిపారు. రాములు మాట్లాడుతూ.. సాయిలు కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకోవాలని డిమాండ్ చేశారు. రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియోనివ్వాలని, కుటుంబంలో ఒకరికి ఉద్యోగమివ్వాలని కోరారు.

ఇప్పుడు మా పరిస్థితేంది...? సాయమ్మ (సాయిలు భార్య)

"ఆయన పోయిండు. గిప్పుడు మా పరిస్థితేంది? ఇద్దరు ఆడపిల్లలు, ఒక మగ పిలగాడు మాకున్నడు. మాతోపాటు మా మామ, అత్త ఉన్నరు. గా ముసలోల్ల పరిస్థితేంది? మా ఆయన్ని ఇసుక ట్రాక్టర్‌తోనే గుద్ది చంపిన్రు..."

ఆర్డర్ జీరాక్స్ కాపీగూడ ఉన్నది...సంతోశ్ (సాయిలు తమ్ముడు)

"మా అన్న వీఆర్‌ఏగా పనిచేత్తున్నడనటానికి మా దగ్గర బలమైన సాక్షాలున్నయ్. ఆయన్ను డ్యూటీలోకి తీసుకున్నట్టు ఎమ్మార్వో ఆర్డర్ కాపీ ఇచ్చిండు. దాని జీరాక్స్ గూడ ఉన్నది. 1992లో మా నాన్న పేర ఆర్డర్ కాపీ వచ్చింది. అయితే ఆయనకు చదువురాదు కాబట్టి.. చదువుకున్న మమ్మల్ని డ్యూటీకి రావాలంటూ ఎమ్మార్వో చెప్పిండు. అందుకని వాటాబందీ పద్ధతిలో వీఆర్‌ఏలుగా నేను, మా అన్న పనిచేస్తున్నం.. మొన్నటిదాకా నేను జేసిన. గతేడాది జూన్ నుంచి మా అన్న డ్యూటీ చేస్తున్నడు..."

గద్దర్ పరామర్శ...

సాయిలు కుటుంబ సభ్యులను ప్రజా గాయకుడు గద్దర్ పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన వారిని ఓదార్చారు. ఉమ్మడి రాష్ట్రంలో కారంచేడు దళితులు అనుభవించిన హింసే.. ఇప్పుడు తెలంగాణాలో అణగారిన వర్గాలు అనుభవిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సాయిలు మృతిపై సీఎం కేసీఆర్ నోరు విప్పాలని డిమాండ్ చేశారు. నిజ నిర్ధారణ కోసం తాను స్వయంగా కారెంగావ్‌కు వెళతానని చెప్పారు.

సాయిలు హత్యను ఎందుకు దాచి పెడుతున్నారు?

- గవర్నర్, సీఎం,మంత్రులు, కలెక్టర్, పోలీసోళ్లు కుమ్మక్కు
- ఉత్తమ్‌ను కలిసిన సాయిలు కుటుంబం


ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కలిసిన సాయిలు కుటుంబ సభ్యులు

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

ఇటీవల ఇసుక మాఫియా చేతిలో మృతి చెందిన సాయిలు అనే వ్యక్తి ముమ్మాటికి వీఆర్‌ఏనే అని టీపీసీసీ ఆధ్యక్షులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి విమర్శించారు. సాయిలు వీఆర్‌ఏ తహసిల్దారే సంతకం పెట్టారని చెప్పారు. సాయిలు వీఆర్‌ఏ బ్యాడ్జీ, ఎమ్మార్వో సంతకాలు పెట్టిన రిజిస్టర్ వంటి స్లిప్‌లను ఆయన కుటుంబ సభ్యులు మీడియాకు చూపిం చారు. సోమవారం గాంధీభవన్‌లో మాజీ ఎమ్మెల్యే అరుణ తార ఆధ్వర్యంలో వీఆర్‌ఏ సాయిలు కుటుంబ సభ్యులు తల్లిదండ్రులు శివయ్య, ఈరవ్వ, భార్య సాయవ్వతో పాటు పిల్లలు ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని కలిశారు. ఈ సంద ర్భంగా బాధితులతో మాట్లాడి పలు విషయాలను అడిగి తెలుసు కున్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ సాయిలు మరణం పై ప్రభుత్వం తీరు సరి కాదన్నారు. సాయిలు హత్యను ఎందుకు దాచి పెడుతున్నారని ప్రశ్నించారు. గవర్నర్, ముఖ్యమంత్రి, మంత్రులు, కలెక్టర్, పోలీసోళ్లు ఈ విషయంలో కుమ్మక్క య్యారని ఆరోపించారు. పోలీసులు, ప్రభుత్వం సాయిలు మరణంపై గవర్నర్‌కు తప్పుడు నివేదిక ఇచ్చారని విమర్శించారు. పోలీసుల సాయంతో ప్రభుత్వం వాస్తవా లను కప్పిపుచ్చే ప్రయత్నం చేస్తున్నద న్నారు. సాయిలు కుటుంబానికి ప్రభుత్వం రూ.25లక్షల ఎక్స్‌గ్రే షియాతో పాటు పిల్లలకు ప్రభుత్వం తరపున ఉచిత విద్యను అందించాలని, ఈ ఘటనకు కారణమైన ఇసుక ట్రాక్టర్ యజమాని పై 302 సెక్షన్ కింద మర్డర్ కేసు నమో దు చేయాలని కోరారు. పార్టీ తరుపున ఆ కుటుంబాన్ని ఆదు కుంటామని ఆయన హామీ ఇచ్చారు. అణగారిన వర్గాలకు ఈ తెలంగాణలో జీవించే హక్కు లేదా అంటూ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.

గణతంత్ర వేడుకలకు ఘనంగా ఏర్పాట్లు

- అధికారులకు సీఎస్ ఆదేశం

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

గణతంత్రదినోత్సవ వేడుకలకు ఘనంగా ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్పీ సింగ్ ఆదేశించారు. సోమవారం సచివాలయంలో గణతంత్రదినోత్సవ వేడుకల నిర్వహణపై ఉన్నతాధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సాధారణ పరిపాలన శాఖ ముఖ్య కార్యదర్శి అధర్ సిన్హా, గవర్నర్ ముఖ్య కార్యదర్శి హరిప్రీత్ సింగ్, రోడ్లు, భవనాల శాఖ ముఖ్య కార్యదర్శి సునీల్‌శర్మ, జలమండలి యండీ దానకిషోర్, హైదరాబాద్ పోలీస్ కమిషనర్ శ్రీనివాస్‌రావు తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ పరేడ్ గ్రౌండ్స్‌లో జరిగే గణతంత్రదినోత్సవ వేడుకకు గవర్నర్ నరసింహన్ ముఖ్య అతిథిగా హాజరవుతారని తెలిపారు. అక్కడ అవసరమైన పోలీస్ బందోబస్తు, ట్రాఫిక్ నియంత్రణ ఏర్పాట్లను చేపట్టాలని పోలీస్ శాఖను ఆదేశించారు. వేడుకల సందర్భంగా గన్‌పార్క్, క్లాక్ టవర్, ఫతేమైదాన్‌లను విద్యుత్ దీపాలతో అలంకరించాని, నిరంతర విద్యుత్ సరఫరా, పబ్లిక్ అడ్రస్ సిస్టం, ఎల్‌ఈడీ టీవీలు, కామెంటేటర్ నియామకం లాంటి పనులను చేపట్టాలని సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. గణతంత్ర వేడుకలకు హాజరయ్యే విద్యార్థుల కోసం ఆర్టీసీ ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేయాలన్నారు.

లబ్ధిదారులకు అందకముందే...

- 20 సబ్సిడీ గొర్రెలు మృతి
- కలెక్టర్, జేడీ కార్యాలయాల ఎదుట ఆందోళన
- గొర్రెల పంపిణీలో భారీ అవినీతి : జీఎంపీఎస్

నవతెలంగాణ-జనగామ ప్రతినిధి

ప్రభుత్వం సబ్సిడీపై అందించేందుకు కొనుగోలు చేసిన 20 గొర్రెలు లబ్ధిదారులకు చేరకముందే మృతిచెందాయి. చనిపోతున్న గొర్రెలు మాకెందుకంటూ లబ్ధిదారులు తెలంగాణ గొర్రెల, మేకల పెంపకందార్ల సంఘం (జీఎంపీఎస్) ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్, పశు సంవర్ధక శాఖ కార్యాలయాల ఎదుట ధర్నా చేశారు. జనగామ జిల్లాలోని నర్మెట మండలం ఆగపేట గ్రామానికి చెందిన 12 మందికి సబ్సిడీ గొర్రెలు మంజూరయ్యాయి. కాగా గొర్రెల కొనుగోలు కోసం ఆగపేటకు చెందిన లబ్ధిదారులు వజ్జ యాదగిరి, దాసరి ఎల్లయ్య, రామాంజనేయులు, కాసాని రఘురాం, పోషయ్య, కిష్టయ్య, కొండయ్యతోపాటు మరికొందరు పశుసంవర్ధక శాఖ అధికారులతో కలిసి అనంతపురం వెళ్లారు. అక్కడ 250 గొర్రెలను కొనుగోలు చేసి ఒకే డీసీఎంలో ఎక్కించి తీసుకొస్తుండగా హైదరాబాద్ సమీపంలోకి రాగానే 10 చనిపోయాయి. భువనగిరి సమీపంలో మరో 10 మృత్యువాతపడ్డాయి. అధికారులు గుట్టుచప్పుడు కాకుండా వాటిని గ్రామానికి తీసుకెళ్లే ప్రయత్నం చేయగా లబ్ధిదారులు జీఎంపీఎస్ నాయకులకు సమాచారం ఇచ్చారు. జనగామలోని కలెక్టరేట్ మీదుగా తీసుకెళ్తుండగా జీఎంపీఎస్ నాయకులు, లబ్ధిదారులు అడ్డుకుని వాహనాన్ని నిలిపేశారు. చనిపోయిన గొర్రెల్ని కార్యాలయ గేటు ఎదుట వేసి ధర్నా చేశారు. పోలీసులు ఆందోళనకారులను అడ్డుకునే ప్రయత్నం చేశారు. అనంతరం జీఎంపీఎస్ రాష్ట్ర నాయకులు జాయ మల్లేశం నాయకత్వంలో కలెక్టర్ కార్యాలయ అధికారులకు వినతిపత్రం అందించారు. అక్కడి నుంచి పశుసంవర్ధక శాఖ కార్యాలయానికి వెళ్లి చనిపోయిన గొర్రెలను అక్కడ పెట్టి ధర్నా చేశారు. ఏడీ సదానందంకు వినతిపత్రం అందించారు.

గొర్రెల పంపిణీలో భారీ అవినీతి

జాయ మల్లేశం- జిల్లా ఉపాధ్యక్షులు, జీఎంపీఎస్

గొర్రెల పంపిణీలో భారీ అవినీతి జరుగుతోంది. పశు వైద్య, బీమా, రవాణా శాఖల అధికారులు అనంతపురంలోని దళారులతో కుమ్మక్కై అనారోగ్యంతో ఉన్న గొర్రెలను కొనుగోలు చేస్తున్నారు. పరిమితికి మించి ఒక్కో వాహనంలో గొర్రెలను ఎక్కించి తరలిస్తున్నారు. డీసీఎంలోనే గొర్రెలు చనిపోయిన క్రమంలో అధికారులే బాధ్యత వహించాలి.

హాస్య నటుడు గుండు హనుమంతరావును ఆదుకున్న ప్రభుత్వం

నవతెలంగాణ బ్యూరో- హైదరాబాద్

కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్న హాస్యనటుడు గుండు హనుమంతరావును ప్రభుత్వం ఆదుకుంది. జూబ్లీహిల్స్ అపోలో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న అతని గురించి తెలుసుకున్న ప్రభుత్వం..రూ.5లక్షల ఆర్థిక సహాయం ప్రకటించింది. ఈమేరకు సిఎం కెసిఆర్ కార్యదర్శి రాజశేఖర్ రెడ్డి లెటర్ ఆఫ్ క్రెడిట్‌ను ఆస్పత్రి యాజమాన్యానికి పంపించారు. ఈవిషయాన్ని మంత్రి కెటిఆర్ సోమవారం ట్విట్టర్ ద్వారా తెలిపారు. గుండు హనుమంతరావు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. మెగాస్టార్ చిరంజీవి కూడా గుండు హనుమంతరావుకి రూ.2లక్షల చెక్‌ను 'మా' మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు శివాజీ రాజా ద్వారా అందజేశారు.

'తుమ్మిళ్ల' ఆర్నెల్లో పూర్తి చేస్తాం

కోర్టుకెళ్లి అడ్డుకుంటే ప్రజలే బుద్ధి చెబుతారు

- తుమ్మిళ్ల ప్రాజెక్టు పైలాన్

ఆవిష్కరణలో మంత్రి హరీశ్‌రావు



నవతెలంగాణ - మహబూబ్‌నగర్ ప్రతినిధి

తుమ్మిళ్ల ప్రాజెక్టును ఆరునెలల్లో పూర్తిచేస్తామని, ప్రతిపక్షాలు కోర్టుకెళ్లి అడ్డుకోవాలని జూస్తే వారికి ప్రజలే తగిన బుద్ధి చెబుతారని భారీనీటిపారుదల శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. జోగులాంబ గద్వాల జిల్లాలోని ఆర్డీఎస్‌కు అనుసంధానంగా చేపడుతున్న తుమ్మిళ్ల ప్రాజెక్టు పైలాన్‌ను సోమవారం ఆయన ఆవిష్కరించారు. అనంతరం హరీశ్‌రావు మాట్లాడుతూ.. తుమ్మిళ్ల ద్వారా 25వేల ఎకరాలకు సాగునీరు అందిస్తామని రైతులకు భరోసానిచ్చారు. ఉమ్మడి జిల్లాలో కల్వకుర్తి, భీమా, నెట్టెంపాడు, కోయిల్‌సాగర్, తుమ్మిళ్ల ప్రాజెక్టులతో పాటు పాలమూరు-రంగారెడ్డి ద్వారా ఒక్కో నియోజకవర్గానికి లక్ష ఎకరాలకు సాగునీరు అందిస్తామని ధీమా వ్యక్తం చేశారు. ప్రతిపక్షాల విమర్శలను తలకిందులు చేస్తూ రాష్ట్రంలో 24 గంటల విద్యుత్ సరఫరా చేసి తమ చిత్తశుద్ధిని నిరూపించుకున్నామన్నారు. ఈ ఏడాది జూన్ నుంచి ప్రతి పంటకు రూ.4వేల చొప్పున ప్రతి ఎకరాకు రైతుల ఖాతాల్లోకి పంట పెట్టుబడుల కోసం అందించనున్నామని తెలిపారు. గద్వాలలోని నడిగడ్డ ప్రాంతంలో ఎక్కువ శాతం రైతులు ఉల్లిని పండిస్తున్నారని, ఈ పంట రైతులకు గిట్టుబాటు ధర కల్పించడానికి వారి నుంచి 2013 లక్షల క్వింటాళ్ల ఉల్లిని ఆమోదయోగ్యమైన ధర చెల్లించి కొనుగోలు చేశామని తెలిపారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో భాగంగా నిర్మిస్తున్న ఏదుల రిజర్వాయర్ 10లక్షల క్యూబిక్ మీటర్లకు గానూ 6లక్షల క్యూబిక్ మీటర్ల పని పూర్తయిందని తెలిపారు. ఏదుల రిజర్వాయర్‌కు అనుసంధానంగా నిర్మిస్తున్న టన్నెల్ ఆసియా ఖండంలోనే అతి పెద్దదని గుర్తు చేశారు. ముఖ్యంగా పీఎల్‌ఆర్‌ఐ కాల్వల ద్వారా కల్వకుర్తికి సాగు నీరందేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఉదండాపూర్ రిజర్వాయర్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరించి ఆర్నెళ్లలో పనులు మొదలు పెడతామన్నారు. ఏదుల రిజర్వాయర్‌లో ముంపునకు గురౌతున్న బండరావిపాకుల, కొలుకులపల్లి గ్రామ నిర్వాసితులకు పరిహారం, ఇండ్లు నిర్మించిన తర్వాతనే గ్రామాలను ఖాళీ చేయిస్తామని హామీనిచ్చారు. రిజర్వాయర్లకు అనుసంధానంగా నిర్మిస్తున్న రహదారుల వెంట ఉన్న విద్యుత్ సమస్యను పరిష్కరించి ప్రత్యామ్నాయ రహదారిని నిర్మిస్తామని హామీనిచ్చారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, వైద్య ఆరోగ్యశాఖ మంత్రి లక్ష్మారెడ్డి, ప్రణాళికాసంఘం ఉపాధ్యక్షులు నిరంజన్‌రెడ్డి, కలెక్టర్ ఈ.శ్రీధర్, జేసీ సురేందర్‌కరణ్, ఎమ్మెల్యేలు గువ్వల బాలరాజు, మర్రి జనార్దన్‌రెడ్డి, ఆర్డీఓ శ్రీనివాసులు, టీఈ రాజలింగం, ఎస్ఈ రమేష్, ఏఈ విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రయివేటు ఉద్యోగాలే ప్రత్యామ్నాయం



వృద్ధిరేటులో రాష్ట్రం నెం.1

- ఎన్నికల నాటికి ఇంటింటికీ తాగునీరు ఐటీ, మున్సిపల్‌శాఖ మంత్రి కేటీఆర్

నవతెలంగాణ- కరీంనగర్ ప్రతినిధి

రాష్ట్రంలో ప్రభుత్వరంగ సంస్థల్లో 4లక్షల ఉద్యోగాలు మాత్రమే ఉన్నాయని, ఉద్యోగ విరమణ, ఖాళీలతో కలిపి లక్షకు మించి కొత్త ఉద్యోగాలు ఇవ్వలేమని, అందువల్ల ప్రయివేటు ఉద్యోగాలే ప్రత్యామ్నాయమని ఐటీ, మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ అన్నారు. వృద్ధిరేటులో రాష్ట్రం నెం.1గా నిలిచిందని, దేశంతో పోల్చితే రెట్టింపుగా ఉందని చెప్పారు. కరీంనగర్ జిల్లా కేంద్రంలో రూ.25 కోట్లతో నిర్మించనున్న ఐటీ టవర్‌కు సోమవారం ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం బహిరంగ సభలో మంత్రి మాట్లాడుతూ.. ఎన్నికల నాటికి ఇంటింటికీ తాగునీరుతోపాటు ప్రతి ఎకరాకూ సాగు నీరు కూడా అందిస్తామని చెప్పారు. నీళ్లు, నిధులు, నియామకాలు అన్న మాటలు నిలబెట్టుకుంటున్నామని అన్నారు. రాష్ట్రంలో పొద్దుపోని బీజేపీ నాయకులు మాత్రమే విమర్శలకు దిగుతున్నారని, కేంద్ర మంత్రులు మాత్రం తమను కీర్తిస్తున్నారని గుర్తు చేశారు. ప్రయివేటు ఉద్యోగాల్లోనూ ఐటీ ఉద్యోగాలే ప్రథమ స్థానంలో ఉన్నాయని చెప్పారు. రాష్ట్రం వచ్చే నాటికి ఐటీ ఎగుమతులు రూ.56వేల కోట్లు ఉండగా, మూడేండ్లలో అవి రూ.87వేల కోట్లకు చేరుకున్నాయని తెలిపారు. ఐటీలో లక్ష ఉద్యోగాలు వస్తే అంతకు మూడు రెట్లు వాటి అనుబంధ, ఆధారిత రూపాల్లో ఉంటున్నాయని చెప్పారు. ద్వితీయశ్రేణి నగరాల్లో ఐటీ అభివృద్ధిలో భాగంగానే కరీంనగర్‌కు వచ్చామన్నారు. శంకుస్థాపన నాటికే 8 ఐటీ కంపెనీలు రావడంతోపాటు వెయ్యి ఉద్యోగాలకు అవకాశం దొరికిందని చెప్పారు. పెట్టుబడులను ఆహ్వానించేందుకు స్థానిక ఎంపీ, ఎమ్మెల్యే విదేశాలకు వెళ్లనున్నారని తెలిపారు. కరీంనగర్‌లో ఉన్న డిమాండ్‌ను బట్టి మరో రూ.25కోట్లతో రెండో టవర్ నిర్మాణం చేపడుతామని హామీ ఇచ్చారు. ప్రపంచంలోని ఐటీ రంగంలో వంద కంపెనీల్లో మన మేధావులే ఉన్నారని తెలిపారు. రాష్ట్రంలో స్కిల్స్ పెంచడం కోసం తెలంగాణ స్కిల్స్ అకాడమీ కేంద్రం ఏర్పాటు చేశామని, టీహబ్‌ను కూడా కరీంనగర్‌లో నెలకొల్పుతామని అన్నారు. యువత కేవలం ఉద్యోగాలకే పరిమితం కాకుండా జాబ్ క్రియేటర్లుగా అభివృద్ధి చెందాలని సూచించారు. సమావేశంలో ఆర్థికశాఖ మంత్రి ఈటల రాజేందర్, ఎంపీ వినోద్‌కుమార్, ఎమ్మెల్యేలు గంగుల కమలాకర్, రసమయి బాలకిషన్, సోమారపు సత్యనారాయణ, ఎమ్మెల్సీలు నారదాసు లక్ష్మణ్‌రావు, భానుప్రసాద్‌రావు, జడ్పీ చైర్‌పర్సన్ తుల ఉమ, మేయర్ రవీందర్‌సింగ్ పాల్గొన్నారు.

కర్నాటకం...

కర్నాటకలో ఎండాకాలంలో జరగబోయే ఎన్నికలు ఈ చలికాంలోనే వేడి పుట్టిస్తున్నాయి. కేంద్రంలో అధికారపక్షమైన బీజేపీ, రాష్ట్రంలో అధికారపక్షమైన కాంగ్రెస్ పార్టీలు తమ తమ వ్యూహాలకు పదును పెడుతున్నాయి. నేతల మధ్య మాటల తూటాలు పేలుతున్నాయి. నేను కూడా హిందువునే అని కర్నాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య చెప్పుకుంటుంటే... నీకు హిందూత్వంపై విశ్వాసం ఉంటే నీ రాష్ట్రంలో గోవధపై నిషేధం విధించాలని ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ డిమాండ్ చేస్తున్నారు. నిజానికి కేంద్రంలో బీజేపీ పాలన పట్ల, రాష్ట్రంలో కాంగ్రెస్ పాలన పట్ల ప్రజలు అసంతృప్తితో ఉన్నారు. ఆ అసంతృప్తి ఆగ్రహంగా మారకుండా బీజేపీ మతభావాలను ప్రేరేపిస్తూ ప్రజలను పక్కదారి పట్టిస్తుంటే... కాంగ్రెస్ ఎప్పటి లాగే తన అవకాశవాద వైఖరితో వ్యవహరిస్తోంది. బాబ్రీ కూల్చివేత సందర్భంలో కాంగ్రెస్ అనుసరించిన అవకాశవాద వైఖరే ఉత్తర భారతంలో బీజేపీ బలపడటానికి అవకాశమిచ్చింది. అభివృద్ధి, సుపరిపాలన, అవినీతి రహిత భారతం అంటూ ప్రజలను నమ్మించి కేంద్రంలో అధికారం పొందిన బీజేపీ చివరికి వంచనే మిగిల్చింది. వీరి ఏలుబడిలో ఎక్కడా అభివృద్ధి ఆనవాళ్లు కానరాక పోగా అవినీతి పెచ్చరిల్లింది. దీంతో అభివృద్ధి నినాదాన్ని అటకెక్కించిన బీజేపీ తిరిగి తన మతోన్మాద ఫార్ములానే అనేక రాష్ట్రాల ఎన్నికలలో అనుసరిస్తోంది. గుజరాత్ మోడల్ అని చెప్పుకునే ప్రధాని మోడీ స్వరాష్ట్రంలోనే తన అభివృద్ధి నినాదం పనిచేయక... వైషమ్యాలను రెచ్చగొట్టడం, భావోద్వేగాలను రగిలించడంపైనే ఆధారపడ్డారు. గడిచిన రెండు దశాబ్దాలుగా ఇదే ఫార్ములాతో ఉత్తర భారతంలో విజయాలు సాధిస్తున్న బీజేపీకి దక్షిణ భారతం మాత్రం దుర్భేధ్యంగానే ఉన్నది. దీనిని ఛేదించడానికి తమిళనాడులో ఏర్పడిన రాజకీయ అనిశ్చితి వాడుకోవాలని అనైతిక ప్రయత్నాలు చేసి దెబ్బతిన్నారు. ఎంతటి హింసకు తెగించినా కేరళ ప్రజల ముందు వారి ఆటలు సాగడం లేదు. ఇక ఉభయ తెలుగు రాష్ట్రాల్లోనూ వారి ప్రభావం అంతంత మాత్రమే.. ఇక మిగిలింది కర్నాటక. గతంలో ఒకసారి అధికారమిచ్చిన కర్నాటక వేదికగా వారు దక్షిణ భారతంపై కన్నేయడంలో ఆశ్చర్యమేమీ లేదు... కర్ణాటకలో కల్బుర్గీ, గౌరీలంకేశ్‌ల హత్యలూ, ప్రకాశ్‌రాజ్ వంటి ప్రశ్నించే వారిని బెదిరింపులకు లోను చేయడం ద్వారా లౌకికవాదుల మనోబలాన్ని దెబ్బతీయడానికి జరిగిన ప్రయత్నాలకూ కొదవేలేదు. ఇప్పుడు సరిగ్గా ఎన్నికల ముందు కర్నాటకలో మత వైషమ్యాలను రగిలించడం చూస్తుంటే బీజేపీ వ్యూహమేమిటో అవగతమవుతోంది.

అశాస్త్రీయ భావాలను, పుక్కిటి పురాణాలను వల్లిస్తూ ప్రజల ఆలోచనలను దారి మళ్లించేందుకు బీజేపీ ప్రయత్నిస్తుంటే...ప్రజావ్యతిరేక విధానాలు మార్చుకునేందుకు సిద్ధంగా లేని కాంగ్రెసు కూడా ఆ ఉచ్చులో చిక్కుకుంటున్నది.




"హనుమంతుడు పుట్టిన నేల ఇది" అంటూ కర్నాటకలో తమ వ్యూహానికి తెరతీసారు యోగి ఆదిత్యనాథ్. "సీత జాడ కోసం తిరుగుతున్న రాముడికి ఈ నేల నుండే హనుమంతుడు దారిచూపించాడు." అంటూ కథ సృష్టించాడాయన..! ఏప్రిల్‌లో జరిగే అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో బీజేపీ బెంగుళూరులో నిర్వహించిన "పరివర్తన" ర్యాలీ వేదికగా ఆయనీవ్యాఖ్యలు చేసారు. రామజన్మభూమి పేరుతో ఉత్తరభారతాన్ని వశపర్చుకున్న తీరునే "హనుమ జన్మభూమి" పేరుతో దక్షిణభారతాన్ని చేజిక్కించుకోవడమేనా ఈ వ్యూహం వెనుక మర్మం..!?

బసవన్న, అక్క మహాదేవి, ఫ్రెంచి విప్లవ ప్రతిధ్వనులు వినిపించిన టిప్పుసుల్తాన్ నుండి ఆధునిక యుగంలో ఎందరో సాహితీమూర్తులు, నాటక కర్తలు, మేధావులు, ప్రజాస్వామిక యోధులు, పురోగామి తాత్వికులు ఈ నేలనుంచి పుట్టి దేశానికి వన్నె తెచ్చారు. అటువంటి నేలమీది సానుకూల, లౌకిక అంశాలన్నిటినీ ధ్వంసం చేయటానికి బీజేపీ ప్రయత్నిస్తుంటే... ప్రతిఘటించి ప్రత్యామ్నాయంగా నిలబడాల్సిన కాంగ్రెస్ అవకాశవాదాన్ని ఎంచుకోవడం మరో విషాదం. రాహుల్ గాంధీ వరుసగా హిందూ దేవాలయాలను సందర్శించడం నుండి ముఖ్యమంత్రి సిద్ధరామయ్య నేనూ హిందువునే అని ప్రత్యేకంగా చెప్పుకోవడం వరకూ ఇవన్నీ కాంగ్రెస్ అవకాశవాదానికి నిదర్శనం. శతాబ్దాలుగా కన్న భూమిలో స్థిరపడి ఉన్న సామరస్యాన్ని చెరిపేసే ఉన్మాదానికి బీజేపీ తెగబడుతుంటే, సడలుతున్న సంకెళ్లను తిరిగి బిగించే ఛాందసానికి పాల్పడుతుంటే శాస్త్రీయ భావజాలం పునాది మీద నిలబడి ఎదిరించవల్సింది పోయి కాంగ్రెస్ అవకాశవాదానికి పాల్పడుతున్నది. వెరసి ఇరు పార్టీలు అనుసరిస్తున్న విధానాలు కర్నాటక సంతరించుకున్న వైభవాన్నంతటినీ మసకబారుస్తున్నాయి.

బీజేపీ విధానాలతో దేశంలో ఆర్థిక వృద్ధి నేలచూపులు చూస్తోంది. ఉత్పత్తిరంగం కుదేలైంది. ధరాఘాత సూచీ కొండెక్కుతోంది. వ్యవసాయం నైరాశ్యంలో ఉంది. యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు లేవు. పెద్దనోట్ల రద్దు ప్రజలకు శరాఘాతమైంది. జీఎస్‌టీ పుణ్యమా అని వ్యాపారవర్గం ఉక్కిరి బిక్కిరై అలసిపోయి ఉంది. దేశంలో ఒక్కో వర్గానికి ఒక్కో ఆవేదన.. అందుకు కర్నాటకా మినహాయింపు కాదు. భవిష్యత్తుపై కమ్ముకున్న కారుమబ్బులు ఎలా తొలగిపోతాయో అని ప్రజలు ఎదురు చూస్తున్నారు. కానీ ఆ సమస్యలకు పరిష్కారం కాదు కదా ఆ ప్రస్తావనే లేకుండా అశాస్త్రీయ భావాలను, పుక్కిటి పురాణాలను వల్లిస్తూ ప్రజల ఆలోచనలను దారి మళ్లించేందుకు బీజేపీ ప్రయత్నిస్తుంటే...ప్రజావ్యతిరేక విధానాలు మార్చుకునేందుకు సిద్ధంగా లేని కాంగ్రెసు కూడా ఆ ఉచ్చులో చిక్కుకుంటున్నది.

సంపాదకీయం

ప్రభుత్వమే ఆర్థిక వినాశం చేసిన సంవత్సరం!



ప్రభాత్ పట్నాయక్

ప్రభుత్వమే ఆర్థిక సంక్షోభానికి కారణభూతమవటం ఇంత తీవ్రంగా దేశంలో ఎన్నడూ జరగలేదనే వాస్తవంలో 2017వ సంవత్సరం ప్రత్యేకత ఉన్నది. గతంలో కూడా 1965-66, 1966-67, 1973-74వంటి సంవత్సరాలలో ద్రవ్యోల్బణం అతిగా పెరగటంతో ప్రజా జీవితం దుర్భరంగా మారిన కాలం ఉన్నది. అయితే ఆయా సంవత్సరాలలో ఎదురైన ఇబ్బందులకు కారణం ప్రభుత్వ విధానంలో లేదు. 1965-66, 1966-67 సంవత్సరాలలో ఆహార ధాన్యాల ఉత్పత్తి దారుణంగా పడిపోయింది. అదే కాలంలో 'బీహార్‌లో కరువు' ఏర్పడింది. అలా జరిగే సంభావ్యత(ప్రోబబిలిటి) నూటికి ఒక శాతం ఉంటుందని గణాంకవేత్తలు అంటారు.

అయితే గణాంకవేత్తల మాటల్ని పరిగణనలోకి తీసుకోనవసరం లేదు. 1960వ దశకం మధ్యకల్లా భారత వ్యవసాయ రంగంలో ప్రేరకాలు అడుగంటిపోయాయని

కావాలని తీసుకున్న రెండు ప్రధాన చర్యలు ప్రజలను కష్టాలలోకి నెట్టాయి. మొదటి నిర్ణయం: 2016 సంవత్సరం నవంబరు నెలలో జరిగిన పెద్ద నోట్లను రద్దు చేయటం. రెండవ నిర్ణయం: జవహర్‌లాల్ నెహ్రూ 1947 సంవత్సరం ఆగస్టు 15వ తేదీ అర్ధరాత్రి చేసిన 'ట్రిస్ట్ విత్ డెస్టినీ(విధిని కలిసిన వేళ)' ప్రసంగం సందర్భాన్ని వికారంగా అనుకరిస్తూ సరకుల, సేవల పన్ను(జీఎస్‌టీ)ను ప్రవేశపెట్టటం. ఈ రెండు నిర్ణయాల ప్రభావంతో 2017 సంవత్సరంలో చిన్న ఉత్పత్తి రంగం కుదేలయింది.

చాలామంది ఆర్థికవేత్తలు వాదిస్తున్నారు. అందుకు కావలసిన ప్రేరకాన్ని ఆ తరువాత హరిత విప్లవం అందించింది. ఆ కాలంలో ఈ కారణంచేత వ్యవసాయోత్పత్తి అంతగా పతనమైంది. 1950వ దశకం ఆరంభంలో వ్యవసాయ యోగ్య భూమిని నికరంగా విస్తృతపరచటానికి ఎంతో కొంత అవకాశం ఉండేది. అలాంటి విస్తృతి వ్యవసాయాభివృద్ధికి ప్రేరకంగా పనిచేసింది. ఈ ప్రేరకం ఆవిరయ్యేనాటికల్లా 1950వ దశకంలో ఆరంభమయిన నీటిపారుదల ప్రాజెక్టులవల్ల ఆయా ప్రాంతాలలో బహుళ పంటల సేద్యం పెరిగింది. దానితో స్థూలంగా సేద్యంలోని భూమి విస్తృతం కావటమే కాకుండా నీటిపారుదలసౌకర్యం అందటంతో వ్యవసాయ ఉత్పాదకత పెరిగింది. కానీ వ్యవసాయాభివృద్ధికి ఉపయోగపడిన ఈ ప్రేరకం కూడా 1960వ దశకం మధ్యకల్లా ఆవిరైపోయింది. దానితో వ్యవసాయోత్పత్తి పతనమైంది. 1960వ దశకం మధ్యలో సంభవించిన కరువు ఈ పతనాన్ని మరింతగా తీవ్రతరం చేసింది.

తగిన సాక్ష్యాధారాలున్న ఈ వివరణను అంగీకరిస్తే ఉత్పత్తిలో ఏర్పడిన ఈ పతనాన్ని ముందుగా ఊహించలేక పోయినందుకు ప్రభుత్వాన్ని నిందించవచ్చు. అయినప్పటికీ ఆ కాలంలోని ఆర్థిక ఇబ్బందులకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని అనటం కష్టమౌతుంది. మహాఅయితే ప్రభుత్వం ఈ పరిస్థితిని అంచనా వేయలేకపోయిందని విమర్శించవచ్చుగానీ ప్రభుత్వ చర్యలే ఇందుకు కారణమని నిందించలేం.

స్వాతంత్ర్యానంతర భారతదేశంలో 1973-74లో వార్షికంగా ఎన్నడూ లేనంతగా పెరిగిన ద్రవ్యోల్బణానికి వ్యవసాయోత్పత్తి పతనం కావటంతోపాటుగా పెరిగిన 'చమురు ధరల షాక్' కారణభూతమయ్యాయి. ఆహారధాన్యాల ఉత్పత్తి పతనం కారణంగా ఏర్పడే పర్యవసానాలను అక్రమ నిల్వదారులను నియంత్రించటం, ప్రభుత్వ ఆధీనంలోని ఆహారధాన్యాల నిల్వలను ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా విడుదలచేయటం వంటి చర్యలతో ప్రభుత్వం అరికట్టాల్సి ఉండె. అందుకు బదులుగా ప్రభుత్వం బహిరంగ మార్కెట్‌లో ధాన్యాన్ని అమ్మటం మూలాన సత్తా వ్యాపారులు తామే ఆ ధాన్యాన్ని కొని నిలువ చేయటంవల్ల పరిస్థితిలో మార్పు రాలేదు. అయితే ఆ ఏడాదిలో ఎదురైన ఆర్థిక ఇబ్బందులకు ఇది ప్రధాన కారణం కాదు. దానికిగల మౌలిక కారణం విధాన నిర్ణయాలకు సంబంధించినది కాదు. మహాఅయితే ఈ బాహ్య కారణాలను సమర్థవంతంగా నియంత్రించలేదని ప్రభుత్వాన్ని నిందించగలం

అయితే 2017 సంవత్సరంలోని పరిస్థితి పూర్తిగా భిన్నం. భారత, చైనాలవంటి ఆర్థిక వ్యవస్థలను ప్రపంచ ఆర్థిక సంక్షోభం ప్రతికూలంగా ప్రభావితం చేస్తుందనటంలో సందేహం లేదు. కానీ ఈ ఏడాదిలో ఎదురైన ఆర్థిక ఇబ్బందులకు దాని ప్రభావం ప్రధాన కారణం కాదు. కరెంటు ఖాతా లోటును పెంచటం ద్వారా విదేశీ మారకపు చెల్లింపుల శేషంమీద పడిన దాని ప్రభావం ప్రమాదకరమైనదైనప్పటికీ తగినంతగా వస్తున్న విదేశీ పెట్టుబడుల ప్రవాహాలు దాని తీవ్రతను తగ్గిస్తున్నాయి. నిజానికి ఈ విదేశీ పెట్టుబడుల ప్రవాహ వేగం పర్యవసానంగా సంవత్సరాంతంలో డాలరుతో రూపాయ మారకపు విలువ పెరిగింది.

ప్రపంచ ఆర్థిక సంక్షోభంవల్ల దెబ్బతిన్న ఎగుమతుల డిమాండ్ కారణంగా ఏర్పడిన నిరుద్యోగిత ప్రభావం ప్రజల మీద ప్రభుత్వం కావాలని తీసుకున్న విధాన నిర్ణయాలకంటే చాలా తక్కువగా ఉన్నది. ఆవిధంగా అనేక వాణిజ్య పంటల ధరలు పడిపోవటంతో రైతాంగంలో ఏర్పడిన నిస్పృహ ప్రభుత్వం కావాలని తీసుకున్న చర్యల ఫలితంగా మరింతగా పెరిగింది. పెట్టుబడిదారీ దేశాలలో నెలకొన్న సంక్షోభం ఇలా వాణిజ్య పంటలకు ధరలు పడిపోవటం ద్వారా మూడవ ప్రపంచ దేశాలలో ప్రవేశిస్తున్నది. వర్తక షరతులు(టర్మ్స్ ఆఫ్ ట్రేడ్) ప్రాథమిక సరకుల విషయంలో ప్రతికూలంగా మారటం ద్వారా ఇది జరుగుతున్నది. వేరే మాటల్లో చెప్పాలంటే ప్రభుత్వం కావాలని చేసిన నిర్ణయాలవల్లనే 2017 సంవత్సరంలో ప్రజలు ఆర్థిక పరమైన ఇబ్బందులను ఎదుర్కొన్నారు. ప్రభుత్వ నిర్ణయాలవల్ల అంతగా ప్రజలు ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కోవటం స్వాతంత్ర్యానంతర భారతదేశంలో ఎన్నడూ జరగలేదు.

కావాలని తీసుకున్న రెండు ప్రధాన చర్యలు ప్రజలను కష్టాలలోకి నెట్టాయి. మొదటి నిర్ణయం: 2016 సంవత్సరం నవంబరు నెలలో జరిగిన పెద్ద నోట్లను రద్దు చేయటం. రెండవ నిర్ణయం: జవహర్‌లాల్ నెహ్రూ 1947 సంవత్సరం ఆగస్టు 15వ తేదీ అర్ధరాత్రి చేసిన 'ట్రిస్ట్ విత్ డెస్టినీ(విధిని కలిసిన వేళ)' ప్రసంగం సందర్భాన్ని వికారంగా అనుకరిస్తూ సరకుల, సేవల పన్ను(జీఎస్‌టీ)ను ప్రవేశపెట్టటం. ఈ రెండు నిర్ణయాల ప్రభావంతో 2017 సంవత్సరంలో చిన్న ఉత్పత్తి రంగం కుదేలయింది.

పతనమయినప్పటికీ అలా కనపడని స్థూల జాతీయోత్పత్తి వృద్ధికి చెందిన గణాంకాలను ఉటంకిస్తూ ప్రజలపై ఈ విచ్ఛిన్నకర చర్యల ప్రభావాన్ని తక్కువ చేసి చూపే ధోరణి కనపడుతున్నది. ప్రభుత్వంచే జారీచేయబడిన ఆర్థిక సర్వేనే ప్రతికూలంగా వ్యాఖ్యానించిన స్థూల జాతీయోత్పత్తి అంచనాలు దుర్బలంగా ఉన్నాయి. ఈ అంచనాలలో పద్ధతికి సంబంధించిన మౌలిక సమస్య ఉన్నది. స్థూల జాతీయోత్పత్తిలో తక్కువ నిష్పత్తివున్న రంగాలు ఉద్యోగితలో ఎక్కువ భాగాన్ని అందించటం అనే వాస్తవంతో ఈ సమస్య తలెత్తుతున్నది.

ఉదాహరణకు స్థూల జాతీయోత్పత్తిలో వ్యవసాయ రంగం వాటా కేవలం 15శాతానికి అటుఇటుగా ఉంటుంది. అయితే ఈ రంగం మొత్తం ఉద్యోగితలో దాదాపు సగభాగం అందిస్తున్నది. ఇప్పుడు ఒక చిన్న లెక్కను తీసుకోండి. ఉదాహరణకు ఏ సంవత్సరంలోనైనా వ్యవసాయరంగంలో 3శాతం పెరుగుదల ఉన్నప్పుడు వ్యవసాయేతర రంగం(విపులీకరణ కోసం ఇదంతా ఒకే రంగం అని అనుకుందాం) 10శాతం ఉందనుకుందాం. అలాంటి స్థితిలో ఆ సంవత్సరం ఆర్థిక వ్యవస్థలో స్థూల జాతీయోత్పత్తి వృద్ధి రేటు మొత్తంమీద 8.95శాతంగా ఉంటుంది. అయితే ఇప్పుడు ప్రభుత్వం తీసుకున్న కొన్ని చర్యల మూలంగా వ్యవసాయ రంగంలో నమోదయిన 3శాతం వృద్ధిలో 0.5శాతం తగ్గి వ్యవసాయేతర రంగంలో అదే 10శాతం వృద్ధి కొనసాగుతుందనుకుందాం. అప్పుడు ఆర్థికవ్యవస్థ వృద్ధి రేటు మొత్తం మీద



7.75శాతానికి తగ్గిపోతుంది. స్థూల జాతీయోత్పత్తి వృద్ధిరేటు 8.95శాతం నుంచి 7.75శాతానికి పడిపోయినప్పుడు ఆ పతనం నామమాత్రంగా 1.2శాతం పడిపోయినట్టు కనపడుతుంది. అయితే దేశంలోని సగం జనాభా ఆదాయం ప్రభుత్వం తీసుకున్న చర్యలకు ముందున్న ఆదాయంకంటే 8శాతం తగ్గుతుంది.

ఆ విధంగా ఆర్థిక వ్యవస్థలోని ఒక రంగం స్థూల జాతీయోత్పత్తిలో సాపేక్షంగా తక్కువ వాటా ఉన్నప్పటికీ జనాభాలో అత్యధిక శాతానికి ఉద్యోగిత కల్పిస్తున్నప్పుడు స్థూల జాతీయోత్పత్తి వృద్ధి రేటులో వచ్చే చిన్న మార్పులు అశేష ప్రజానీకం జీవితాలను తీవ్రంగా ప్రభావితం చేస్తాయి. కాబట్టి స్థూల జాతీయోత్పత్తిలో ఈ చిన్న మార్పుకు కారణమైన చర్యలతో పెద్దగా ఇబ్బంది ఉండదనే ప్రభుత్వ ప్రతినిధుల వాదన సమర్థనీయం కాదు.

పై ఉదాహరణలో వ్యవసాయ రంగానికి బదులుగా స్థూల జాతీయోత్పత్తిలో 45శాతం వాటావుండి 85శాతం ఉద్యోగితను కల్పిస్తున్న 'చిన్న ఉత్పత్తి(ఇన్‌ఫార్మల్) రంగం' ఉండాలి. ముందుగా పెద్ద నోట్ల రద్దుతోను, ఆ తరువాత జీఎస్‌టీతోను ఈ రంగం కుదేలయింది. ఈ రంగం మీద పెద్ద నోట్ల రద్దు ప్రభావం గురించి చర్చ చాలానే జరిగినప్పటికీ జీఎస్‌టీ ప్రభావం గురించి అంతగా చర్చ జరగలేదు. దీని ప్రభావం గురించి చర్చ జరగవలసిన అవసరం ఉన్నది.మూడు స్పష్టమైన మార్గాలలో చిన్న ఉత్పత్తి రంగాన్ని జీఎస్‌టీ కుళ్ళబొడిచింది. మొదటిది: ఈ రంగంలో జీఎస్‌టీతో ఆర్థికవేత్తలు పేర్కొంటున్న 'లావాదేవీల వ్యయాలు' అనేక విధాలుగా పెరిగాయి. ఉదాహరణకు వివిధ సమయాలలో అనేక పట్టికలను(ఫార్మ్స్) నింపవలసి ఉంటుంది. కేవలం చిన్న ఉత్పత్తి రంగంలోనే కాకుండా అన్ని రకాల వ్యాపారాలలో కూడా లావాదేవీల వ్యయం పెరిగింది. కానీ అలాంటి పనులు చేయటానికి పెద్ద వ్యాపార సంస్థలలో తగిన ఏర్పాట్లు ఉంటాయి కాబట్టి వారికి అయ్యే వ్యయం తక్కువగా ఉంటుంది. కానీ చిన్న ఉత్పత్తి రంగంలో అటువంటి పరిస్థితి ఉండదు.

పెరిగిన సగటు పన్ను రేటును కట్టవలసిరావటంతో రెండవ విధంగా చిన్న ఉత్పత్తి రంగం దెబ్బతింటున్నది. గతంలో సేకరించిన స్థాయిలోనే పన్నులు సేకరించాలని జీఎస్‌టీ లక్ష్యంగా పెట్టుకుంది. దీనినే 'పన్ను తాటస్థ్యం' అని అంటున్నారు. చిన్న ఉత్పత్తి రంగంపై విధిస్తున్న సగటు పన్ను రేటు పెరగటం అంటే పెద్ద పెట్టుబడుల రంగంపై విధిస్తున్న సగటు పన్ను రేటు తగ్గించటంగా ఇది ఉంటుంది. కాబట్టి 'పన్ను తాటస్థ్యం' ఉన్నప్పటికీ జీఎస్‌టీ అనేది పన్ను భారాన్ని పెద్ద పెట్టుబడులుండే రంగం నుంచి చిన్న ఉత్పత్తి రంగానికి పునఃపంపిణీ చేసేదిగా ఉంటుంది.

గతంలో కంటే జీఎస్‌టీని ప్రవేశపెట్టిన తరువాత పన్ను సేకరణ పడిపోయింది. అంటే వర్తమానంలోగల రేట్ల ప్రకారం "పన్ను తాటస్థ్యం' లేదన్నమాట. ఈ పరిస్థితుల్లో చిన్న ఉత్పత్తి రంగానికి పన్ను రేట్లు తగ్గించటం ద్వారా ఉపశమనం అందించే అవకాశం లేదు. క్లుప్తంగా చెప్పాలంటే చిన్న ఉత్పత్తి రంగం మీద జరుగుతున్న దాడి అధికారులు అంటున్నట్టు తాత్కాలికమైనది కాదు. ఇది శాశ్వతమైనది.

ముందుగా పన్ను కట్టాలి, రిఫండ్ ఏమైనావుంటే తరువాత తీసుకోవాలి అనే నియమం చిన్న ఉత్పత్తి రంగాన్ని మూడో విధంగా కుంగదీస్తున్నది. దీనితో చిన్న ఉత్పత్తి రంగంలో నిర్వహణ పెట్టుబడి(వర్కింగ్ క్యాపిటల్) వ్యయం పెరుగుతున్నది. ఇది పన్ను చెల్లింపుకు సంబంధించిన విషయం కాబట్టి ఇది కొనసాగుతుంది. దీనితోపాటే చిన్న ఉత్పత్తి రంగంలో నిర్వహణ పెట్టుబడి అవసరాలు కూడా పెరగటం తాత్కాలిక విషయం కాబోదు.

జీఎస్‌టీతో రాష్ట్ర ప్రభుత్వాలు తమ రాజ్యాంగ హక్కులను కోల్పోయాయనే వాస్తవం మన రాజ్యాంగ సమాఖ్య వ్యవస్థ స్వభావాన్ని దెబ్బతీసింది. అంతేకాకుండా దానితోపాటే చిన్న ఉత్పత్తిరంగం మీద జీఎస్‌టీ ఉద్దేశపూర్వకంగా దాడిచేస్తున్నది. ఇదేదో 'కొరకరాని సమస్యలు' ఉండటం కారణంచేత జరగటం లేదు. ఇది మౌలిక నిర్మాణంలో జరుగుతున్న మార్పు. కాబట్టి స్వాతంత్ర్యానంతర భారతదేశ చరిత్రలో 2017 సంవత్సరం ఒక ప్రత్యేకత సంతరించుకున్నది. దేశంలోని ప్రభుత్వం కష్టజీవులపైన ఉద్దేశపూర్వకంగా ప్రత్యక్ష దాడిచేస్తున్నదన్న వాస్తవంలో ఆ ప్రత్యేకత ఉన్నది.

అనువాదం: నెల్లూరు నరసింహారావు
సెల్: 8886396999

మెయిల్ @ నవతెలంగాణ



గుర్రం రామ్‌మోహన్‌రెడ్డి


జీతాలు రాక జీవితాల్లో వెలుగు లేక

వారి జీవితాల్లో వెలుగు లేదు. శ్రమను నమ్ముకొని పనిచేసిన శ్రామికులు ప్రతిరోజూ దినదిన గండంగా బతుకుబండి లాగిస్తున్నారు. ఎన్ని ప్రభుత్వాలకు, ఎంతోమంది రాజకీయ నాయకులకు మొరపెట్టుకున్నా వారి దీనగాథ వినేవారే లేరు. 25 ఏండ్లుగా తమ పోరాటాన్ని కొనసాగిస్తూ, ఎప్పుడో ఒకప్పుడు తమ జీవితాల్లో వెలుగు నిండదా అని నిరీక్షిస్తున్నారు. వారే డీబీఆర్ మిల్లు కార్మికులు. మిల్లు మూతపడి బకాయిలు రాక ఆర్థిక ఇక్కట్లలో కొట్టుమిట్టాడుతున్నారు. 500 మంది కార్మికులు ఆర్థిక ఇక్కట్లలో చిక్కుకొని దయనీయమైన జీవితాలు వెళ్లదీస్తున్నారు. మిల్లు మూతపడిన నాటి నుంచీ కార్మికులూ వారి కుటుంబ సభ్యులూ పాలకులకు మొరపెట్టుకున్నా వారి కన్నీళ్లను తుడిచేవారే కరువయ్యారు. తమ బకాయిలు వస్తాయి, తమ జీవితాల్లో వెలుగు నిండుతుందని ఎదురుచూస్తున్న కార్మికుల ఆశలు అడియాశలయ్యాయి. 500 మంది పనిచేసే మిల్లు మూతపడటంతో ఇప్పటికీ వంద మంది కార్మికులు ఆర్థిక ఇబ్బందుల్లో చిక్కుకొని మృతి చెందారు. మిగిలిన 400 మంది కార్మికులు బకాయిల కోసం అలుపెరగని పోరాటం చేస్తున్నారు. ముఖ్యమంత్రులకు, మంత్రులకు, ప్రజాప్రతినిధులకు, రాజకీయపక్ష నాయకులకు మొరపెట్టుకున్నా, పోరాడినా బకాయి వేతనాలు మాత్రం రాని పరిస్థితి నెలకొనడంతో దుర్భర జీవితాలు వెళ్లదీస్తున్నారు. ఏ కుటుంబాన్ని కదిలించినా కన్నీరుమున్నీరుగా విలపిస్తోంది.

నిజాం కాలంలో ఏర్పాటు చేసిన ఈ మిల్లు కోట్లాది రూపాయల లాభాల బాటలో నడిచేది. దివాన్ బహదూర్ రాంగోపాల్ (డీబీఆర్) మిల్లు నగరం నడిబొడ్డున లోయర్‌ట్యాంక్ బండ్ వద్ద ఉంది. ఆసియాలోనే అతిపెద్దదైన ఈ మిల్లులో నాణ్యమైన వస్త్రాలు తయారయ్యేవి. 1992లో మిల్లు మూతపడటంతో కార్మికులు రోడ్డున పడ్డారు. నాటి నుంచి 25 ఏండ్లుగా కార్మికులు పోరాటం సాగిస్తున్నారు. పాలకులు మాత్రం కార్మికులను కనికరించకపోగా సమస్య పరిష్కారానికి మొగ్గుచూపే ప్రయత్నం కూడా చేయలేదు. నగరం నడిబొడ్డున 24 ఎకరాల భూమి దాదాపు వెయ్యి కోట్ల విలువ కలిగివుంటుంది. కార్మికులకు రూ.40 నుంచి రూ.45 కోట్ల వేతన బకాయిలు చెల్లించాల్సివుంది. ఆ బకాయిలు చెల్లించాలని కోరుతున్నారు తప్ప ఒక్కరూపాయి కూడా అదనంగా యివ్వాలని ఏ కార్మికుడూ అడగటం లేదు. రాజకీయ నాయకుల ఇండ్లు, ఆఫీసుల చుట్టూ ఎనిమిదేండ్లుగా తిరుగుతూ విసిగివేసారి మానసిక వేదనతో వందమంది కార్మికులు తనువు చాలించారు. దిక్కుతోచని స్థితిలో ఆ కుటుంబాలు కొట్టుమిట్టాడుతున్నాయి. పాలకులు మాత్రం ఖాయిలాపడ్డ పరిశ్రమలను పునరుద్ధరిస్తాం, బకాయిలను చెల్లిస్తాం, తిరిగి ఉపాధి కల్పిస్తామని పుంఖానుపుంఖాలుగా ప్రకటనలు కురిపించడం తప్ప పరిశ్రమను తెరిపించక పోవడంతో డీబీఆర్ మిల్లు కార్మికుల భవిష్యత్తు అగమ్యగోచరంగా మారింది. రెండుపూటలా భోజనం దేవుడెరుగు గానీ కుటుంబాన్ని ఎలా పోషించాలో తలకు మించిన భారంగా మారడంతో కార్మికుల జీవితాల్లో చీకట్లు అలముకున్నాయి. ఖాయిలా పరిశ్రమలను పునరుద్ధరిస్తామనీ, ఉపాధి కోల్పోయిన కార్మికులకు పునరావాసం కల్పిస్తామనీ పదేపదే ప్రకటనలు కురిపిస్తున్న పాలకులు నగరం నడిబొడ్డున ఉన్న డీబీఆర్ మిల్లువైపు కన్నెత్తి చూడటం లేదు. డీబీఆర్ మిల్లు మూసివేతతో దినదిన గండంలా బతుకు బాధ దొంతర్లలో మిల్లు శ్రామికులు జీవనం వెళ్లదీస్తున్నారు. పాలకుల దయలేక తమ జీవితాల్లో చీకట్లు అలముకున్నాయనీ, నిరాశ, నిస్పృహల్లో కొట్టుమిట్టాడుతూ తమకు ఎప్పుడో ఒకప్పుడు మేలు జరిగితీరుతుందనీ కొండంత ఆశతో ఎదురుచూస్తున్నారు.

సెల్ : 9849896769

రాజకీయ తెరపై రజనీబాబా



తెలకపల్లి రవి

ఇప్పటికి 175 చిత్రాల్లో నటించి దక్షిణభారత దేశంలో శిఖరాగ్ర కథానాయకుడుగా వున్న రజనీకాంత్ ఒక చిత్రంలో నేను ఒక్కసారి చెబితే వందసార్లు చెప్పినట్టే అంటారు. రాజకీయ రంగంలో మాత్రం వందరకాలుగా మాట్లాడి చివరకు ఏడాది ముగింపురోజున రాజకీయ రంగంలో ప్రవేశిస్తున్నట్టు ప్రకటించారు. అవినీతిపై పోరాటం, వాగ్దానాల అమలు ప్రధానాంశాలుగా 'ఆధ్యాత్మిక రాజకీయాలు' నడుపుతానని కొత్త పదం తీసుకొచ్చారు. తనపార్టీ గుర్తుగా తను నటించిన బాబా చిత్రం బొమ్మ తీసుకున్నారు. రాష్ట్రం గురించి తప్ప దేశం గురించి మాట్లాడలేదు. తన పార్టీకి కార్యకర్తలు వుండరనీ, స్వయం సేవకులు (వలంటీర్లు) వుంటారని మరో మాట చెప్పారు. ఒకో నియోజకవర్గంలో కోటి రూపాయలు ఖర్చు పెట్టుకోగలిగిన వారు అభ్యర్థులుగా ముందుకు రావాలని ఆయన అన్నట్టు వార్తలు వచ్చాయి.

ఇరవై ఏండ్లకిందటే రాజకీయాల్లోకి వచ్చేశానంటున్న రజని 1996లో ఆయన అప్పటి ముఖ్యమంత్రి జయలలితను ఓడించాలని పిలుపునివ్వడం ద్వారా పరోక్షంగా డీఎంకే విజయానికి దోహదం చేశారు. 1998లోనూ, 2001లోనూ అదే పిలుపునిచ్చినా జయ గెలిచారు.) అప్పటి నుంచి రాజకీయాల్లోకి ఇదిగో వస్తారు అదిగో వస్తారని అంటున్నా ఇప్పటికి గాని వాస్తవం కాలేదు.

తమిళనాడులో కరుణానిధి, ఎంజీఆర్, శివాజీ గణేశన్, జయలలిత, భాగ్యరాజా, శరత్ కుమార్, విజయకాంత్, విశాల్, కుష్బూ వంటి చాలా మంది తమ తమ జయాపజయాలతో రాజకీయ పాత్రలు పోషించిన వారే. కరుణ ఎంజీఆర్ జయలలితల దీర్ఘకాలం పాటు ముఖ్యమంత్రులుగా వెలిగారు. తమిళనాడుకే స్వంతమైన మరో ప్రత్యేకత ఏమంటే ఇప్పటికి అర్ధశతాబ్దిగా అక్కడ ఏ జాతీయ పార్టీ విజయం సాధించలేదు. హేతువాద బ్రాహ్మణేతర ఉద్యమ పునాదులపై పెరిగిన ద్రవిడ పార్టీలే పాలన చేస్తున్నాయి. 1916 నవంబరులో పెరియార్ ఇవి రామస్వామి నాయకర్ తదితరుల నాయకత్వంలో ఏర్పడిన సౌత్ ఇండియన్ లిబరల్ ఫెడరేషన్(ఎస్ఐఎల్ఎఫ్), ఉత్తరోత్తరా జస్టిస్‌పార్టీ దీనికి పునాదులు వేశాయి. పెరియార్ రాజకీయాలు వద్దనడంతో అన్నాదురై డీఎంకేను స్థాపించి కాంగ్రెస్‌ను ఎదుర్కొన్నారు. 1953లో ఎంజీఆర్ కాంగ్రెస్ నుంచి డీఎంకేలోకి వచ్చారు. అప్పటి డీఎంకే సభల్లో ఎంజీఆర్, కరుణానిధి ఆకర్షణగా వుండేవారట. 1967లో ముఖ్యమంత్రి అయిన అన్నాదురై 1969లో మరణించగా కరుణానిధి ఆ స్థానంలోకి వచ్చారు. ఆ దశలో హిందీ రుద్దడానికి వ్యతిరేకంగానూ కేంద్రం పెత్తనానికి నిరసనగానూ బలమైన పాత్ర పోషించారు. 1972నాటికి ఎంజిఆర్‌తో విభేదాలు పెరిగి ఆయనను బహిష్కరించుడంతో అన్నా డీఎంకే ఏర్పాటు చేశారు. 1977లో అధికారంలోకి వచ్చారు. మరో ఐదేండ్లకు జయలలిత ప్రవేశించారు. ఇప్పటివరకూ 26 ఏండ్లు అన్నా డీఎంకే, 12 ఏండ్లు డీఎంకే పాలించాయి. ద్రవిడ రాజకీయాలతో పాటు విస్తార సంక్షేమ పథకాలు వారి రాజకీయ సంస్కృతిలో భాగంగా మారాయి. మరోవైపున అవధులు లేని అవినీతి, అవతలి వారి ఉనికిని సహించలేని అసహనం కూడా తిష్టవేశాయి.

జయ మరణంతో రాజకీయ శూన్యం ఏర్పడింది గనక రజనీకాంత్‌కు అవకాశముంటుందని, నిజానికి ద్రవిడోద్యమ అనంతర దశ ప్రారంభమవుతుందని చెప్పడం ఊహే తప్ప ఆధారం లేదు. ఆధ్యాత్మిక రాజకీయాలు అన్న మాట బీజేపీ సంఘ పరివార్ రాజకీయాలను తలపించడం వాస్తవం. రజనీ ప్రకటన ఏ ఒక్కరి కన్నా మాకే దగ్గరగా వుందని



ఆరెస్సెస్ సిద్ధాంత కర్త గురుమూర్తి చెప్పేశారు కూడా. మెర్సెల్ సినిమా విషయంలో తప్ప ఆయన లౌకిక ప్రజాస్వామిక భావాలు వెలిబుచ్చింది లేదు.

ఈ ప్రకటనకుముందే ఆర్కేనగర్ ఉప ఎన్నికల్లో స్వతంత్రుడుగా పోటీ చేసిన శశికళ బంధువు దినకరన్ ఘన విజయం రజనీ వంటి వారిని హతాశులను చేసింది. అనేక ఆరోపణల ఊబిలో కూరుకుని జైలుకు కూడా వెళ్లివచ్చిన దినకరన్ చేతిలో డీఎంకే ఓడిపోవడమే గాక మొదటిసారి చెన్నై పరిధిలో డిపాజిట్ కూడా తెచ్చుకోలేకపోయింది. ప్రస్తుత పరిస్థితుల్లో డీఎంకే గెలుపు నల్లేరు మీద బండి అనుకున్నది తలకిందులైంది. ఓటర్లు డీఎంకేను తిరస్కరించడం రజనీకాంత్‌లో ఆశలు పెంచి ఉండొచ్చు. కానీ ఆ తీర్పులో ప్రధాన కోణం కేంద్ర బీజేపీ కుట్రల పట్ల ఆగ్రహం. మొదట శశికళను తర్వాత పన్నీరు సెల్వంను ఆ పైన ఫలని స్వామిని ఇలా రకరకాలుగా వ్యూహం మారుస్తూ తమ పట్టు పెంచుకోవడానికి బీజేపీ ప్రయత్నించడం రాష్ట్ర ప్రజలకు రుచించలేదు. మరి ఇప్పుడు రజనీ కాంత్ కూడా అదే బీజేపీతో మంచిగా ఉండాలనుకుంటే ప్రజలు హర్షిస్తారా అనేది ప్రశ్న. తమిళనాడులో ఓట్లుసీట్లతో నిమిత్తం లేకుండా వామపక్షాలు సామాజిక న్యాయశక్తులు పోరాడుతూనే వున్నాయి. రజనీ ప్రకటనలో ఆ వూసే లేదన్న విమర్శ కూడా వుంది. రెండేండ్ల కిందట వరదలు వస్తే చిన్న చితక నటుల కన్నా రజని ఇచ్చిన విరాళం తక్కువగా వుండటంపైనా విమర్శలు వచ్చాయి.

ఎంజీఆర్ జయలలిత వంటివారికే ఓట్ల శాతం 33-38 మధ్యనే వుంటూ వచ్చింది.(ఒక్కసారితప్ప) దానికోసం ఎంజీఆర్ చిత్రాలలోనూ బయిట కూడా ఎన్నో జాగ్రత్తలు తీసుకునేవారు. చిత్రాలలో ఆయన పాత్రలు ఎలాంటి వ్యసనాలు గాని అమ్మాయిల వెంటపడి కలలు గనడం గాని చేయవు. ఒక ముసలి రోగిష్టి తల్లి పాత్రతో సెంటిమెంటు తప్పనిసరి. వీలైనప్పుడల్లా పేదల గురించి డైలాగులుంటాయి. ఈ విధంగా తనను తల్చుకోగానే ఒక సజ్జన నాయకుడు గుర్తుకు వచ్చేలా ఎంజిఆర్ శ్రద్ధ తీసుకున్నారు. పదవిలోకి రాకముందే పేదలకు దాన ధర్మాలు చేస్తూ ముఖ్యమంత్రి అయ్యాక సంక్షేమ పథకాలపై శ్రద్ధ పెట్టారు.

రజనీ పాత్రలు కూడా ఎంజిఆర్‌తో పోలిస్తే చాలా తేడాగా వుంటాయి. దూకుడుతో పాటు స్టైల్ ప్రధానంగా చూపిస్తూ రజని ప్రేక్షకులకు దగ్గరయ్యారు. తను ఒక నటుడుగా కన్నా స్టైల్‌నే గుర్తు చేస్తాడు. ఆయన రాజకీయాల్లోకి రావడం అంటే ఈ అవాస్తవ ఇమేజితో భ్రమలు పెంచడమేనని కొందరి వాదన. రజని మాత్రం అవకాశం దొరికితే మోడీని కీర్తిస్తుంటారు. ఇవన్నీ తేడాలు. జయలలిత మరణం తర్వాత ధనాఢ్య వర్గాలు ఆయనకు బాగా మద్దతు ఇవ్వడమే గాక వనరులు సమకూర్చడానికి కూడా సిద్ధంగా వున్నాయట.

ఘన విజయం తర్వాత, మూడు మాసాల్లో ప్రభుత్వాన్ని పడగొడతానని చెప్పిన దినకరన్ ఏం చేస్తారనేదానిపై తదుపరి ఘట్టం ఆధారపడి వుంటుంది. అనర్హత వేటుపడిన ఆయన అనుయాయులైన 18 మంది ఎమ్మెల్యేలపై హైకోర్టు తీర్పు ఇవ్వనున్నది. ఆ తీర్పునుబట్టి ఇతరులు బయిటకు వస్తారా లేదా అనేది తేలిపోతుంది. వారు బయిటకు వస్తేనే ప్రభుత్వం పడిపోయి శాసనసభ ఎన్నికలు వస్తాయి.. లేదంటే 2019 లోక్‌సభ ఎన్నికలే బలపరీక్షకు సందర్భమవుతాయి. రజని అప్పుడేమి చేస్తారన్నది కూడా అస్పష్టమే. ఇప్పుడు ఆయన చేసిన ప్రకటన కథ మధ్యలో విశ్రాంతి వంటిది తప్ప పతాక సన్నివేశం కాదు. మొత్తం పరిణామాలూ సమీకరణాలు స్పష్టమైతే గాని భవిష్యత్తును అతిగా ఊహించడం వల్ల ప్రయోజనం వుండదు. అందుకే ప్రముఖ మీడియా వ్యాఖ్యాతలూ మేధావులు కూడా రజనీ రాకడపై ఆచితూచి స్పందిస్తున్నారు.

నిండయిన చేతులతో...

సంప్రదాయ వేడుకలకు అద్భుతమైన కళను, హుందాతనాన్ని తెచ్చిపెడతాయి ఎంబ్రాయిడరీ లాంగ్ స్లీవ్స్. ఇక స్లీవ్స్ రంగు ఏదైనా కానీ వాటి మీద కనిపించే జువెలరీ ఎంబ్రాయిడరీ వర్క్ మాత్రం ఎంతో ఆకర్షణీయంగా ఉంటుంది. లేత గోధుమ రంగులో ఉండే సిల్క్ క్లాత్ పైన గులాబీ రంగు పువ్వులు, పట్టు వర్క్ దీనికి ప్రధాన ఆకర్షణ. ఎరుపు రంగు నెట్టెడ్ లాంగ్ స్లీవ్ మీద సన్నగా, అందంగా తీర్చిదిద్దిన ఫ్యాబ్రిక్ వర్క్ ఎంతో అద్భుతంగా కనిపిస్తుంది. సింపుల్ అండ్ గ్రాండ్ లుక్ లో కనిపించే లాంగ్ స్లీవ్స్‌ను ఓ సారి ప్రయత్నించి చూడండి!



గంతులేద్దామా!




చిన్నారులు కూడా ఒత్తిడితో చాలా ఇబ్బంది పడుతున్నారని చెబుతున్నాయి కొన్ని పరిశోధనలు. దాన్ని అదుపులో ఉంచాలంటే తల్లిదండ్రులు వారితో ఎక్కువ సమయం గడపడం లేదా వారికి ఇష్టమైన ఆటలు ఆడించడం వంటివి చేయాలి.

- శారీరక శ్రమ అధికంగా ఉండే ఆటలు వాలీబాల్, కబడ్డీ, బాస్కెట్ బాల్, క్రికెట్, లాంగ్ జంప్, రన్నింగ్, వంటివి ఆడించాలి. ప్రాజెక్ట్‌లు.. వాటితో పాటు మొక్కల పెంపకం, కథలు చెప్పడం వంటివి కొన్ని ఉదాహరణలు మాత్రమే.
- చిన్నారులకు ఆసక్తి ఉంటే.. వాళ్లు వివిధ దేశాల నాణేలను సేకరించమని చెప్పండి. ఇలా చేయడం వల్ల వాటిలో ఓ కొత్త అభిరుచి ఏర్పడుతుంది. దీని వల్ల సమయం సద్వినియోగం అవుతుంది.
- ఎదిగే వయసులో పిల్లలకు ఇంటి పనులను నేర్పించండి. ఖాళీ సమయంలో తమ దుస్తుల్ని చక్కగా మడతపెట్టుకోవడం, స్కూల్ బ్యాగును సర్దుకోవడం వంటి అలవాట్లను నేర్పితే పెద్దయ్యాక కూడా మరిచిపోరు.
- అలాగే ఇతరులతో ఎలా మెలగాలి.. ఎదుటివారికి సాయం చేయడం వంటి లక్షణాలు అలవడితే మంచిది.
- ప్రస్తుతం చిన్నారులు చిరుతిళ్లను ఎక్కువ గా ఇష్టపడుతున్నారు. వాటికి దూరంగా ఉంచడం తల్లిదండ్రుల బాధ్యత. ❄

ఇట్లచేద్దాం

చాలా మందికి ప్రయాణాలు పడవు. అలాంటి వారు బస్సు లేదా కారు కదలగానే రెండు పూదీన ఆకులను నోట్లో వేసుకోండి.

ముత్యాల ముగ్గులు





బి. అక్షయ
చిలుకనగర్
హైదరాబాద్

డిజైన్ ముగ్గు

డిజైన్ ముగ్గు





బండి నాగేంద్ర
ఖమ్మం

మా చిరునామా
మానవి, నవతెలంగాణ దినపత్రిక, ఎం.హెచ్. భవన్, 21/1, అజామాబాద్, హైదరాబాద్-20. ఇ-మెయిల్: navamaanavi@gmail.com

మెగ్నీషియం తగ్గితే!

కొంతమందికి అరికాళ్లు వీపరితమైన మంట, నొప్పులు ఉంటాయి. దీనికి కారణం శరీరంలో మెగ్నీషియం తగ్గడం అంటున్నారు నిపుణులు. ఇలాంటప్పుడు తక్షణ ఉపశమనం కోసం ఏదో పెయిన్‌బామ్ రాసుకుంటారు. దాని వల్ల ఎలాంటి ఉపయోగం ఉండదు. ఈ మంటకు కారణం శరీరంలో మెగ్నీషియం, క్యాల్షియం, పొటాషియం లోపించడం. ఈ పోషకాలు ఉన్న పదార్థాలు తీసుకుంటే సరిపోతుందని చెబుతున్నారు వైద్యులు.



- జింక్, విటమిన్ 'బి 12' ఐరన్ లోపం ఉన్న వారిలో తరచూ పెదాల చివర్లు పగులుతాయి. ఐరన్ ఎక్కువగా ఆకుకూరలు, గుడ్లు, చేపలు, పండ్లు, చికెన్ వంటివి తీసుకోవడం ఆరోగ్యానికి మంచిది.
- విటమిన్ 'బి' లోపం ఉంటే నాలుకా, పెదాలు పొడిబారి తెల్లగా కనిపిస్తాయి. కాబట్టి రోజువారీ ఆహారంలో విటమిన్ 'బి' ఉండే ఆహారపదార్థాలను ఎంపిక చేసుకుంటే మంచిది.
- అలాగే జింక్ లోపం వల్ల గోళ్లు పగిలి తెల్లగా కనిపిస్తాయి. ముఖ్యంగా శరీరంలో జింక్ పోషకం తగ్గితే వ్యాధినిరోధక శక్తి క్రమంగా తగ్గిపోతుంది. దాంతో జలుబు, దగ్గు, జ్వరం, ఇన్ఫెక్షన్లు, ఎలర్జీ వంటి సమస్యలు పెరుగుతాయి. ఈ ప్రభావం పెదాలు, కండ్లు, గోళ్లపై స్పష్టంగా కనిపిస్తుంది. ❄

ప్రణాళికతోనే సాధ్యం...

ఎంతటి క్లిష్టమైన పనైనా సరే చిన్న ప్రణాళికతో సాధ్యం అవుతుంది. ప్రణాళిక ఒక్కటి ఉంటే సరిపోదు. దానికి తగ్గ శ్రమ, ఆచరణాత్మకత ఉంటే మంచిది. దాని కోసం ముందు రోజు చేయాలనుకున్నా పనిని ముందుగానే ప్రణాళిక సిద్ధం చేసుకోవడం వల్ల సగం పని పూర్తి అయినట్టే. వారం రోజులు చేయాబోయే పనులకు సంబంధించి ముందుగానే ప్లానింగ్ ఉంటే మరీ మంచిది.



- రోజువారీ ఒత్తిడిని అధిగమించాలంటే కొంత సమయం కుటుంబ సభ్యులతో, స్నేహితులతో, ఏకాంతంగా గడపడం కూడా తప్పని సరి.
- ఏదైన ప్రణాళిక వేసుకుంటే దాన్ని తప్పకుండా పూర్తి చేయడం కీలకం. కొన్నిసార్లు చేసే పనిలో బ్రేక్ పడొచ్చు. అలాంటి సమయంలో కాస్త బ్రేక్ ఇచ్చి మళ్లీ పనిలో పడటం మంచిది. పని పూర్తి కాకుంటే ఆందోళన, ఒత్తిడి వంటి సమస్యలు వేధిస్తుంటాయి. జీవితంలో సర్దుబాట్లకు, మార్పులకు ఎప్పుడూ సిద్ధంగా ఉండాలి.
- ప్రణాళికబద్ధంగా అడుగులు వేయాలనుకోవడం మంచిదే కానీ ఈ మార్పు ఒక్కసారే కనిపించాలనుకోవడం పొరబాటు. నెమ్మదిగా, క్రమ క్రమంగా ఎదగడం మంచిది. అదే ఉన్నతమైన లక్ష్యాలను చేరుకునేలా సహాయపడుతుంది. ❄

ఆదర్శంగా ఐస్‌ల్యాండ్....

చేసే పని సమానం. ఒక్కోసారి మగవారి కన్నా ఎక్కువే. అయినా... వేతనాల్లో మాత్రం ఎంతో వ్యత్యాసం. ఇది ప్రపంచవ్యాప్తంగా మహిళలపై కొనసాగుతున్న దోపిడి. సమానపనికి సమాన వేతనాలు ఇవ్వడంలో అన్ని దేశాలు మహిళల పట్ల వివక్ష చూపుతూనే ఉన్నాయి. దీనికి చెక్ పెడుతోంది ఐస్‌ల్యాండ్. పురుషులకు ఎక్కువ వేతనాలు ఇస్తూ.. మహిళలకు తక్కువ వేతనం ఇవ్వడం అన్యాయం అని చట్టాన్ని చట్టాన్ని తీసుకొచ్చింది. ఏవైనా సంస్థలు ఇలా చేస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. 2017 మార్చి 8న ప్రకటన చేసినా.. కొత్త సంవత్సర కానుకగా అమలు చేయాలని నిర్ణయించుకుంది. 25 మంది అంతకంటే ఎక్కువ మంది ఉద్యోగులున్న ప్రతి సంస్థ సమానవేతనాలు అందజేస్తున్నట్టు ప్రభుత్వం నుంచి సర్టిఫికెట్లు అందుకోవాలని... లేకపోతే జరిమానాలు చెల్లించాల్సి వస్తుందని చెప్పింది. ఈ నిర్ణయానికి ప్రభుత్వానికి విపక్షాలు సంపూర్ణ మద్ధతు పలికాయి. పార్లమెంటులో దాదాపు 50 శాతం మంది మహిళలే ఉండటం కూడా ఇది సాధించడం మరింత సులభమైంది. 2016 అక్టోబర్ 24న ఏడాది వేలాది మంది మహిళలు వీదుల్లోకొచ్చి వేతనంలో ఉన్న తేడాకి నిరసనగా ఆందోళన నిర్వహించారు.



పోరాడితే పోయేదేమీ లేదు బానిస సంకెళ్ళ తప్ప అన్న నినాదాన్ని నిజమని నిరూపించారు. ఫలితాన్ని పొందారు. ఇప్పటికే వరల్ ఎకనామిక్ ఫోరమ్ నిర్వమిస్తున్న గ్లోబల్ జెండర్ గ్యాప్ రిపోర్ట్‌లో... అత్యధిక లింగ సమానత్వం కలిగిన దేశంగా ఐస్‌ల్యాండ్ తొమ్మిదేండ్లుగా మొదటిస్థానాన్ని అందుకుంటోంది. 2020 కల్లా స్త్రీ, పురుష వేతనాల్లో వ్యత్యాసాన్ని పూర్తిగా నిర్మూలించాలని నడుం కట్టింది. ఐస్‌ల్యాండ్ తీసుకున్న నిర్ణయానికి ప్రపంచవ్యాప్తంగా మహిళలనుంచి పూర్తి మద్ధతు లభించింది. ఇక మనదేశంలో అతితక్కువ జీతాలు తీసుకుంటున్నవారిలో మహిళలే ఎక్కువ. అత్యధిక సంపాదన ఉన్నవారిలో మహిళల వాటా కేవలం పదిహేను శాతమే. వింతేమిటంటే.. ఈ వేతన తేడా అత్యధికంగా జీతాలిచ్చే ఉన్నతశ్రేణి రంగాల్లో లేదు. తక్కువ జీతాలిచ్చే రంగాల్లోనే ఎక్కువగా ఉంది. మరోరకంగా చెప్పాలంటే ఆడ-మగ వేతన తేడా స్వల్పంగా ఉండే రంగంలో స్త్రీలు తక్కువగా ఉంటున్నారు. ఆ తేడా అధికంగా ఉన్నచోట ఎక్కువమంది పనిచేస్తున్నారు. ఉన్నతశ్రేణి రంగాల్లో స్త్రీలపై ఉన్న వివక్ష ఓ కారణం. ❄

ఏప్రిల్ 22 నుంచి ఏపీ [illegible]

అమరావతి : వివిధ కోర్సుల్లో ప్రవేశానికి ఈఏడాది నిర్వహించే ఎపి సెట్ల షెడ్యూల్‌ను విజయవాడలోని ఎపి ఉన్నత విద్యా మండలి కార్యాలయంలో ఏపీ విద్యా శాఖ మంత్రి గంటా శ్రీనివాసరావు సోమవారం విడుదల చేశారు. ఏప్రిల్ 19న ఎడ్‌సెట్, లా సెట్, ఏప్రిల్ 22 నుంచి 25 వరకూ ఎంసెట్ (ఇంజనీరింగ్), 26న ఎంసెట్ (బైపిసి), మే 2న ఐసెట్, 3న ఇసెట్, మే 10 నుంచి 12 వరకూ పిజిఇ సెట్, మే 4 నుంచి పిఇసెట్లను నిర్వహించనున్నట్లు వెల్లడించారు. 2016-18 బిఎడ్, డిఎడ్ విద్యార్థుల విజ్ఞప్తి మేరకు వారికి టెట్‌కు అవకాశం కల్పిస్తున్నామని మంత్రి వెల్లడించారు. గతేడాదితో పోలిస్తే కాస్త ముందుగా ఈ పరీక్షలను నిర్వహిస్తున్నామని, అన్ని పరీక్షలు ఆన్‌లైన్‌లోనే ఉంటాయని తెలిపారు. వారం రోజుల్లో ఫలితాలు వెల్లడించేందుకు చర్యలు తీసుకుంటు న్నామన్నారు. ఈ ఏడాది ఎంసెట్ కోసం 115 నుంచి 150 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేయనున్నామన్నారు. గతేడాది ఇంజనీరింగ్‌లో 1.36 లక్షల సీట్లుంటే 84,478 సీట్లు భర్తీ అయ్యాయని, 52,250 సీట్లు ఖాళీగా ఉండిపోయాయని వివరించారు. సరైన సమయంలో పరీక్షలు నిర్వహించి విద్యార్థులు ఇతర రాష్ట్రాలకు వెళ్లిపోకుండా చర్యలు తీసుకున్నామన్నారు. అన్ని యూనివర్సిటీల్లో అధ్యాపకుల పోస్టుల భర్తీకి నోటిఫికేషన్లు ఇచ్చారని, అసిస్టెంట్ ప్రొఫెసర్ల నియామకాన్ని ఎపిపిఎస్‌సికి అప్పగించామని తెలిపారు. విశాఖలోని స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను యూనివర్సిటీగా మార్చుకోవాలని కేంద్ర పెట్రోలియం శాఖా మంత్రి సూచించారని, సిఎంతో చర్చించి దీనిపై నిర్ణయం తీసుకుంటామని అన్నారు. నాణ్యమైన విద్యనందించేందుకు ఉత్తమ ఉపాధ్యాయులు అవసరమని, అందు కోసం టీచర్ ఎడ్యుకేషన్ యూనివర్సిటీని ఏర్పాటు చేయాలని యోచిస్తున్నామని, ప్రస్తుతం ఆ విధానం తమిళనాడులో మాత్రమే ఉందని వివరించారు. ఇంటర్‌లో 40 శాతం మార్కులున్నా టెట్‌కు అర్హత కల్పించే అంశాన్ని పరిశీలిస్తున్నామన్నారు. నాక్ ఎ గ్రేడ్ కలిగిన కళాశాలల్లో ఈ ఏడాది నుంచి డిగ్రీతో పాటు బిఎడ్ విద్యను అందిం చేలా నాలుగేళ్ల ఇంటిగ్రేటెడ్ టీచర్ ఎడ్యుకేషన్ ప్రోగ్రామ్‌ను ప్రారంభి స్తున్నామన్నారు. నూరు శాతం నాణ్యమె_న విద్యను అందించేందుకు నిబంధనలను తీసుకొస్తున్నామని తెలిపారు.

కొద్దిరోజుల్లో ఐటీఎమ్ఎస్

- సిగ్నల్స్ వద్ద ఒకేసారీ వేలాది ఫొటోల చిత్రీకరణ
- ఒకేరోజు 60-75 వేల చలాన్ల విధింపు
- ట్రాఫిక్ ఉల్లంఘనకు పాల్పడేవారిపై కఠిన చర్యలకు అవకాశం



ట్రాఫిక్ ఉల్లంఘనలకు పాల్పడే వాహనదారులారా తస్మాస్ జాగ్రత్త ! ఎవరూ చూడట్లేదు కదా అని అడ్డదిడ్డంగా వాహనాలను నడిపిస్తే ఇక అంతే. పక్కా సాక్ష్యాలతో అడ్డంగా దొరికిపోతారు. ఆ తర్వాత ట్రాఫిక్ పోలీసోళ్లు చలాన్లతో తాట తీస్తారు. ఇది నిజం. ఎలాగంటారా ! రాజధాని మహా నగరంలో ట్రాఫిక్ ఉల్లంఘనల నియంత్రణకు ఇంటలిజెన్స్ ట్రాఫిక్ మేనేజ్ మెంట్ సిస్టమ్ (ఐటీఎంఎస్) అందుబాటులోకి రాబోతున్నది. ఈ టెక్నాలజీతో సిగ్నల్స్ వద్ద ఒకేసారి పదుల, వందల సంఖ్యలో వాహనాల ఫొటోలను తీయవచ్చును. దీంతో ట్రాఫిక్ ఉల్లంఘించిన వార్పై ఒకేరోజు 60 నుంచి 75 వేల చలాన్లు విధించే అవకాశం ఉంది.

నవతెలంగాణ - సిటీబ్యూరో

నగరంలో ట్రాఫిక్ నిబంధనలు పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేస్తున్నవారితోపాటు..తప్పుడు నెంబర్ ప్లేట్లతో వెళ్తున్న వాహనాలను గుర్తించేందుకు ప్రస్తుతం నగర పోలీసులు ఏఎన్‌పీఆర్ (ఆటోమేటిక్ నెంబర్ ప్లేట్ రీడింగ్) సాఫ్ట్‌వేర్‌ను వినియోగిస్తున్నారు. అయితే వీటిని ఎంపికచేసిన ప్రాంతాల్లోని కెమెరాలకు అనుసంధానం చేశారు. తప్పుడు నెంబర్ ఉంటే వెంటనే కమాండ్ కంట్రోల్ రూమ్‌కు అది సమాచారం అందిస్తున్నది. ఒక కారుకు ఉన్న నెంబర్‌ను ఇతర కారుకు లేదా వాహనాలకు అమరిస్తే ఇట్టే పట్టేస్తుంది. వెంటనే ఫలానా రహదారిలో వెళ్తుందంటూ సూచిస్తుంది. దాంతోపాటే సిగ్నల్ జంపైన వారికి వెంటనే సెల్‌ఫోన్‌కు చలాన్ సమాచారం పంపిస్తున్నారు. అయితే ఈ విధానం ద్వారా రోజుకు 2-4 వేలమందికే చలాన్లు పడుతున్నాయి.

తప్పుడు నెంబర్ ప్లేట్లతో ఇబ్బందులు

రాజధానిలో ప్రస్తుతం దాదాపు 52 లక్షలకు పైగా వాహనాలున్నాయి. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు నిర్లక్ష్యం చేయడంతో రోజురోజుకూ ప్రమాదాలు పెరిగిపోతున్నాయి. ముఖ్యంగా 60-70 శాతం రోడ్డు ప్రమాదాలు డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా, మద్యం సేవించి నడపడంతోనే జరుగుతున్నాయని పోలీసులు నిర్వహించిన సర్వేలో తేలింది. అయితే ప్రమాదాలు జరిగిన సమయంలో నిందితులను పట్టుకోవడం పోలీసులకు తలనొప్పిగా మారింది. కొన్ని వాహనాలకు నెంబర్ ప్లేట్లు ఉండట్లేదు. మరికొన్ని వాటికి నెంబర్ ప్లేట్లున్నా అవి దొంగ నెంబర్ ప్లేట్లుగా ఉంటున్నాయి. ఇలాంటి సమస్యలకు చెక్ పెట్టేందుకు పోలీసులు కసరత్తు మొదలు పెట్టారు.

రాజధానిలో కొత్త శకం ఆరంభం

జనవరి మూడో తేదీన నగర కమిషనరేట్‌లో 'టెక్నాలజీ ఫ్యూషన్ సెంటర్‌తోపాటు, ట్రాఫిక్ కంట్రోల్ రూంను' డీజీపీ ఎం.మహేందర్‌రెడ్డి ప్రారంభించిన విషయం విదితమే. దాదాపు లక్షలకుపైగా క్రిమినల్స్‌తోపాటు 65 వేలకుపైగా వాహనదారుల డేటాను ఈ కేంద్రాల్లో పొందుపర్చారు. ఇక త్వరలో అందుబాటులోకి తీసుకొస్తున్న ఐటీఎంస్‌ను కమాండ్ కంట్రోల్ రూంకు లింక్ చేస్తారు. ఇప్పటివరకూ సేకరించిన పూర్తి డేటాను అనుసంధానం చేస్తారు. దాంతో ఒకేసారీ వేలాది ఇమేజ్‌లను పంపుతుంది. నగరంలో సిగ్నల్ జంపింగ్‌లు, రాంగ్‌రూట్స్, స్టాఫ్‌లైన్స్ దాటడం, చలాన్లు కట్టకుండా తప్పించుకొని తిరిగే వాహనదారులతోపాటు, ట్రాఫిక్ నిబంధనలను నిర్లక్ష్యం చేస్తున్న వారిని పట్టేస్తుంది. ఒకేసారీ ఎన్ని వాహనాలు వెళ్లినా రికార్డు చేస్తుంది. అన్నిరకాల ట్రాఫిక్ ఉల్లంఘనలను పసిగట్టి ఎప్పటికప్పుడు ట్రాఫిక్ కంట్రోల్ రూమ్‌కు సమాచారం చేరవేస్తుంది. ఎప్పటికప్పుడు ఫుటేజీలను, ఇమేజ్‌లను కంట్రోల్ రూంలో ఉన్న సిబ్బంది గమనిస్తుంటారు. అప్పటికప్పుడు అవసరమైన చర్యలు తీసుకుంటారు. వాహనదారులు ఎలాంటి ఉల్లంఘనలకు పాల్పడినా నిమిషాల వ్యవధిలో వాహనదారున్ని అలర్ట్ చేస్తున్నారు. చలాన్ ఎంత విధించారో సమాచారం పంపిస్తున్నారు. చలాన్ చెల్లించని పక్షంలో ట్రాఫిక్ పోలీసులు వాహనాన్ని సీజ్ చేస్తున్నారు. కోర్టులో ఉల్లంఘనలను బట్టి జరిమానాలు, శిక్షలు పడుతున్నాయి. ఇక ఐటీఎంఎస్‌తో రోజుకు 60-75 వేల చలాన్లు విధించే అవకాశం ఉందని ట్రాఫిక్ అధికారులు తెలిపారు.

తిరుపతిరావు కమిటీ నివేదికను బహిర్గత పర్చండి :సీపీఐ(ఎం) డిమాండ్

- ఫీజులపై అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ప్రయివేటు పాఠశాలల్లో ఫీజుల నియంత్రణ కోసం ప్రభుత్వం నియమించిన ప్రొఫెసర్ తిరుపతిరావు కమిటీ నివేదికను బహిర్గత పర్చాలని సీపీఐ(ఎం) డిమాండ్ చేసింది. ఈ కమిటీ ఫీజులను నియంత్రించకపోగా మరింత పెంచాలని సిఫారసు చేయడం అన్యాయమని పేర్కొంది. విద్యా రంగాన్ని పట్టి పీడిస్తున్న ప్రయివేటు కార్పొరేట్ స్కూళ్ల ఫీజుల సమస్యపై చర్చించడానికి అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేయాలని కోరింది. ఈ మేరకు పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రయివేటు పాఠశాలల్లో ఫీజులు అధికంగా ఉన్న విషయం అందరికే తెలిసిందేనని, అధిక ఫీజులను అరికట్టాలంటూ చేసిన ఉద్యమాల ఫలితంగా ప్రభుత్వం ప్రొఫెసర్ తిరుపతిరావు కమిటీని నియమించిందన్నారు. పాఠశాలల యాజమాన్యాల సహాయ నిరాకరణ వల్ల గత ఏడాది ఏప్రిల్ నెలలో ఇవ్వాల్సిన నివేదికను పదినెలలు ఆలస్యంగా ప్రభుత్వానికి ఇచ్చినట్టు తెలిసిందన్నారు. కాగా ఈ కమిటీ నివేదికలో ఫీజుల భారం తగ్గకపోగా మరింత పెంచాలని సూచనలు చేసినట్టు సమాచారం ఉందని పేర్కొన్నారు. కార్పొరేట్ విద్యా వ్యాపారులు ప్రభుత్వంతో లాబీయింగ్ జరిపి ప్రజా వ్యతిరేక సిఫారసులు చేయటం అన్యాయమన్నారు. ఈ వివాదస్పద సిఫారసులను ప్రభుత్వం పరిశీలించాల్సిన అవసరం ఉందన్నారు.

భద్రాద్రి క్యాలెండర్ ఆవిష్కరణ



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

భద్రాద్రి సీతారామచంద్రస్వామి దేవస్థానం రూపొందించిన 2018 సంవత్సర క్యాలెండర్‌ను సోమవారం దేవాదాయశాఖ మంత్రి ఏ ఇంద్రకరణ్‌రెడ్డి ఆవిష్కరించారు. గచ్చిబౌలిలోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో భద్రాద్రి ఆలయ ఈఓ కె ప్రభాకర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మేడారం రండి

- మహారాష్ట్ర సీఎం, గవర్నర్‌కు బీజేపీ నేతల ఆహ్వానం



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

మేడారం సమ్మక్క-సారక్క జాతరకు రావాలని బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ కె లక్ష్మణ్ బృందం మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఫడ్నవీస్, గవర్నర్ సీహెచ్ విద్యాసాగరరావులను వేర్వేరుగా కలిసి విజ్ఞప్తి చేశారు. మేడారం జాతరకు ఆయా రాష్ట్రాల ముఖ్యమంత్రుల్ని ఆహ్వానించే క్రమంలో సోమవారంనాడు లక్ష్మణ్ ఆధ్వర్యంలో బీజేపీ నేతలు టి రాజేశ్వర రావు, జి ప్రేమేందర్‌రెడ్డి, చందా లింగయ్యదొర, వన్నాల శ్రీరా ములు, అమర్ సింగ్ పవార్ బృందం మహారాష్ట్ర వెళ్లి అక్కడి సీఎం, గవర్న ర్‌లను కలిసి ఆహ్వానాలు అందించారు. అంతకుముందు ఛత్తీస్‌గఢ్ సీఎం రమణ్‌సింగ్‌ను కూడా కలిసి ఆహ్వానం ఇచ్చిన విషయం తెలిసిందే. వారంతా తప్పకుండా జాతరకు వస్తామని చెప్పారని డాక్టర్ లక్ష్మణ్ తెలిపారు.

నవీన్‌మిట్టల్‌కు ఘనసన్మానం



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

సమాచార, పౌరసంబంధాల శాఖ కమిషనర్ నవీన్‌మిట్టల్ ఉన్నత విద్య, సాంకేతిక విద్యాశాఖ కమిషనర్‌గా బదిలీపై వెళ్ళిన నేపథ్యంలో సమాచార శాఖ అధికారులు, ఉద్యోగులు, ఫిల్మ్ డెవలప్‌మెంటు కార్పొరేషన్ ప్రతినిధులు ఉమ్మడిగా సన్మానించారు. సోమవారం హైదరాబాద్‌లోని సమాచార్‌భవన్‌లో ఎఫ్‌డీసీ చైర్మెన్ రామ్మోహన్‌రావుతోపాటు సమాచార శాఖ అదనపు డైరెక్టర్ నాగయ్య కాంబ్లె, చీఫ్ ఇన్ఫర్మేషన్ ఇంజినీర్ కిషోర్‌బాబు, జాయింట్ డైరెక్టర్లు ఇ. వెంకటేశం, గొట్టిపాటి సుజాత, అధికారులు శ్రీనివాస్, నాగమణి, హాష్మీ, విజయభాస్కర్‌రెడ్డి, లక్ష్మీరాజం తదితరులు నవీన్‌మీట్టల్‌కు ప్రత్యేకంగా విందు ఇచ్చారు. శాలువాతో సన్మానించి, మొమెంటో అందజేశారు. ఈసందర్భంగా నవీన్‌మిట్టల్ మాట్లాడతూ సమాచార శాఖ కమిషనర్‌గా పనిచేయడం తనకు సంతృప్తిని ఇచ్చిందన్నారు. ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను విజయవంతంగా ప్రజల్లోకి తీసుకెళ్లగలిగామన్నారు. ఈ శాఖ కీలకమైనదని, అన్ని ప్రభుత్వ శాఖలతో సమన్వయం అవసరమని అభిప్రాయపడ్డారు. గతంలో ఏపీ సమాచార శాఖతో పోలిస్తే తెలంగాణ సమాచార శాఖకు వసతులు తక్కువగా ఉండేవని, ఇప్పుడు తెలంగాణ సమాచార శాఖతో ఏపీ ఉద్యోగులు పోల్చుకునే పరిస్థితిని తెచ్చామన్నారు.

బీజేపీని వీడుతున్న నేతలు

తాజాగా కొమ్మూరి రాజీనామా

- నిరాశలో పార్టీ పెద్దలు



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

కొండ నాలుకకు మందేస్తే...ఉన్న నాలుక ఊడినట్టు తయారైంది రాష్ట్ర బీజేపీ పరిస్థితి. తెలంగాణలో అధికారపార్టీకి తామే ప్రత్యామ్నాయమని, 2019 ఎన్నికల్లో అధికారంలోకి వస్తామని ధీమా వ్యక్తం చేస్తున్న ఆపార్టీ పెద్దలకు స్థానిక నాయకులు షాక్‌లు ఇస్తున్నారు. టీఆర్ఎస్, కాంగ్రెస్‌పార్టీల నుంచి పెద్ద ఎత్తున బీజేపీలో చేరేందుకు పెద్ద నాయకులు తమతో టచ్‌లో ఉన్నారని ఇప్పటి వరకు ప్రచారం చేసుకున్నారు. అయితే ఆపార్టీకే చెందిన ముఖ్యనేతలు వరుసగా షాక్‌లు ఇస్తున్నారు. ఇప్పటికే ఆపార్టీకి చెందిన మాజీ ఎమ్మెల్యేలు యెన్నం శ్రీనివాసరెడ్డి, ప్రేమ్‌సింగ్‌రాథోడ్‌లు రాజీనామాలు చేశారు. తాజాగా జనగామ జిల్లాకు చెందిన మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాపరెడ్డి బీజేపీకి రాజీనామా చేశారు. త్వరలో ఆయన టీఆర్ఎస్‌లో చేరతారని ప్రచారం జరుగుతోంది. ఈ పరిణామంతో రాష్ట్ర బీజేపీలో తీవ్రమైన చర్చ జరుగుతోంది. ఇప్పటి వరకు బీజేపీలోకి చెప్పుకోదగ్గ నేతలు ఎవరూ ఇతర పార్టీల నుంచి చేరలేదు. కానీ బీజేపీ రాష్ట్ర నాయకత్వం మాత్రం 'మైండ్‌గేమ్' ఆడుతూ తమపార్టీ ఖాళీగానే ఉందని, వచ్చేవారు రావచ్చని చెప్పకనే చెప్తోంది. అయినా ఏ ఒక్క పెద్ద నాయకుడు ఆపార్టీలో చేరేందుకు ఆసక్తి కనబర్చట్లేదు. గుజరాత్ ఎన్నికల్లో బీజేపీ అతికష్టం మీద గట్టెక్కడంతో రాష్ట్ర బీజేపీ నేతల్లో కొందరు పునరాలోచన చేస్తున్నట్టు సమాచారం. ఈసారి కేంద్రంలో అధికారంలోకి వచ్చేది కష్టమేనని, నోట్లరద్దు, జీఎస్టీతోపాటు కొత్తగా ప్రచారంలో ఉన్న ఎఫ్ఆర్‌డీఐ చట్టం వల్ల పార్టీకి నష్టం జరుగుతుందని అంచనా వేస్తున్నారు. ఇదే విషయాన్ని ఆపార్టీకి చెందిన ఓ సీనియర్ నేత ధృవీకరించారు. నోట్లరద్దు, జీఎస్టీని పార్టీ పరంగా తామెంత సమర్థించినా, ప్రజల్లో జరగాల్సిన డామేజ్ జరిగిపోయిందని ఆయన అభిప్రాయపడ్డారు. ఇక తాజాగా బీజేపీకి రాజీనామా చేసిన కొమ్మూరి ప్రతాపరెడ్డి ఆపార్టీలో క్రమశిక్షణ లేదంటూ ఆరోపణ చేశారు. బీజేపీలో ఇప్పటికే వ్యవస్థాగతంగా పాతుకుపోయిన సీనియర్లు, కొత్త నేతల్ని ఇమడనీయడం లేదని విమర్శించారు. బీజేపీ జాతీయ అధ్యక్షులు అమిత్‌షా గత డిసెంబర్‌లో రాష్ట్రానికి వస్తారని, ఆ సందర్భంగా భారీ ఎత్తున ఇతర పార్టీల నేతలు తమ పార్టీలో చేరతారని అధ్యక్షులు డాక్టర్ లక్ష్మణ్ పలుమార్లు ప్రకటించారు. దీనిపై వ్యక్తిగతంగా నివేదికలు తెప్పించుకున్న అమిత్‌షా, రాష్ట్రంలో అంత సీన్ లేదని తెలుసుకొనే తన పర్యటనను వాయిదా వేసుకున్నట్టు సమాచారం. అయితే టీఆర్ఎస్‌ను దారిలోకి తెచ్చుకోవడంపైనే అమిత్‌షా ఎక్కువగా దృష్టి పెడుతున్నట్టు రాష్ట్ర బీజేపీ సీనియర్ నేత ఒకరు చెప్పారు. స్వంతంగా తాము గెలిచే పరిస్థితి లేదని, లోపాయికారిగా టీఆర్ఎస్ మద్దతు తమకు అవసరమనే విషయాన్ని అమిత్‌షా గుర్తించారని చెప్పుకొచ్చారు. ఈ విషయాన్ని ఇప్పుడే ప్రకటిస్తే క్రిందిస్థాయి కేడర్‌లో తప్పుడు సంకేతాలు వెళ్తాయనే ఉద్దేశ్యంతోనే చివరి వరకు వేచిచూసే ధోరణిలో ఉన్నట్టు సమాచారం. ఇక కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి మంత్రి హరీష్‌రావును భేటీ కావడంతో ఆయన టీఆర్ఎస్ తీర్థం తీసుకోవడం ఖాయంగా కనిపిస్తోంది.

ఉత్తమ్‌కు మద్దతిస్తాం.. కలిసి పనిచేస్తాం : కోమటిరెడ్డి

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

గత మూడున్నరేండ్లుగా తాను పీసీసీ అధ్యక్ష పదవి ఆశించిన మాట వాస్తవమేనని, ఇప్పుడు అటువంటి పరిస్థితి లేదని సీఎల్పీ ఉపనేత కోమటిరెడ్డి వెంకటరెడ్డి చెప్పారు. కాంగ్రెస్ అధికారంలోకి తేవడమే లక్ష్యంగా ఉత్తమ్‌తో కలిసి పని చేస్తామన్నారు. ఒక్కొక్క సీనియర్ నేత పది నియోజకవర్గాలను బాధ్యత తీసుకుని గెలిపించాలని కోరారు. సోమవారం సీఎల్పీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా కాంగ్రెస్ పార్టీకి 70 నుంచి 80 సీట్లు వస్తాయని ధీమా వ్యక్తం చేశారు. 24 గంటల కరెంట్ సరఫరాను నల్లగొండ జిల్లాలో పైలెట్ ప్రాజెక్టుగా ప్రవేశ పెట్టిందన్నారు. భూగర్భ జలాలు తగ్గిపోతాయని గ్రామ, గ్రామాన పంచాయతీలు తీర్మానం చేసినట్టు తెలిపారు. 24 గంటల కరెంట్‌పై ముఖ్యమంత్రి సమీక్షించి సరైన నిర్ణయం తీసుకోవాలని కోరారు. మడుగులపల్లిలో సర్వీసు చార్జీలు చెల్లించ లేదని కరెంట్ మీటర్లు తొలగించారని చెప్పారు.నాట్లు వేసుకునే సమయంలో రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆయన విమర్శించారు.

నేరెళ్ళ శారదకు ఎమ్మెల్సీ అవకాశం : ఉత్తమ్

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

దేశ చరిత్రలోనే మహిళ మంత్రి లేని క్యాబినెట్ టీఆర్ఎస్ ప్రభుత్వంలో ఉందని టీపీసీసీ అధ్యక్షులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి విమర్శించారు. సమాజంలో 50 శాతం మహిళలు ఉన్న ఈ రాష్ట్రంలో వారికి మంత్రి పదవి ఇవ్వకపోవడం ఏమిటని ప్రశ్నించారు. అధికారంలో లేకున్నా కాంగ్రెస్ పార్టీ మహిళలకు సముచిత స్థానం కల్పిస్తున్నదని చెప్పారు. కాంగ్రెస్ మహిళా విభాగం అధ్యక్షురాలు నేరెళ్ళ శారదకు ఎమ్మెల్సీ వచ్చే అవకాశం ఉందని చెప్పారు. సోమవారం గాంధీభవన్‌లో మహిళా కాంగ్రెస్ విభాగం అధ్యక్షురాలు శారద అధ్యక్షతన జరిగిన కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. రాబోయే రోజుల్లో మహిళలకు రాజకీయంగా మంచి అవకాశాలు వస్తాయన్నారు. వారంలో రోజుల్లో అన్ని స్థాయిలో మహిళా కమిటీలు వేయాలని సూచించారు. ఈ సమావేశంలో టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షులు మల్లు భట్టి విక్రమార్క, పలువురు మహిళా నాయకులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై మాట్లాడితే జైల్లో పెడతారా? జగ్గారెడ్డి

రాష్ట్రంలో ప్రజాస్వామ్యం లేకుండా పోయిందని టీపీసీసీ అధికార ప్రతినిధి జగ్గారెడ్డి అన్నారు. ప్రజా సమస్యలపై మాట్లాడితే జైల్లో పెడుతున్నారని విమర్శించారు. ఎస్సీ వర్గీకరణ కోసం ఉద్యమిస్తున్న మంద కృష్ణను రెండుసార్లు జైల్లో పెట్టడాన్ని ఆయన ఖండించారు.

మొన్న సిరిసిల్ల...నేడు కారేగామ్

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

రాష్ట్రంలో ఇసుక మాఫియా రాజ్యమేలుతోందని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతా సాంబమూర్తి అన్నారు. వారి కిరాతక చర్యలతో పేదలు బలైపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. మొన్న సిరిసిల్లలో ఇసుకమాఫియా అకృత్యాలకు పాల్పడిందని, తాజాగా కామారెడ్డి జిల్లా కారేగామ్‌లో బోయిని సాయిలును బలి తీసుకుందని తెలిపారు.

భద్రత లేని కాంట్రాక్టు ఉద్యోగులు

- కాంట్రాక్టు అధ్యాపకుల మృతితో కుటుంబం రోడ్డుపాలు
- కామారెడ్డిలో గుండెపోటుతో సయ్యద్ పాషా మరణం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో కాంట్రాక్టు ఉద్యోగులు, అధ్యాపకులకు ఉద్యోగ భద్రత లేదు. రాష్ట్ర ప్రభుత్వం వారి సర్వీసులను క్రమబద్ధీకరించకపోవడం వల్ల కాంట్రాక్టు అధ్యాపకులు మృతి చెందుతుండడంతో వారి కుటుంబాలు రోడ్డునపడుతున్నాయి. సోమవారం కామారెడ్డి జిల్లా తాడ్వాయి ప్రభుత్వ జూనియర్ కాలేజీలో పనిచేసిన కాంట్రాక్టు అధ్యాపకుడు సయ్యద్ పాషా గుండెపోటుతో మృతి చెందారు. జీతాలు సకాలంలో అందక అప్పులపాలై అధిక రక్తపోటు (హైబీపీ) రావడం వల్ల హఠాన్మరణం చెందారు. రాష్ట్రంలో ఇప్పటి వరకు తొమ్మిది కాంట్రాక్టు అధ్యాపకులు వివిధ కారణాలతో మృతిచెందారు. వేణుగోపాల్, లక్ష్మీనారాయణ (పెద్దపల్లి), సత్యం (మంచిర్యాల), ఖదీర్ సుల్తానా, అయాజుద్దీన్ (హైదరాబాద్), విక్రం రెడ్డి, తివారి (నిజామాబాద్), తాయప్ప (మహబూబ్‌నగర్), సయ్యద్ పాషా (కామారెడ్డి) తదితర కాంట్రాక్టు అధ్యాపకులు చనిపోయారు. వారు చనిపోవడంతో ఆ కుటుంబాలు రోడ్డున పడ్డాయి. రాష్ట్ర ప్రభుత్వం నయాపైసా ఆర్థిక సాయం అందలేదు. దీంతో ఆ కుటుంబాలు దిక్కుతోచని స్థితిలో పడ్డాయి. ఈ మేరకు తెలంగాణ ప్రభుత్వ కాలేజీల కాంట్రాక్టు అధ్యాపకుల సంఘం అధ్యక్షులు జి రమణారెడ్డి, ప్రధాన కార్యదర్శి కొప్పిశెట్టి సురేష్ సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ప్రభుత్వ ఉద్యోగి చనిపోతే దహన ఖర్చులకు రూ.20 వేల సాయం ప్రభుత్వం నుంచి అందుతుందని తెలిపారు. మరి కాంట్రాక్టు ఉద్యోగి చనిపోతే ప్రభుత్వం ఎందుకు సాయం చేయడం లేదని పేర్కొన్నారు. ఇంటర్ విద్యను ప్రగతిపథంలో నడిపించే కాంట్రాక్టు ఉద్యోగులు మాత్రం శ్మశాన పథంలో నడుస్తున్నారని తెలిపారు. ముఖ్యమంత్రి, విద్యామంత్రి వెంటనే జోక్యం చేసుకొని మరణించిన కాంట్రాక్టు అధ్యాపకుల కుటుంబాలను ఆదుకోవాలని, ఆర్థిక సాయం అందించాలని కోరారు. కాంట్రాక్టు ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. కామారెడ్డిలో సయ్యద్ పాషా మృతికి సంతాపం, వారి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

పోరు డౌటే..


- బి.బసవపున్నయ్య

పంచాయతీరాజ్ సంస్థల ఎన్నికలు గడువులోగా నిర్వహించే అవకాశాలు కనిపించడం లేదు. కొత్త చట్టం రూపొందించే పనిలో ఉన్న టీఆఆర్ఎస్ ప్రభుత్వం ఆ దిశగా ముందస్తు ఏర్పాట్లు చేయడంలో వెనకపడిందనే వ్యాఖ్యానాలు వినిపిస్తున్నాయి. సమయం తక్కువగా ఉండటం, చేయాల్సిన పని ఎక్కువగా ఉన్న నేపథ్యంలో ఎన్నికల వాయిదా తప్పనిసరి అని ఉన్నతాధికారులు చెబుతున్నారు. మరోవైపు రాష్ట్ర ఎన్నికల సంఘం అధికారులు పంచాయతీరాజ్ ఎన్నికలకు సన్నద్ధమవుతున్నారు. ఓటర్ల జాబితాలు, ఇతర అంతర్గత ప్రక్రియ విషయంలో ఏర్పాట్లు చేసుకుంటున్నది. జిల్లా కలెక్టర్లకు ఇప్పటికే ఎన్నికల నిర్వహణకు సంబంధించిన ఆదేశాలు ఇచ్చింది. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలు ఎప్పుడు నిర్వహించాలని చెప్పినా, అప్పుడు సర్వసన్నద్ధంగా ఉండేలా చర్యలు అవసరమని ఎన్నికల సంఘం భావిస్తున్నది. ఈమేరకు కలెక్టర్లను అప్రమత్తం చేసింది. ఏర్పాట్లు పూర్తిచేయాలంటూ సూచించింది. అయితే ఆదిశగా ప్రభుత్వం చర్యలు లేవన్న అభిప్రాయం వస్తున్నది. స్థానిక సంస్థలు నిర్వీర్యమవుతున్న తరుణంలో వాటిని బలోపేతం చేసేందుకు నూతన పంచాయతీరాజ్ చట్టం అవసరమనే భావనలో ముఖ్యమంత్రి కె చంద్రశేఖర్‌రావు ఉన్నారు. అయితే ఇప్పుడప్పుడే ఈ పని కొలిక్కివచ్చే పరిస్థితి లేదని స్వయానా ఉన్నతాధికారులు అభిప్రాయపడ్డారు. రాష్ట్ర వ్యాప్తంగా హైదరాబాద్ మినహా మిగతా 30 జిల్లాల్లో స్థానిక సంస్థలు ఉన్నాయి. ఈ మేరకు రాష్ట్రంలో తొమ్మిది జిల్లా పరిషత్‌లు, 8685 సర్పంచులు, 6441 ఎంపీటీసీలు, 438 మంది జెడ్పీటీసీ స్థానాలు, మరో 438 ఎంపీపీ స్థానాలు ఉన్నాయి. వీటితోపాటు మున్సిపాల్టీలు, పంచాయతీల్లోని వార్డు సభ్యులు, ఇతర స్థానిక సంస్థల ప్రతినిధులు కలుపుకుని సుమారు లక్ష మంది వరకు స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు ఉన్నారు. ఈ స్థానాలన్నింటికి ఎన్నికలు జరపాల్సి ఉంది. రాజ్యాంగంలోని 73, 74 వ అధికరణాలు స్థానిక సంస్థలకు జవసత్వాలను కల్పిస్తున్నాయి. అయితే రాష్ట్ర ప్రభుత్వాలు వాటికి ఇవ్వాల్సిన అధికారాలు, విధులు, నిధులు ఇవ్వకుండా జాప్యం చేస్తున్నాయి. అయితే ఏండ్లతరబడి ఇదే ఒరవడి కొనసాగుతున్న నేపథ్యంలో స్థానిక ప్రభుత్వాలు నిర్వీర్యమయ్యే పరిస్థితి నెలకొంది. ఒకవైపు అధికారాలు లేక అవస్థలు పడుతుండగా, మరోవైపు నిధుల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఆధారపడ్డాయి. ఇదిలావుండగా టీఆర్ఎస్ ప్రభుత్వం కొత్త పంచాయతీరాజ్ చట్టాన్ని తేవడం ద్వారా పంచాయతీరాజ్ సంస్థలకు బలం చేకూర్చాలని భావిస్తున్నది. ఇందుకోసం ప్రభుత్వం మాజీ ప్రధాన కార్యదర్శి రాజీవ్‌శర్మ అధ్యక్షతన కొత్త కమిటీని ఏర్పాటు చేస్తూ జీవో నెంబరు 689ని విడుదల చేశారు. ఈ కమిటీ పలు రాష్ట్రాల్లో పర్యటించి అధ్యయనం చేసి వచ్చింది. ఈ మేరకు నివేదికను అందించింది. ఇటీవల సీఎం కేసీఆర్ మంత్రివర్గ ఉపసంఘాన్ని పంచాయతీరాజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అధ్యక్షతన ఏర్పాటు చేసింది. కొత్త చట్టం, ఇతర అంశాలకు సంబంధించి మూడు నెలల్లో నివేదిక ఇవ్వనుంది. ఇందులో పలువురు కీలకమంత్రులు ఉపసంఘం సభ్యులుగా ఉన్నారు. ఈ ప్రక్రియ అంతా పూర్తి కావడానికి చాలా సమయమే పట్టే అవకాశాలు ఉన్నాయి. స్థానిక సంస్థల ఎన్నికలు జూన్‌లోపు నిర్వహించాలి. 2013, జూన్‌లో పంచాయతీలకు ఎన్నికలు జరిగాయి. అలాగే ఎనిమిది నెలలు ఆలస్యంగా 2014, మే నెలలో ఎంపీటీసీలు, జెడ్పీటీసీలకు ఎన్నికలను చేపట్టారు. చట్టం రూపొందించడం, దాన్ని క్యాబినెట్‌లో ఆమోదించాలి. అంతేగాక ఇప్పుడున్న 8685 పంచాయతీలకు తోడు కొత్తగా మరో 4000 నుంచి 5000 ఏర్పాటు చేయాలని భావిస్తున్నది. గ్రామాల్లో కనీసం 500 మేర జనాభా ఉన్న తండాలను కొత్త పంచాయతీలుగా ఏర్పాటు చేస్తామని ప్రభుత్వం అసెంబ్లీలో ప్రకటించింది. అయితే తక్కువ జనాభాతో ఉన్న గ్రామాలు, తండాలను పంచాయతీలుగా ఏర్పాటు చేస్తే వాటికి ఆదాయం సమస్య వస్తుందని, మనుగడ సాగించలేవని పంచాయతీరాజ్ నిపుణులు అంటున్నారు. పల్లెలకు ఆర్థిక పరిపుష్టిని కల్పించే రాష్ట్ర ఆర్థిక సంఘాన్ని టీఆర్ఎస్ ప్రభుత్వం దాదాపు మూడున్నరేండ్ల మేర ఆలస్యంగా ఇటీవల నియమించింది. తద్వారా పంచాయతీలను, ఇతర సంస్థలను ప్రభుత్వమే పెడచెవినపెట్టినట్టయింది. అంతేగాక 1994 లో తీసుకొచ్చిన పంచాయతీరాజ్ చట్టం బాగానే ఉన్నా, దాన్ని అమలుచేయడం లేదని ఫోరమ్ ఫర్ గుడ్ గవర్నెన్స్ సంస్థ అంటున్నది. అయినా కొత్త చట్టం తీసుకురావడం అంటే ఒక వైద్యుడు రాసిన మందులను వాడకముందే, మరో వైద్యుని దగ్గరకు చికిత్స కోసం వెళ్లినట్టుగా ఉందని తెలిపింది. స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు 50 శాతం మించకుండా చర్యలు తీసుకోవాలని సూచించింది. కొత్త పంచాయతీరాజ్ బిల్లు ప్రజల ముందు ఉంచి వారి సలహాలు తీసుకున్న తరువాతే అసెంబ్లీలో చట్టం చేయాలని డిమాండ్ చేసింది.

ఇకపోతే పంచాయతీరాజ్ ఎన్నికలు పరోక్ష పద్ధతిలో నిర్వహించాలనే విషయమై కూడా వ్యతిరేకత వస్తున్నది. వార్డు సభ్యులచేత పరోక్షంగా ఎన్నుకోబడిన సర్పంచ్, గ్రామాభివృద్ధి దృష్టిపెట్టే బదులు తన పదవిని కాపాడుకునేందుకు వార్డు సభ్యుల చుట్టూ తిరిగేలా కొత్త చట్టం చేయబోతున్నారనే ఆరోపణలు ఇప్పటికే వినిపిస్తున్నాయి. అంతేగాక పార్టీ గుర్తుల పేర ఎన్నికలకు వెళ్లాలనే యోచనలో సర్కారు ఉన్నట్టు సమాచారం. అలాగే రిజర్వేషన్లు కూడా చేయాల్సి ఉంది. ఇవన్నీ పూర్తయి సకాలంలో ఎన్నికలు జరగడం అనుమానమేనని అధికారులు భావిస్తున్నారు. కోర్టుకు ఎక్కితే అంతే సంగతులన్నారు.

వ్యయం తగ్గించేలా కొత్త పీఆర్ చట్టం

- గ్రామాలకు నిధుల కొరత లేకుండా బడ్జెట్‌లో కేటాయింపు : మంత్రి జూపల్లి కృష్ణారావు
- నేడు మరోసారి భేటి



మహాత్మాగాంధీ కలలుగన్న గ్రామ స్వరాజ్యమే లక్ష్యంగా నూతన పంచాయతీరాజ్ చట్టాన్ని రూపొంది స్తున్నామని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి జూపల్లి కష్ణారావు తెలిపారు. నూతన పంచా యతి రాజ్ చట్టం రూపకల్పనపై ఏర్పాటు చేసిన మంత్రుల సబ్‌కమిటీ తొలి సమావేశం సోమవారం ఎంసీఆర్‌హెచ్‌ఆర్డీలో జరిగింది. జూపల్లి అధ్యక్షతన జరిగిన సబ్ కమిటీ సమావేశానికి మంత్రులు పోచా రం శ్రీనివాస్‌రెడ్డి, కేటీఆర్, తుమ్మల నాగేశ్వరరావు, ఈటెల రాజేందర్, హరీశ్‌రావు, ఇంద్రకరణ్‌రెడ్డి, అధికారులు నర్సింగరావు, వికాస్ రాజ్, స్మిత సభర్వాల్, నీతూ ప్రసాద్, రిటైర్డ్ ఐఏఎస్ చెల్లప్ప, న్యాయ శాఖ కార్యదర్శి నిరంజన్‌రావు తదితరులు హాజరయ్యారు. సమావేశం అనంతరం సబ్ కమిటీ చైర్మన్ జూపల్లి మీడియాతో మాట్లాడుతూ గ్రామాల రూపురేఖలు పూర్తిగా మార్చేలా, గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం సాకారం అయ్యేలా చట్టం రూపకల్పన జరుగుతున్నదన్నారు. పంచాయతీల బలోపేతమే లక్ష్యంగా చట్టం ఉండనుందని, సర్పంచ్ లకు మరిన్ని అధికారాలు, పెద్దఎత్తున నిధులు కేటాయించడం ద్వారా స్థానిక సంస్థలను మరింత పటిష్టం చేయాలన్నదే చట్టంలో ప్రధాన అంశంగా ఉండబోతున్నదని స్పష్టం చేశారు. ఎవరైనా ప్రజలకు సరైన సేవ చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే మాత్రం చర్యలు తప్పవన్నారు. ఎన్నికలకు ముందు కేసీఆర్ ఇచ్చిన హామీ మేరకు తండాలను పంచాయతీ లుగా మార్చడం, నూతన పంచాయతీలను ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. పారిశుధ్యం, మంచి నీటి సరఫరా, వీధి దీపాలు ఏర్పాటు లాంటి వాటికోసం ఎలాంటి నిధుల కొరత లేకుండా బడ్జెట్లోనే నిధులు కేటాయించే ఆలోచన చేస్తున్నామని, వీటిని పారదర్శకంగా పంచాయతీల అభివద్ధికి ఖర్చుచేయ డమే ప్రభుత్వ లక్ష్యంగా చట్టం రూపొందుతుందని చెప్పారు. వ్యయం తగ్గించేలా ఎన్నికల ప్రక్రియను త్వరగా పూర్తి చేసే అంశాన్ని పరిశీలించాలని అధికారులకు సబ్ కమిటీ సూచించింది. గ్రామసభ, పాలక వర్గ సమావేశం నిర్వహించే గడువును తగ్గించే అంశాన్ని చర్చించారు. మరిన్ని అంశాలపై చర్చించేందుకి మంగళవారం కూడా మరోసారి సబ్ కమిటీ జరగనుందని చైర్మన్ జూపల్లి క ష్ణారావు తెలిపారు.

మలేషియా ప్రధాని అభ్యర్థిగా మహతీర్ మహ్మద్



కౌలాలంపూర్ : ప్రధాని అభ్యర్థిగా మహతీర్ మహ్మద్ (92) పేరును ప్రతిపాదించినట్టు మలేషియా విపక్షాలు ప్రకటించాయి. ఈఏడాది ఆగస్టులో జరగనున్న ఎన్నికల్లో మాజీ ప్రధాని మహ్మద్ పోటీ చేస్తారని వెల్లడించాయి. మరోసారి దేశ ప్రధాని పగ్గాలు చేపట్టి దేశ సేవచేయాలని తానూ ఆకాంక్షిస్తున్నట్టు మహ్మద్ తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. కాగా, మహ్మద్ దాదాపు రెండు దశాబ్ధాలకు పైగా మలేషియా ప్రధానిగా పనిచేశారు. 2003 నుంచి రాజకీయాల నుంచి తప్పుకున్నారు. అనంతరం అధికార యూఎమ్ఎన్ఓ పార్టీ నుంచి తెగతెంపులు చేసుకొన్నారు. 2016లో బెర్సాతు పార్టీని స్థాపించారు. ఆయన స్థాపించిన పార్టీకి విపక్షాలు మద్దతు తెలిపాయి. మలేషియా అధ్యక్షుడు నజీబ్ రజాక్‌పై అవినీతి ఆరోపణలు రావడంతో ఇతర పార్టీలన్నీ మహ్మద్‌నే మరోసారి ప్రధానిగా ఎన్నుకోవాలని భావిస్తున్నాయి.

పాలస్తీనీయులపై ఇజ్రాయిల్ పోలీసుల దాష్టీకం



హక్కుల సంఘాల ఆందోళన

జెరూసలేమ్ : పాలస్తీనీయులపై ఇజ్రాయిల్ పోలీసులు జులుం ప్రదర్శిస్తున్నారు. పాలస్తీనీయుల నుంచి వచ్చే ఫిర్యాదులను స్వీకరించేందుకు నిరాకరిస్తున్నారు. పైగా, ఫిర్యాదుదారులపైనే తప్పుడు కేసులు బనాయించి ఇబ్బంది పెడుతున్నారు. ఇజ్రాయిల్ పోలీసుల తీరు పట్ల హక్కుల సంఘాలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఇజ్రాయిల్‌లోని దేష్ దిన్ హక్కుల పర్యవేక్షణ సంస్థ తెలిపిన వివరాల ప్రకారం...ఇజ్రాయిల్ పోలీసులు పాలస్తీనీయుల పట్ల వివక్ష కనబరుస్తున్నారు. ఇజ్రాయిల్ పౌరులు పాలస్తీనీయులపై దాడులకు పాల్పడుతున్నా ఎలాంటి చర్యలు చేపట్టడంలేదు. పైగా, ఫిర్యాదు ఇచ్చేందుకు వచ్చిన పాలస్తీనీయులనే చితకబాదు తున్నారు. 2014 నుంచి 2017 ఆగస్టు వరకు ఇజ్రాయిల్‌లోని పోలీస్ స్టేషన్‌లలో 225 కేసులు నమోదయ్యాయి. వాటిపై ఇజ్రాయిల్ పోలీసులు ఎలాంటి చర్యలు చేపట్టలేదు. కేసులు నమోదై ఎలాంటి పురోగతి చేపట్టని 119 కేసులకు సంబంధించిన సమాచారాన్ని సేకరించినట్టు దేష్ దిన్ సంస్థ తెలిపింది. వెస్ట్ బ్యాంక్‌లోని పాలస్తీనీయులపై ఇజ్రాయిల్ పౌరులు రాళ్లు రువ్వుతున్నప్పుడు పోలీసులు ప్రత్యక్ష పాత్ర పోషిస్తున్న వీడియోను ఆసంస్థ తాజాగా విడుదల చేసింది.

సిరియాలో కారు బాంబు పేలుడు

- 23 మంది మృతి



డమాస్కస్ : సిరియాలోని ఇద్లిబ్ నగరంలో కారు బాంబు పేలుడు సంభవించింది. ఈ ఘటనలో 23 మంది మృతి చెందారు. మరికొందరు గాయపడ్డారు. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించి వైద్యం అందిస్తున్నారు. ఈ ఘటనకు బాధ్యత వహిస్తున్నట్టు ఏ ఉగ్రసంస్థ కూడా ప్రకటించుకోలేదు. ఇద్లిబ్ నగరాన్ని పూర్తిగా ఆధీనంలోకి తెచ్చుకోవాలని సైనికాధికారులను సిరియా అధ్యక్షుడు అస్సద్ ఆదేశించారు. ఈనేపథ్యంలో ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్న ఉగ్రవాదులు పలు హింసాత్మక ఘటనలకు పాల్పడుతున్నారు. ప్రజలను భయభ్రాంతులకు గురిచేసేందుకు పేలుళ్లకు పాల్పడుతున్నారు. సిరియాలోని హక్కుల పర్యవేక్షణ సంస్థ తెలిపిన వివరాల ప్రకారం...ఇద్లిబ్ ప్రావిన్స్‌లోని 60 గ్రామాలను భద్రతా బలగాలు తిరిగి స్వాధీనం చేసుకున్నాయి.

నేడు కొరియా దేశాల మధ్య చర్చలు

సియోల్ : ఉత్తర, దక్షిణ కొరియా దేశాల మధ్య మంగళవారం ఉన్నతస్థాయి చర్చలు జరగనున్నాయి. పనుముంజాన్ ప్రాంతంలోని డీమిలిటరైజ్డ్ జోన్ చర్చలకు వేదిక కానుంది. ఉత్తర, దక్షిణ కొరియా దేశాల మధ్య కొన్నేండ్లుగా ఉద్రిక్త వాతా వరణం నెలకొన్న నేపథ్యంలో ఈ చర్చలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. వచ్చేనెలలో జరగనున్న వింటర్ ఒలింపిక్స్, పారాలింపిక్స్‌పై ఈ భేటీలో చర్చ జరిగే అవకాశముంది. అంతేగాకుండా, క్రీడాకారుల భద్రత, అథ్లెట్స్‌కు వసతి సౌకర్యాలు తదితర అంశాలపై అధికారులు చర్చించనున్నట్టు సమాచారం. కొరియా ద్వీపకల్పంలో దక్షిణకొరియా, జపాన్ దేశాలు అమెరికా బలగాలతో కలిసి ఉమ్మడి సైనిక విన్యాసాలు నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. దక్షిణ కొరియా చర్యలను ఉత్తరకొరియా అధ్యక్షుడు కిమ్ జోంగ్ ఉన్ వ్యతిరేకిస్తున్నారు. అయితే, తమ దేశ క్రీడాకారులను దక్షిణ కొరియాకు పంపడానికి తాను సిద్ధంగా ఉన్నానని నూతన సంవత్సర వేడుకల్లో ఆయన పేర్కొన్నారు. ఈనేపథ్యంలో ఇరుదేశాల మధ్య చర్చలు జరుగనున్నాయి. ఈ చర్చలు ఫలప్రదమైనట్టయితే ఇరుదేశాల మధ్య ఉద్రిక్తతలు తగ్గిపోయే అవకాశముందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

పారిస్ దాడుల మృతులకు నివాళి



పారిస్ : పారిస్ దాడుల మృతులకు ఫ్రాన్స్ అధ్యక్షుడు ఎమాన్యుయేల్ మ్యాక్రన్, మేయర్ అనీ హిదాల్గో నివాళి అర్పించారు. 2015, జనవరి7న చార్లీ హెబ్డో మ్యాగజైన్ కార్యాలయంలోకి చొరబడి అల్‌ఖైదా ఉగ్రవాదులు నరమేధం సృష్టించారు. ఈ దాడిలో 11మంది మ్యాగజైన్ సిబ్బంది, ఓ పోలీస్ అధికారి మృతి చెందారు. అనంతరం చార్లీ హెబ్డో కార్యాలయానికి సమీపంలో ఉన్న సూపర్‌మార్కెట్‌లోకి చొరబడి ఉగ్రవాదులు కాల్పులు జరిపారు. ఈ దాడిలో ఐదుగురు చనిపోయారు. మృతుల సంస్మరణార్థం ఫ్రాన్స్ ప్రభుత్వం ఓ స్థూపాన్ని నిర్మించింది. ఈ స్థూపం వద్దకు చేరుకున్న మ్యాక్రన్, హిదాల్గో పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళి అర్పించారు. ఉగ్రవాదంపై పోరుకు ఫ్రాన్స్ కట్టుబడి ఉందని పునరుద్ఘాటించారు. ఐఎస్ నిర్మూలనకు ఫ్రాన్స్ బలగాలు ప్రత్యేక ఆపరేషన్ నిర్వహిస్తున్నాయని అన్నారు. చార్లీ హెబ్డో మ్యాగజైన్‌పై జరిగిన ఉగ్రదాడి ప్రపంచ దేశాలను కలచివేసిందన్నారు.

మెక్సికోలో కాల్పుల కలకలం

- 11 మంది మృతి



వాషింగ్టన : మెక్సికోలో కాల్పులు కలకలం సృష్టించాయి. ఎకాపల్కో రిసార్ట్‌లైన్ వద్ద దుండగులు జరిపిన కాల్పుల్లో 11 మంది మృతిచెందారు. మృతుల్లో 8 మంది స్థానికులు, ముగ్గురు సీఆర్‌పీసీ గ్రూప్ మిలిటెంట్లు ఉన్నారు. ఈ ఘటనలో మరికొందరు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. అటార్నీ జనరల్ జేవియర్ ఓలియా పేలెజ్ తెలిపిన వివరాల ప్రకారం...మెక్సికోలోని ఎకాపల్కో రిసార్ట్ టౌన్‌కు సమీపంలో కాల్పులు కలకలం సృష్టించాయి. ఈ రిసార్టులోకి కొంతమంది దుండగులు ప్రవేశించి బీభత్సం సృష్టించారు. స్థానికులపై కాల్పులకు తెగబడ్డారు. ఈ కాల్పుల్లో 8 మంది కాలనీవాసులు చనిపోయారు. సమాచారం అందుకున్న సీఆర్‌పీసీ మిలిటెంట్లు ఘటనాస్థలికి చేరుకున్నారు. రిసార్ట్ టౌన్‌ను చుట్టుముట్టి దుండగులపై కాల్పులు జరిపారు. దుండగులు, మిలిటెంట్లకు మధ్య జరిగిన ఎదురుకాల్పుల్లో ముగ్గురు మిలిటెంట్లు మృతి చెందారు. సామాజిక మాధ్యమాల కాల్పుల ఉదంతం సమాచారం తెలుసుకున్న మెక్సికో ఆర్మీ, ఫెడరల్, స్టేట్ బలగాలు హుటాహుటిన ఘటనాస్థలికి చేరుకున్నాయి. రిసార్ట్‌లో తలదాచుకున్న దుండగులను, మిలిటెంట్లను అదుపులోకి తీసుకున్నాయి. ఘటనాస్థలంలో లభ్యమైన మారణాయుధాలు, తుపాకులు, బాంబులను స్వాధీనం చేసుకున్నాయి.

నైజీరియాలో రెండు వర్గాల మధ్య ఘర్షణ

- వారం రోజుల్లో 71కి చేరిన మృతుల సంఖ్య

అబూజ : నైజీరియాలో రెండు వర్గాల మధ్య చెలరేగిన అల్లర్లలో మృతి చెందిన వారి సంఖ్య సోమవారం నాటికి 71కి చేరుకుంది. ఈ అల్లర్లను అదుపులోకి తీసుకొచ్చేందుకు ప్రభుత్వ యంత్రాంగం శతవిధాలా ప్రయత్నిస్తోంది. నైజీరియా ఐజీ ఇబ్రహీమ్ ఇద్రీస్ తెలిపిన వివరాల ప్రకారం...బెన్యూ రాష్ట్రంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఈ ప్రాంతంలోని ముస్లిం గొర్రెల కాపరులకు, క్రైస్తవ మతానికి చెందిన రైతులకు మధ్య గతనెల31 నుంచి ఘర్షణలు జరుగుతున్నాయి. ఈ ఘర్షణలో 71 మంది చనిపోయారు.

క్రైస్తవులకు చెందిన పొలాల్లోకి గొర్రెల కాపరులు అక్రమంగా ప్రవేశించడంతో ఘర్షణ ప్రారంభమైనట్టు ప్రాథమిక విచారణలో తెలిసిందన్నారు. కాగా, ఈ అల్లర్లను అదుపులోకి తీసుకొచ్చేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్టు అధ్యక్షుడు ముహమ్మద్ బుహారీ తెలిపారు. నైజీరియాలో స్థిరత్వం, శాంతిభద్రతల పరిరక్షణ కోసం రాజీలేని పోరాటం చేసేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.

ట్రంప్ టవర్‌లో అగ్ని ప్రమాదం

- ఇద్దరికి గాయాలు

వాషింగ్టన్ : మన్‌హట్టన్‌లోని ట్రంప్ టవర్‌లో సోమవారం అగ్ని ప్రమాదం సంభవించింది. ఈ ఘటనలో ఇద్దరు గాయపడ్డారు. న్యూయార్క్ అగ్నిమాపక శాఖ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం...ట్రంప్ టవర్‌లో అగ్ని ప్రమాదం సంభవించింది. ప్రమాదం జరిగినప్పుడు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఈ భవనంలోనే ఉన్నారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలికి చేరుకుని మంటను ఆర్పివేశారు. ప్రమాదానికి గల కారణాలు తెలియరాలేదు. అయితే, ట్రంప్ టవర్‌లో షార్టుసర్క్యూట్ కారణంగానే మంటలు చెలరేగినట్టు ట్రంప్ కుమారుడు ఎరిక్ ట్రంప్ తాజాగా ట్విట్టర్‌లో ట్వీట్ చేశారు. ఈ ఘటనపై విచారణ చేపట్టనున్నట్టు వైట్‌హౌస్ ప్రకటించింది.

ఉత్తర ఐర్లాండ్ విదేశాంగ మంత్రి రాజీనామా


జేమ్స్ బ్రోకెన్‌షైర్

బెల్‌ఫాస్ట్ : ఉత్తర ఐర్లాండ్ విదేశాంగ మంత్రి జేమ్స్ బ్రోకెన్‌షైర్ తన పదవికి రాజీనామా చేసినట్టు ప్రకటించారు. అనారోగ్య కారణాల వల్లే తాను రాజీనామా చేశానని, తన రాజీనామా వెనుక ఎవరి ఒత్తిడి లేదని స్పష్టం చేశారు. ఊపిరితిత్తుల వ్యాధితో బాధపడుతున్న బ్రోకెన్‌షైర్ త్వరగా కోలుకోవాలని ప్రధాని థెరిసా మే ట్వీట్ చేశారు. బ్రోకెన్‌షైర్ 2011 నుంచి 2015 వరకు బ్రిటన్ రక్షణమంత్రిగా పనిచేశారు. 2016, జులై నుంచి విదేశాంగ మంత్రిగా పనిచేస్తున్నారు.

పోర్న్ వెబ్‌సైట్స్ కావాలని 24,473 అభ్యర్థనలు!

- బ్రిటన్ పార్లమెంట్ నుంచి

లండన్ : సాధారణంగా పార్లమెంటు అంటే ప్రజల జీవితాల కోసం మార్గదర్శకాలను రూపొందించే గొప్ప వేదిక. మొత్తం దేశం నడవడిక ఇక్కడ నుంచే రూపొందించబడుతుంది. అయితే, బ్రిటన్ పార్లమెంటు (హౌజ్ ఆఫ్ పార్లమెంట్)కు సంబంధించి కొన్ని ఆసక్తికర విషయాలు తాజాగా వెలుగులోకి వచ్చాయి. ఆ పార్లమెంటులో ఉన్న కంప్యూటర్ల నుంచి తమకు అశ్లీల వెబ్‌సైట్‌లు యాక్సెస్ ఇవ్వాలని దాదాపు 24,473 విన్నపాలు వచ్చినట్టు బ్రిటన్ ప్రెస్ అసోసియేషన్ వెల్లడించింది. ఫ్రీడమ్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ (ఎఫ్ఓఐ) పేరిట బ్రిటన్ ప్రెస్ అసోసియేషన్ ఈ సమాచారం సేకరించింది. గత ఏడాది (2017) జూన్ నుంచి డిసెంబర్ వరకు అశ్లీల వెబ్‌సైట్‌లు యాక్సెస్ ఇవ్వాలని రోజుకు 160 రిక్వెస్ట్‌లు వచ్చినట్టు తెలిపింది. వెస్ట్‌మినిస్టర్‌లో ఇప్పటికే పలువురిపై లైంగిక వేధింపుల ఆరోపణలు వచ్చిన విషయం తెలిసిందే. ఈ విషయాలపై ప్రధాని థెరిసా మే తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వారిపై చర్యలు తీసుకున్నారు. ఈ కారణంతోనే ఆమె స్నేహితుడినైనా క్షమించకుండా మంత్రి డామియన్ గ్రీన్‌ను గత ఏడాది తొలగించారు. ఆయన కంప్యూటర్లలో అశ్లీల వీడియోలు లభించినప్పటికీ పోలీసులను తప్పుదారి పట్టించారని ఆరోపణలు రావడంతో ఆయన్ను తొలగించారు. అయితే, తాజాగా వెల్లడైన సమాచారం ప్రకారం చాలామంది ప్రభుత్వ పెద్దలు తమ కంప్యూటర్ల నుంచి అశ్లీల వీడియోల కోసం రిక్వెస్ట్‌లు పంపిస్తున్నట్టు తెలిసింది. ఎఫ్ఓఐ తెలిపిన వివరాల ప్రకారం...బ్లాక్ చేసిన పోర్న్ సైట్‌ల కోసం గతేడాది జనవరి నుంచి అక్టోబర్ వరకు 2,751,755 సార్లు బ్రిటన్ పార్లమెంట్ కార్యాలయం నుంచి ప్రయత్నాలు జరిగాయి.

2020 నాటికి జైళ్ల శాఖ ఆదాయాన్ని రూ.100 కోట్లకు చేరుస్తాం

- జైళ్ల శాఖ డీజీ వీకే సింగ్

నవతెలంగాణ, ప్రత్యేక ప్రతినిధి

దేశంలోనే అత్యుత్తమంగా రాష్ట్ర జైళ్ల ను తీర్చి దిద్దుతాం,2020 నాటికి జైళ్ల శాఖ ఆదాయాన్నిరూ.100 కోట్లకు చేరుస్తామని ఆ శాఖ డైరెక్టర్ జనరల్ వినయ్‌కుమార్‌సింగ్ ప్రకటించారు. సోమవారం తమ కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో 2017లో జైళ్ల శాఖ సాధించిన విజయాలు, ఈ ఏడాది చేరుకోవాలనుకున్న లక్ష్యాలను ఆయన వివరించారు. గతేడాది మొత్తంగా తాము చేపట్టిన వివిధ పథకాలను అమలు చేయడంలో దాదాపుగా విజయవంతం అయ్యామని సింగ్ తెలిపారు. ప్రధానంగా రాష్ట్ర ప్రభుత్వంపై ఆర్థికంగా ఎలాంటి భారం వేయకుండా జైళ్ల శాఖను స్వయంసమృద్ధి దిశగా నడిపిస్తున్నామని అన్నారు. జైల్ల శాఖ నిర్వహిస్తున్న 13 పెట్రోల్ పంపులు, సబ్బులు, టవల్స్ , ఫర్నీచర్ మొదలైన జైళ్ల పరిశ్రమలు కలుపుకుని రూ.15 కోట్ల రూపాయల టర్నోవర్‌కు చేరుకున్నామని తెలిపారు.

నేతి విద్యాసాగర్‌కి మాతృవియోగం

- సంతాపం ప్రకటించిన పలువురు ప్రముఖులు



నవతెలంగాణ- కేతెపల్లి

శాసనమండలి డిప్యూటీ చైర్మెన్ నేతి విద్యాసాగర్‌తల్లి నేతి రాధమ్మ(94) అనారోగ్యంతో సోమవారం హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో మృతిచెందింది. ఆమె అంత్యక్రియలు నేతి సొంత గ్రామమైన నల్లగొండ జిల్లా కేతెపల్లి మండలం చెరుకుపల్లిలో నిర్వహించారు. ఆమె మృతదేహాన్ని శాసనమండలి చైర్మెన్ వంగాల స్వామిగౌడ్, విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి, రాజ్యసభ సభ్యులు కె.కేశవరావు, ఎంపీ గుత్తా సుఖేందర్‌రెడ్డి, నల్లగొండ, సూర్యాపేట జిల్లాల కలెక్టర్‌లు గౌరవ ఉప్పల్, సురేందర్ మోహన్ సందర్శించి నివాళులర్పించారు. వీరితోపాటు ఎమ్మెల్యేలు వేముల వీరేశం, నల్లబోతు భాస్కర్‌రావు, ఎమ్మెల్సీలు పూల రవీందర్, కర్నె ప్రభాకర్, ఆకుల లలిత, ఎస్పీ శ్రీనివాసరావు, ఆర్డీవో వెంకటాచారి సందర్శించి పూలమాలలేసి నివాళి అర్పించారు. ఆమె మృతి పట్ల ప్రగాఢసానుభూతి తెలిపారు.

పరిశోధనలకు నిధుల్లేకుండా దేశాభివృద్ధి ఎలా సాధ్యం

- కేంద్రాన్ని ప్రశ్నించిన ఉప ముఖ్యమంత్రి కడియం
- మానవాళి అభివృద్ధికి దోహదపడేలా శాస్త్ర విజ్ఞానం
- ఘనంగా సౌత్ ఇండియా సైన్స్ ఫెయిర్ ప్రారంభం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

పరిశోధనలకు నిధులు కేటాయించకుండా దేశాభివృద్ధి ఎలా సాధ్యమవుతుందని కేంద్ర ప్రభుత్వాన్ని ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి ప్రశ్నించారు. విద్య, పరిశోధనలు, సైన్స్ ఫెయిర్ల నిర్వహణ కోసం అధిక నిధులు కేటాయించాలని కోరారు. సోమవారం నుంచి శుక్రవారం వరకు ఐదురోజులపాటు హైదరాబాద్‌లోని సెయింట్ పాట్రిక్స్ హైస్కూల్‌లో జరగనున్న సౌత్ ఇండియా సైన్స్ ఫెయిర్ ఘనంగా ప్రారంభమైంది. ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి ఈ సైన్స్ ఫెయిర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైన్స్ ఫెయిర్లు నిర్వహించడం వల్ల విద్యార్థులకు శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానం, పరిశోధనల పట్ల ఆసక్తి పెరుగుతుందని చెప్పారు. శాస్త్ర విజ్ఞానం పెంపొందించకుండా దేశం ఎలా ముందడుగు వేస్తుందని అన్నారు. రాష్ట్రంలో పరిశోధనలను ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. తెలంగాణ రాకముందు రాష్ట్రంలో 296 గురుకులాలుంటే, తెలంగాణ ప్రభుత్వం కొత్తగా 544 గురుకులాలు ప్రారంభించిందని అన్నారు. వీటితోపాటు 475 కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాలు (కేజీబీవీ), 194 ఆదర్శ పాఠశాలలు ఉన్నాయని వివరించారు. వీటిలో ఎనిమిది లక్షల మంది విద్యార్థులు చదువుతున్నారని చెప్పారు. తెలంగాణలో లక్ష మందికి 59 విద్యాలయాలుంటే, జాతీయ సగటు లక్ష మందికి 29 విద్యాలయాలున్నాయని అన్నారు. పరిశోధనల ద్వారా మానవాళి అభివృద్ధి జరగాలని ఆకాంక్షించారు. అత్యంత పేద కుటుంబంలో పుట్టి కష్టపడి చదివి మిస్సైల్‌మ్యాన్‌గా, రాష్ట్రపతిగా ఎదిగిన ఏపీజే అబ్దుల్‌కలాం జీవితం అందరికీ ఆదర్శనమని అన్నారు. ఈనెల 10 లేదా 11న హైదరాబాద్ చారిత్రక నగరాన్ని పర్యటించడానికి ఏర్పాట్లు చేయాలని విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. హైదరాబాద్‌లో చార్మినార్, గోల్కొండ కోట, సాలార్‌జంగ్ మ్యూజియంతో పాటు చారిత్రక కట్టడాలు, పరిశోధనా కేంద్రాలు, విద్యాలయాలున్నాయని చెప్పారు. జీడీపీలో, ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్, ఐటీ ఎగుమతులు, సంక్షేమ పథకాల అమల్లో తెలంగాణ ప్రథమ స్థానంలో ఉందన్నారు. ఈ సైన్స్ ఫెయిర్‌లో విద్యార్థులు వారి ప్రతిభను వెలికితీయాలని కోరారు. ఈనాటి సైన్స్ రేపటికి టెక్నాలజీగా మారుతుందని, ఈ దిశగా ఆలోచించి ఆదర్శంగా నిలవాలని సూచించారు. విద్యార్థులు తయారు చేసిన ప్రయోగాలను ఆయన పరిశీలించారు. ఉప ముఖ్యమంత్రి మహమూద్‌అలీ మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చాక 1950లో తిండిలేని పరిస్థితిలో ఉన్నామని, శాస్త్రవేత్తల పరిశోధనల వల్ల నేడు విదేశాలకు బియ్యం ఎగుమతి చేసే స్థాయికి ఎదిగామని చెప్పారు. పరిశోధన లేకపోతే అభివృద్ధి ఉండబోదని అన్నారు. విద్యార్థులు పరిశోధనలపై దృష్టి సారించాలని, శాస్త్రీయంగా


ఆసక్తిగా అడిగి తెలుసుకుంటున్న మంత్రి కడియం

ఆలోచించాలని కోరారు. హోంమంత్రి నాయిని నర్సింహ్మారెడ్డి మాట్లాడుతూ విద్య లేకుండా మనిషి అభివృద్ధి చెందలేడని అన్నారు. తల్లిదండ్రులు తిండి తిన్నా, తినకపోయినా పిల్లలు బాగా చదివించాలని సూచించారు. కేంద్ర మాజీ మంత్రి, ఎంపీ బండారు దత్తాత్రేయ మాట్లాడుతూ శాస్త్ర సాంకేతిక ప్రాంతీయ కేంద్రం వరంగల్‌లో ఉందని, హైదరాబాద్‌లోనూ 15-20 ఎకరాల భూమి రాష్ట్ర ప్రభుత్వం కేటాయిస్తే కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి ప్రాంతీయ కేంద్రం ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తానని అన్నారు. కంటోన్మెంట్ ఎమ్మెల్యే జి సాయన్న అధ్యక్షతన జరిగిన ఈకార్యక్రమంలో విద్యాశాఖ ప్రత్యేక ముఖ్యకార్యదర్శి రంజీవ్ ఆర్ ఆచార్య, పాఠశాల విద్యాశాఖ కమిషనర్ జి కిషన్, విశ్వేశ్వరయ్య ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్ (బెంగుళూరు) సంచాలకులు మదన్‌గోపాల్, ఎస్‌సీఈఆర్‌టీ (టీఎస్) సంచాలకులు బి.శేషుకుమారి, హైదరాబాద్ జాయింట్ కలెక్టర్ నిఖిల, స్థానిక కార్పొరేటర్ ఆకుల రూప,డీఈవో సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సైన్స్‌ఫెయిర్

సోమవారం హైదరాబాద్‌లోని సెయింట్ పాట్రిక్స్ ఉన్నత పాఠశాలల్లో ప్రారంభమైన సౌత్ ఇండియా సైన్స్ ఫెయిర్ అందరినీ ఆకట్టుకుంది. ఈ సైన్స్ ఫెయిర్‌కు తెలం గాణతోపాటు ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, కేరళ, తమిళనాడు, పుదుచ్చేరి రాష్ట్రాల నుంచి విద్యార్థులు, ఉపాధ్యాయులు, కొందరు తల్లిదండ్రులు హాజరయ్యారు. ఈ సైన్స్ ఫెయిర్‌లో 90 విద్యార్థుల వ్యక్తిగత ఎగ్జిబిట్లు, 66 ఉపాధ్యాయుల ఎగ్జి బిట్లు, 73 గ్రూప్ ఎగ్జిబిట్లు ప్రదర్శించబడ్డాయి. మొత్తం ఎగ్జి బిట్ల నిర్వహణకు 455 మంది విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. తొలిరోజు పరిశీలనకు వివిధ పాఠశాలల నుంచి 2,675 మంది విద్యార్థులు సైన్స్ ఫెయిర్‌కు వచ్చారు. సెయింట్ పాట్రిక్స్ ఉన్నత పాఠశాలలో ఎటు చూసిన శాస్త్రీయ విజ్ఞానం పెంపొందేలా ఎగ్జిబిట్లతోపాటు శాస్త్రవేత్తల జీవిత చరిత్రలతో కూడిన ఫొటోల ప్రదర్శన అందరినీ ఆకర్షించింది.

బ్రాహ్మణీయ హిందూ ఫాసిజాన్ని ఓడిద్దాం

- ఆదివాసీలపై పెరుగుతున్న దాడులు ఆందోళనకరం : విరసం నేత వరవరరావు



నవతెలంగాణ - రాంనగర్

బ్రాహ్మణీయ హిందూ ఫాసిజాన్ని ఓడిద్దామని విరసం నేత వరవరరావు, కాశీం అన్నారు. సోమవారం హైదరాబాద్‌లోని సుందరయ్యవిజ్ఞాన కేంద్రంలో విప్లవ రచయితల సంఘం ఆధ్వర్యంలో 26వ మహాసభల పోస్టర్ ఆవిష్కరణ జరిగింది. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. దేశంలో బ్రాహ్మణీయ హిందూ ఫాసిజం వేగంగా విస్తరిస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. నాలుగు గోడల మధ్య ప్రజల వ్యక్తిగతానికి పరిమితం కావాల్సిన మతం పాలకవర్గ రాజకీయ ఆర్థిక పునాది మీద ఫాసిజంగా మారుతుందన్నారు. తెలంగాణలో ఆదివాసీలపై దాడులు పెరిగాయని, బ్రిటీష్ పాలనలో కూడా ఇలాంటి దుర్మార్గమైన దాడులు లేవని అన్నారు. దేశంలో బీజేపీ పాలనలో హిందూ రాజ్యం కోసం ఆరాటపడుతున్నారని, ఇందుకు ఉదాహరణ ఉత్తరప్రదేశ్‌లోని ప్రభుత్వ కార్యాలయాలకు కాషాయపు రంగులు వేయడమేనని అన్నారు. ఈ క్రమంలో విప్లవ రచయితల సంఘం 26వ మహాసభలను 13, 14 తేదీల్లో మహబూబ్‌నగర్‌లో నిర్వహిస్తున్నామని, ఈ మహాసభల్లో బ్రాహ్మణీయ హిందూ ఫాసిజాన్ని ఓడించడమే లక్ష్యంగా విధానాలు రూపొందిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో విరసం నేతలు గీతాంజలి, అరవింద్ పాల్గొన్నారు.

డిగ్రీ కాలేజీల మూతకు రంగంసిద్ధం!

- 300 నుంచి 400 వరకు వేటుపడే అవకాశం
- 2 లక్షల సీట్ల సీట్లు తగ్గించేందుకు కసరత్తు
- క్వాలిటీ కాదు... కనీస విద్య అందడం లేదు
- ఉన్నత విద్యలో నాణ్యత పెంపునకు 'కిప్' : ఉన్నత విద్యామండలి చైర్మెన్ తుమ్మల పాపిరెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ప్రయివేటు డిగ్రీ కాలేజీలపై వేటుకు రంగంసిద్ధమైంది. 300 నుంచి 400 ప్రయివేటు డిగ్రీ కాలేజీల మూసివేత దిశగా రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు చేస్తున్నది. సంక్రాంతి పండుగ తర్వాత డిగ్రీ కాలేజీ యాజమాన్యాలతో సంప్రదింపులు చేయాలని తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి (టీఎస్‌సీహెచ్‌ఈ) నిర్ణయించింది. సోమవారం హైదరాబాద్‌లో టీఎస్‌సీహెచ్‌ఈ పాలకమండలి సమావేశం జరిగింది. అనంతరం మీడియాతో టీఎస్‌సీహెచ్‌ఈ చైర్మెన్ తుమ్మల పాపిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో కొత్త డిగ్రీ కాలేజీలకు, కొత్త కోర్సులకు, సీట్ల పెంపునకు అనుమతి ఇచ్చేది లేదని స్పష్టం చేశారు. రాష్ట్రంలో ఇప్పటికే సీట్లు, కాలేజీలు ఎక్కువగా ఉన్నాయని వివరించారు. రాష్ట్రంలో 1,159 డిగ్రీ కాలేజీల్లో 4.32 లక్షల సీట్లున్నాయని చెప్పారు. వాటిలో ఈ విద్యాసంవత్సరంలో 2.28 లక్షల మంది విద్యార్థులు చేరారని, ఇంకా 2.04 లక్షల సీట్లు మిగిలాయని అన్నారు. అందుకే 2 లక్షల సీట్లు తగ్గించాలని భావిస్తున్నామని చెప్పారు. 25 శాతం కంటే తక్కువ విద్యార్థులుండే కాలేజీలను మూసివేస్తామన్నారు. అవసరమైతే అంతకంటే ఎక్కువ శాతం ఉన్నా ప్రమాణాలు పాటించని కాలేజీలపై చర్యలు తీసుకుంటామని చెప్పారు. డిగ్రీ కాలేజీల హేతుబద్ధీకరణ ప్రక్రియ చేపడతామన్నారు. ప్రయివేటు కాలేజీ యాజమాన్యాలు అనైతిక పద్ధతులకు పాల్పడుతున్నాయని అన్నారు. నిబంధనలు ఉల్లంఘించడం, తరగతులు సరిగ్గా నిర్వహించకపోవడం, పిల్లలు రాకపోయినా చూసీచూడనట్టు వదిలేయడం, ప్రాక్టికల్స్ మార్కులు వేస్తామని, హాజరు వేస్తామని ప్రోత్సహించడం, సెల్ఫ్ సెంటర్లు ఇప్పిస్తామని విద్యార్థులకు చెప్తున్నాయని చెప్పారు. దీంతో మంచిగా నడిచే కాలేజీలు ఇబ్బందులకు గురవుతున్నాయని అన్నారు. ప్రయివేటు డిగ్రీ కాలేజీల్లో క్వాలిటీ విద్య కాదుకదా కనీస విద్య అందడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. అందుకే పరిపాలనా పరమైన అంశాలతోపాటు అకడమిక్ అంశాలపైనా దృష్టి సారిస్తామని


సమావేశంలో మాట్లాడుతున్న పాపిరెడ్డి

చెప్పారు. మెరుగైన విద్య అందించేందుకు డిగ్రీలో సంస్కరణలు చేపడతామని వివరించారు. విద్యార్థులు తరగతులకు రాకుండా విజ్ఞానం ఎలా వస్తుందన్నారు. టీచర్లు తరగతులకు రావాలని, పాఠాలు బోధించాలని కోరారు. టీచర్లు బోధించడం, విద్యార్థులు తరగతులకు రావడం వల్లే విద్యాప్రమాణాలు పెరుగుతాయని చెప్పారు. తక్కువ మంది విద్యార్థులతో కాలేజీ నడపడం యాజమాన్యాలకు వ్యయం అవుతుందని అన్నారు. ఇంటర్‌లో గణనీయమైన మార్పులొచ్చేది లేదని, విద్యార్థుల సంఖ్య పెరిగే అవకాశం లేదన్నారు. ఇక డిగ్రీ కాలేజీల్లోనూ విద్యార్థులు పెరిగే పరిస్థితి లేదని చెప్పారు. మండలానికి ఓ డిగ్రీ కాలేజీ ఉంటే సరిపోతుందని అన్నారు. గోదావరిఖనిలో ఐదు ప్రయివేటు డిగ్రీ కాలేజీలుంటే, వాటిలో మూడు కాలేజీలు విలీనం చేయడానికి అంగీకరించాయని చెప్పారు.

నాణ్యమైన విద్యపై ప్రత్యేక శ్రద్ధ

ఉన్నత విద్యను అభ్యసించే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు ప్రత్యేక శ్రద్ధ వహిస్తామని పాపిరెడ్డి అన్నారు. తెలంగాణ హయ్యర్ ఎడ్యుకేషన్ (టీహెచ్‌ఈ) క్వాలిటీ ఇంప్రూవ్‌మెంట్ ప్రోగ్రామ్ (క్యూఐపీ)ని ప్రారంబి.స్తామని చెప్పారు. ఓయూ, కేయూ, జేఎన్టీయూహెచ్, జేఎన్ ఏఎఫ్ఏయూ, ఆర్‌జీయూకేటీల్లో ప్రారంభించే ఇంక్యుబేటర్ల లో ఒక్కో దానికి ఐటీ శాఖ రూ.2 కోట్లు ఇస్తుందన్నారు. ఇంక్యుబేటర్ల పర్యవేక్షణకు ఇంచార్జిలను విశ్వవిద్యాలయాలు నియమించాయని, ఆ వివరాలను ఐటీశాఖకు నివేదించామని అన్నారు. అధ్యాపకుల బోధన పద్ధతుల్లో నాణ్యతా ప్రమాణాలు పెంచేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. వివిధ సబ్జెక్టుల్లో ఉత్తమ అధ్యాపకులను ఎంపిక చేసి అవార్డులు అందజేస్తామని అన్నారు. విశ్వవిద్యాలయాల్లో ఖాళీగా ఉన్న 1,061 అధ్యాపక పోస్టుల భర్తీకి త్వరలోనే నోటిఫికేషన్లు విడుదలవుతాయని చెప్పారు. విశ్వవిద్యాల యాలు ఈదిశగా కసరత్తు చేస్తున్నాయని అన్నారు. ఈకార్యక్రమంలో ఉన్నత విద్యామండలి వైస్ చైర్మెన్లు ఆర్.లింబాద్రి, వి.వెంకటరమణ, కార్యదర్శి ఎన్ శ్రీనివాసరావు, సభ్యులు ఓనర్సింహ్మారెడ్డి, ఎస్ రామచంద్రం(ఓయూ), సీతారామారావు (బీఆర్ఏఓయూ) తదితరులు పాల్గొన్నారు.

ఢిల్లీలో గవర్నర్ నరసింహన్

నవతెలంగాణ-న్యూఢిల్లీబ్యూరో

తెలుగు రాష్ట్రాల ఉమ్మడి గవర్నర్ నరసింహన్ సోమవారం ఢిల్లీ చేరుకున్నారు. రెండు రోజుల పర్యటన నిమిత్తం ఢిల్లీకి వచ్చిన ఆయన... మంగళవారం రాష్ట్రపతి రామ్‌నాథ్‌కోవింద్, ప్రధానమంత్రి నరేంద్రమోడీ, హోంమంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌ను కలవనున్నారు. విశిష్ట భారత్ మిషన్-2022లో భాగంగా తెలుగు రాష్ట్రాల గవర్నర్ నరసింహన్‌తో పాటు తమిళనాడు గవర్నర్ బన్వర్‌లాల్ పురోహిత్, త్రిపుర గవర్నర్ తథాగత్‌రాయ్ తదితరులతో కేంద్ర ప్రభుత్వం ఓ సబ్‌కమిటీని నియమించింది. ఈ కమిటీ పలుమార్లు భేటీ అయ్యింది. ఈ కమిటీ రూపొందించిన నివేదికను రాష్ట్రపతితో పాటు ప్రధానికి అందజేయనున్నారని తెలిసింది. అలాగే రెండు రాష్ట్రాల్లోని తాజా పరిస్థితులను గవర్నర్ నరసింహన్ కేంద్ర పెద్దలకు నివేదించనున్నారు.

నవచిత్రం

లెక్కలు తేలాలి.. ఒక్కడినీ వదలను


అనుష్క

'ఎవ్వడు పడితే వాడు రావడానికి, ఎప్పుడు పడితే అప్పుడు పోవడానికి ఇదేమన్నా పశువుల దొడ్డా.. భాగమతి అడ్డా.. లెక్కలు తేలాలి, ఒక్కడిని పోనివ్వను' అంటూ వార్నింగ్ ఇస్తోంది అనుష్క. 'అరుంధతి' తరహాలో మరోసారి ఆమె భయపెట్టబోతున్న చిత్రం 'భాగమతి'. అశోక్ దర్శకత్వంలో యువి క్రియేషన్స్ పతాకంపై వంశీ, ప్రమోద్‌లు సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఈ చిత్ర ట్రైలర్ సోమవారం విడుదలైంది. ఈ సందర్భంగా నిర్మాతలు మాట్లాడుతూ, 'గతంలో 'అరుంధతి', 'రుద్రమదేవి', 'బాహుబలి' చిత్రాల్లో తనదైన నటనతో అబ్బుర పరచిన అనుష్క తాజాగా 'భాగమతి'తో అలరించబోతుంది. 'భాగమతి'గా ఆమె తన నటవిశ్వరూపంతో ఆడియెన్స్‌ను మెస్మరైజ్ చేయడం ఖాయమని ట్రైలర్ చూస్తే అర్థమవుతుంది. విడుదలైన ట్రైలర్ కొద్ది గంటల్లోనే సోషల్‌మీడియాలో హల్‌చల్ అవుతోంది. అద్భుతమైన స్పందనతోపాటు సినిమాపై అంచనాలనూ పెంచుతోంది. కథ అద్భుతంగా కుదిరింది. దర్శకుడు అశోక్ సినిమాను అద్భుతంగా తీర్చిదిద్దుతున్నారు. అత్యాధునిక సాంకేతిక వర్గంతో రాజీ పడకుండా భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నాం. అనుష్క నటన, దర్శకుడు అశోక్ టేకింగ్, మధి కెమెరాపనితనం, రవీందర్ ఆర్ట్ వర్క్, నిర్మాణ విలువలు సినిమాకు హైలైట్ కానున్నాయి. సంగీత దర్శకుడు థమన్ అందించిన పాటలు, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ ప్రతీ సన్నివేశాన్ని హైలైట్ చేసేదిగా ఉంటుంది. ఈ చిత్ర కథ, కథనం ప్రేక్షకులకు కావాల్సిన వినోదాన్ని పంచుతుంది. గణతంత్ర దినోత్సవ కానుకగా ఈ నెల 26న సినిమాను అత్యధిక థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల చేయనున్నాం' అని అన్నారు. ఉన్ని ముకుందన్ ప్రధాన పాత్రధారిగా, జయరాం, ఆశాశరత్, మురళీ శర్మ, ధన్‌రాజ్, ప్రభాస్ శ్రీను, విద్యుల్లేఖ రామన్, దేవ దర్శిని, తలైవాసన్ విజయ్, అజయ్ ఘోష్, మధునందన్ ఇతర పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి ఎడిటర్: కోటగిరి వెంకటేశ్వరరావు.

నిరుద్యోగుల కష్టాలకు వెండితెర రూపం


సూర్య

'భాషలన్నింటిలో తెలుగు చాలా మధురమైన భాష అని చిన్నప్పుడు చదువుకున్నాను. 'గ్యాంగ్' చిత్రానికి డబ్బింగ్ చెబుతున్నప్పుడు ఆ విషయం అర్థమైంది' అని అంటున్నారు హీరో సూర్య. 'సింగం' సీక్వెల్స్, '24' వంటి చిత్రాలతో తెలుగు ప్రేక్షకులకు సూర్య బాగా దగ్గరయ్యారు. తాజాగా విఘ్నేష్ శివన్ దర్శకత్వంలో తమిళంలో ఆయన నటించిన 'థానా సెంద్ర కూట్టమ్' చిత్రం తెలుగులో 'గ్యాంగ్' పేరుతో రాబోతోంది. సంక్రాంతి కానుకగా ఈ నెల 12న ఈ సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా మీడియాతో సూర్య ముచ్చటించారు. ఆ విశేషాలు ఆయన మాటల్లోనే..

చాలా మార్పులు చేశాం..

బాలీవుడ్‌లో విడుదలైన 'స్పెషల్ 26' చిత్రానికి ఇది రీమేక్. అలాగని యధాతథంగా కాకుండా మాతృకను మాత్రమే తీసుకుని పూర్తిగా మార్పులు చేసి తెరకెక్కించిన చిత్రమిది. విఘ్నేష్ శివన్ తనదైన శైలిలో కథను చెప్పడానికి ప్రయత్నించాడు. 1987లో మన దేశంలో జరిగిన ఓ యదార్థ సంఘటన ఆధారంగా రూపొందించాం. గ్రేట్ ఇండియన్ రాబరీగా పేరొందిన ఒపేరా హౌస్ దోపిడీ కేసు నేపథ్యంలో కథ సాగుతుంది. ఓ యువకుడు తన గ్యాంగ్‌తో కలిసి ఆ కేసును ఎలా ఛేదించాడన్నదే ఈ చిత్ర ఇతివృత్తం. 1980లో కమల్ హాసన్ చేసిన 'సత్య', బాలచందర్ రూపొందించిన 'వరుమయిన్ నిరమ్‌శవప్పు' వంటి చిత్రాలు నిరుద్యోగ సమస్యను, ఉద్యోగాలు దొరక్క యువతరం పడే సంఘర్షణను కళ్లకు కట్టినట్టుగా చూపించారు. అలా నిరుద్యోగుల కష్టాలను యదార్థ కోణంలో ఆవిష్కరించిన చిత్రమిది.

ఆ రోజులు గుర్తొచ్చాయి..

'శివపుత్రుడు', 'వీడొక్కడే' అనంతరం చాలా రోజుల తర్వాత వినోద ప్రధానంగా సాగే పాత్రలో నేను కనిపిస్తాను. వినోదం, కమర్షియల్ ఎలిమెంట్స్ మేళవింపుగా సినిమా, నా పాత్ర ఉంటుంది. ఈ సినిమా చేస్తున్నప్పుడు నా కెరీర్ తొలినాళ్ళ రోజులు గుర్తొచ్చాయి. స్టడీ పూర్తవగానే ఏ వృత్తిని ఎంచుకోవాలనే సందిగ్ధంలో పడ్డాను. ఓ ఎక్స్‌పోర్ట్ సంస్థలో ఏడువందల ఇరవై ఆరు రూపాయలకు పనిచేశాను. ఆఫీస్‌లో ప్యాకింగ్ నుంచి క్లీనింగ్ వరకు అన్ని పనులు నేనే చేసేవాడిని. బస్సుల్లోనే కాలేజ్‌కు వెళ్ళాను. సాధారణ జీవితాన్నే గడిపా. ఈ పాత్ర చేస్తున్నప్పుడు 20ఏండ్లు వెనక్కి వెళ్ళిన అనుభూతి కలిగింది. నన్ను నేను తెరపై చూసుకున్న ఫీలింగ్ కలిగింది. అప్పట్లో ఎలా ఉండేవాడినో సినిమాలోనూ అలాగే కనిపిస్తా. నేను ఎంత ఎదిగినా నా మూలాలు మాత్రం మరచిపోను.

సొంతంగా డబ్బింగ్..

ఇది పేరుకు రీమేక్ అయినా చాలా కొత్తగా ఉంటుంది. దర్శకుడు విఘ్నేష్ శివన్ తెరకెక్కించిన విధానం, నటీనటుల అభినయం వైవిధ్యంగా ఉంటుంది. విఘ్నేష్ శివన్ దర్శకుడే కాదు, మంచి డ్రమ్మర్, గీత రచయిత కూడా. ఈ సినిమాను అత్యంత సహజంగా తీర్చిదిద్దారు. సంభాషణలు, సన్నివేశాలు రియలిస్టిక్‌గా ఉంటాయి. అన్ని వర్గాలకు బాగా కనెక్ట్ అవుతాయి. అంతేకాదు ఈ చిత్రానికి తెలుగు డబ్బింగ్ కూడా నేనే చెప్పా. చిన్నప్పుడు ప్రపంచంలోనే అతి సుందరమైన భాష తెలుగు అని చదువుకున్నాను. ఈ సినిమాకు డబ్బింగ్ చెప్పేటప్పుడు ఆ విషయం తెలుసుకున్నా. సొంతంగా తెలుగులో డబ్బింగ్ చెప్పడం మంచి అనుభూతినిచ్చింది. అందుకు శశాంక్ వెన్నెలకంటి బాగా సపోర్ట్ చేశారు. తమిళంలో ఎనిమిది రోజులు డబ్బింగ్ చెబితే, తెలుగులో కేవలం ఆరు రోజుల్లోనే పూర్తి చేశా.

ఆ ఆలోచన లేదు..

సినీ నటులు రాజకీయాల్లోకి రావడం కొత్తేమీ కాదు. గతంలో పలువురు నటులు రాజకీయాల్లో తమదైన ముద్ర వేశారు. ఇప్పుడు రజనీకాంత్, కమల్ హాసన్ రాజకీయాల్లోకి వస్తున్నారనే వార్తలు వినిపిస్తున్నాయి. నిజంగా చెప్పాలంటే రజనీ, కమల్ భిన్న ధృవాల్లాంటి వ్యక్తులు. చిత్ర సీమలో తమకంటూ ఓ ప్రత్యేకతను క్రియేట్ చేసుకున్నారు. రాజకీయాల్లో రాణించాలంటే వ్యక్తిగతంగా చాలా సమయాన్ని వెచ్చించాలి. అది అంతా ఈజీ కాదు. నాకు మాత్రం అలాంటి ఆలోచన లేదు. అగరం ఫౌండేషన్ ద్వారా విద్యకు సంబంధించి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నా. ఇది నాకు చాలా సంతృప్తినిస్తోంది. ఇకపై కూడా ఈ కార్యక్రమాలను విస్తృతం చేస్తాను.

తదుపరి ప్రాజెక్ట్‌లు..

ప్రస్తుతం సెల్వారాఘవన్ దర్శకత్వంలో ఓ సినిమా చేస్తున్నా. ఇందులో సాయిపల్లవి, రకుల్ ప్రీత్ సింగ్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. అలాగే కె.వి.ఆనంద్ దర్శకత్వంలో ఓ సినిమా చేయాల్సి ఉంది. హరి దర్శకత్వంలో రెండేండ్లకోసారి చేస్తాను. ఆయనతో 'సింగం' సీక్వెల్స్ మాత్రం చేయను.

అక్షయ్‌కుమార్ సరసన..!

తెలుగు, తమిళం, హిందీ చిత్రాల్లో నటిస్తూ రకుల్ ప్రీత్ సింగ్ విశేష ప్రేక్షకాదరణ పొందుతోంది. ప్రస్తుతం హిందీలో నటించిన 'అయ్యారీ' చిత్రం రిపబ్లిక్ డే సందర్భంగా విడుదల కానుంది. ఇదిలా ఉంటే, తాజాగా మరో బాలీవుడ్ బంపర్ ఆఫర్‌ను రకుల్ అందిపుచ్చుకుంది. యాక్షన్ హీరో అక్షయ్ కుమర్ (అక్కీ) సరసన నటించే అవకాశం పొందింది. అక్కీ నటించబోయే తదుపరి చిత్రంలో హీరోయిన్‌గా రకుల్ ఎంపికైనట్టు తెలుస్తోంది. అక్కీ ప్రస్తుతం 'ప్యాడ్‌మ్యాన్', 'గోల్డ్', 'మొఘల్', 'కేసరి' చిత్రాల్లో నటిస్తుండగా, రకుల్ తమిళంలో సూర్య సరసన ఓ సినిమాలో నటిస్తోంది. సెల్వ రాఘవన్ దర్శకుడు. ఇందులో సాయిపల్లవి మరో నాయిక. దీంతోపాటు కార్తీతో మరో చిత్రంలో రకుల్ మెరవనుంది. అలాగే 'స్పైడర్' తర్వాత మరోసారి మహేష్‌తో కలిసి నటించబోతోందట. వంశీపైడిపల్లి దర్శకత్వంలో ఈచిత్రం తెరకెక్కనుంది.


రకుల్ ప్రీత్‌సింగ్

సమ్మర్ స్పెషల్‌గా నా నువ్వే

కళ్యాణ్‌రామ్, తమన్నా జంటగా జయేంద్ర దర్శకత్వంలో కూల్ బ్రీజ్ సినిమాస్ పతాకంపై కిరణ్ ముప్పవరపు, విజయ్ వట్టికూటి ఓ సినిమాను నిర్మిస్తున్నారు. ఈస్ట్ కోస్ట్ ప్రొడక్షన్స్ పతాకంపై మహేష్ కోనేరు సమర్పిస్తున్న ఈ చిత్రానికి తాజాగా 'నా నువ్వే' అనే టైటిల్‌ను ఖారారు చేశారు. ఈ సందర్భంగా సోమవారం చిత్ర టీజర్‌ను విడుదల చేశారు. ఈ చిత్రం గురించి మహేష్ కోనేరు చెబుతూ, పి.సి. శ్రీరాం, జయేంద్ర వంటి టాప్ క్వాలిటీ టెక్నికల్ టీంతో ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాం. సినిమాలో కళ్యాణ్‌రామ్ కొత్త మేకోవర్‌తో ఫ్రెష్‌లుక్‌లో కనిపిస్తారు. వేసవి సెలవుల్లో సినిమాను విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నాం' అని అన్నారు. 'లవ్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతున్న చిత్రమిది. సినిమాకు 'నా నువ్వే' అనే టైటిల్ యాప్ట్ అవుతుంది. జనవరి నెలాఖరుకి దాదాపు షూటింగ్ పూర్తవుతుంది. నూతన కాన్సెప్ట్‌తో, ఫ్రెష్ లుక్‌తో ఈ చిత్రాన్ని దర్శకుడు జయేంద్ర తీర్చిదిద్దుతున్నారు. కళ్యాణ్‌రామ్, తమన్నాల జోడీ సినిమాకు హైలైట్‌గా నిలుస్తుంది. పి.సి.శ్రీరామ్ కెమెరా వర్క్ సినిమాకు పెద్ద అసెట్ అవుతుంది. అవార్డు విన్నింగ్ సంగీత దర్శకుడు షరెత్ మ్యూజిక్ అందించడం విశేషం' అని నిర్మాత కిరణ్ ముప్పవరకు తెలిపారు. తనికెళ్ళభరణి, పోసాని, వెన్నెల కిషోర్, ప్రవీణ్, బిత్తిరి సత్తి, ప్రియ, సురేఖ వాణి ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు.

బాల ఎన్టీఆర్‌గా కళ్యాణ్ రామ్ తనయుడు..!

నట సార్వభౌముడు నందమూరి తారక రామారావు జీవితం ఆధారంగా తేజ ఓ బయోపిక్‌ను తెరకెక్కిస్తున్న విషయం విదితమే. ఎన్టీఆర్ పాత్రలో బాలకృష్ణ నటిస్తున్నారు. ఇందులో చిన్నప్పుడు బాల ఎన్టీఆర్ పాత్రలో కళ్యాణ్ రామ్ తనయుడు శౌర్యరామ్ నటించనున్నట్టు తెలుస్తోంది.


తమన్నా
కళ్యాణ్ రామ్

అదాలత్‌కు 41 ఏండ్లు..

'అలనాటి తార వాహీదా రెహ్మాన్‌తో కలిసి 'అదాలత్' చిత్రంలో నటించడం నాకు చాలా ప్రత్యేకం' అని అంటున్నారు బిగ్‌బీ అమితాబ్ బచ్చన్. ఆయన ద్విపాత్రాభినయం చేసిన చిత్రం 'అదాలత్'. 1976లో విడుదలైన ఈ సినిమాకు నరిందర్ బేడి దర్శకత్వం వహించగా, వాహీదా రెహ్మాన్, నీతూ సింగ్ హీరోయిన్లుగా నటించారు. ఈ సినిమా విడుదలై 41ఏండ్లు పూర్తయిన సందర్భంగా బిగ్‌బీ సోమవారం ట్విట్టర్ ద్వారా తన జ్ఞాపకాలను పంచుకున్నారు. 'నేను నటించిన 'అదాలత్'కు 41ఏండ్లు. గొప్ప విషయం. దీనిపై 'ది గాడ్ ఫాదర్' ప్రభావం ఎంతో ఉంది. అలాగే నరిందర్ బేడీ అభిరుచికి ఇది నిదర్శనం. ఇందులో వాహీదా రెహ్మాన్‌తో కలిసి నటించడం నాకు విశేషమనే చెప్పాలి' అని ట్వీట్‌లో పేర్కొన్నారు.

ఒక్క క్షణం విజయానందం..


అల్లు శిరీష్, వి.ఐ.ఆనంద్, సీరత్‌కపూర్

అల్లు శిరీష్, సురభి, అవసరాల శ్రీనివాస్, సీరత్ కపూర్ ప్రధాన తారాగణంగా నటించిన చిత్రం 'ఒక్క క్షణం'. వి.ఐ.ఆనంద్ దర్శకత్వంలో చక్రి చిగురుపాటి నిర్మించిన ఈ సినిమా ఇటీవల విడుదలై విజయవంతంగా ప్రదర్శితమవుతున్న సందర్భంగా ఏర్పాటు చేసిన సక్సెస్‌మీట్‌లో అల్లు శిరీష్ మాట్లాడుతూ, 'ఈ చిత్రాన్ని ఇంత పెద్ద సక్సెస్ చేసిన ప్రేక్షకులకు నా ప్రత్యేక కృతజ్ఞతలు. నా తొలి చిత్రం 'గౌరవం' బాక్సాఫీసు వద్ద అంతగా సక్సెస్ సాధించలేదు. దీంతో ఏదైన కొత్తగా చేయాలనే ఆలోచన తగ్గిపోయింది. తర్వాత 'కొత్తజంట', 'శ్రీరస్తుశుభమస్తు' వంటి కమర్షియల్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్స్‌ను చేశాను. కొత్త కాన్సెప్ట్‌తో చేస్తే ఆదరిస్తారనే ధైర్యంతో ఈ సినిమా చేశాం. మా ప్రయత్నం సక్సెస్ అయ్యింది. నమ్మకం నిజమైంది. 2017లో నాకు ఓ మెమరబుల్ సినిమాగా ఇది నిలిచింది. ఈ సినిమాకు వచ్చినంత స్పందన మరే సినిమాకు రాలేదు. ప్రతి ఒక్కరూ ప్రశంసిస్తున్నారు. ఇంత మంచి సినిమా చేసిన దర్శక, నిర్మాతలకు థ్యాంక్స్. 1971బియాండ్ బోర్డర్' సినిమాలో మోహన్‌లాల్ పక్కన మంచి సపోర్టింగ్ రోల్ చేస్తున్నాను. ఆ సినిమాలో నా పాత్రకు మంచి స్పందన వచ్చింది' అని అన్నారు.

'ఈ చిత్రం ఇప్పటికీ విజయవంతంగా ప్రదర్శించబడుతోంది. సినిమాను రాజీపడకుండా నిర్మించిన నిర్మాతలకు, సపోర్ట్ చేసిన టెక్నీషియన్స్‌కి, ఇంతటి విజయాన్ని అందించిన ప్రేక్షకులకు ధన్యవాదాలు' అని దర్శకుడు వి.ఐ.ఆనంద్ తెలిపారు. సీరత్ కపూర్ చెబుతూ, 'మా చిత్ర విషయంలో 2018కి స్వాగతం పలికి ఆడియెన్స్‌కు కృతజ్ఞతలు' అని చెప్పింది.

శ్రద్ధా అవుట్.. దీపికా ఇన్?

బాడ్మింటన్ స్టార్ సైనా నెహ్వాల్ జీవితం ఆధారంగా దర్శకుడు అమోల్ గుప్తా ఓ బయోపిక్‌ను తెరకెక్కించబోతున్నారు. ఇందులో బాడ్మింటన్ స్టార్‌గా కనిపించేందుకు శ్రద్ధా కపూర్ తీవ్రంగా శ్రమిస్తోంది. అందుకోసం సైనా నెహ్వాల్, పుల్లెల గోపీచంద్ ఆధ్వర్యంలో శిక్షణ కూడా తీసుకుంటోందట. అయినప్పటికీ షాట్స్ కొట్టే విషయంలో, ఆటలో సహజత్వం కనిపించే విషయంలో శ్రద్ధా వెనకబడుతుందని, పర్‌ఫెక్ట్‌గా ఆడలేకపోతుందని దర్శకుడు అమోల్ అసంతృప్తిగా ఉన్నట్టు సమాచారం. అంతేకాదు ఆమె స్థానంలో దీపికా పదుకొనెను తీసుకునే ఆలోచనలో చిత్ర బృందం ఉన్నట్టు కూడా తెలుస్తోంది.


దీపికా పదుకొనె


'ఆచారి అమెరికా యాత్ర'లో మంచు విష్ణు

ఆద్యంతం వినోదాత్మకం..

'ఇండియాలో రూపాయికి రూపాయే. అమెరికాలో అయితే డాలరుకి 66రూపాయలు. మన జీవితాలు కళకళలాడిపోతాయి. ధనం మూలం ఇదం జగత్. ప్రపంచంలో జరిగే తప్పులన్నింటికీ డబ్బే కారణం' అని అంటున్నారు మంచు విష్ణు. ఆయన హీరోగా నటిస్తున్న చిత్రం 'ఆచారి అమెరికా యాత్ర'. ప్రగ్యా జైశ్వాల్ కథానాయిక, బ్రహ్మానందం కీలక పాత్రధారి. జి.నాగేశ్వర్‌రెడ్డి దర్శకత్వంలో పద్మజ పిక్చర్స్ పతాకంపై కీర్తి చౌదరి, కిట్టు సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఈ చిత్ర టీజర్ ఇటీవల విడుదలైంది. ఇందులో బ్రహ్మానందం, మంచు విష్ణుల మధ్య వచ్చే సన్నివేశాలు ఆకట్టుకుంటున్నాయి.

ఈ చిత్రం గురించి నిర్మాతలు మాట్లాడుతూ, 'కామెడీ ప్రధానంగా సాగే చిత్రమిది. విష్ణు, బ్రహ్మానందం కాంబినేషన్‌లో వస్తున్న ఈ చిత్రంపై అందరిలోనూ భారీ అంచనాలు నెలకొన్నాయి. వీరిద్దరు 'ఢీ', 'దేనికైనా రెడీ', 'దూసుకెళ్తా' వంటి చిత్రాల్లో ప్రేక్షకులను కడుపుబ్బా నవ్వించారు. విష్ణు, నాగేశ్వర్‌రెడ్డి కాంబినేషన్‌లోనూ ఇది మూడవ చిత్రం. గతంలో వచ్చిన 'దేనికైనా రెడ్డి', 'ఈడోరకం ఆడోరకం' చిత్రాల తరహాలోనే వినోదాన్ని పంచే సినిమా అవుతుంది. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసి సినిమాను ఈ నెల 26న విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నాం' అని తెలిపారు. తనికెళ్ళభరణి, కోట శ్రీనివాసరావు, పోసాని కృష్ణమురళి, పృథ్వీ, విద్యుల్లేఖ రామన్, ప్రభాస్ శ్రీను, సురేఖ వాణి ఇతర పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: ఎస్.ఎస్.థమన్, సినిమాటోగ్రఫీ: సిద్ధార్థ్, ఎడిటింగ్: వర్మ, ఆర్ట్: కిరణ్.

డిఫరెంట్ లవ్‌స్టోరీ..


తరుణ్

తరుణ్, ఓవియా జంటగా రమేష్–గోపీ దర్శకత్వంలో రామ్ ఎంటర్‌టైనర్స్ పతాకంపై ఎస్.వి.ప్రకాష్ నిర్మిస్తున్న చిత్రం 'ఇది నా లవ్ స్టోరీ'. ఈ చిత్ర ట్రైలర్ విడుదల కార్యక్రమం సోమవారం హైదరాబాద్‌లో జరిగింది. ఈ సందర్భంగా తరుణ్ పుట్టిన రోజు(సోమవారం)ను పురస్కరించుకుని అభిమానులు, చిత్ర యూనిట్ మధ్య కేక్ కట్ చేయడంతోపాటు చిత్ర ట్రైలర్‌ను విడుదల చేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 'నా పుట్టిన రోజు సందర్భంగా అభిమానులను కలవడం, ట్రైలర్‌ను విడుదల చేయడం ఆనందంగా ఉంది. ఇప్పటికే విడుదలైన టీజర్‌కు మంచి స్పందన లభించింది. రెగ్యులర్ లవ్ స్టోరీ కాదిది, పూర్తి భిన్నంగా ఉంటుంది. ఇందులో నేను మూడు గెటప్స్‌లో కనిపిస్తాను. ఆ మూడు గెటప్స్ ఏంటి, మూడు పాత్రల్లో కనిపిస్తానా? లేక మరేదైనా అన్నది తెలియాలంటే సినిమా చూడాల్సిందే. డైలాగ్స్, స్క్రీన్‌ప్లే, కెమెరా వర్క్ సినిమాకు హైలైట్ అవుతాయి. సినిమాలో చాలా తక్కువ పాత్రలుంటాయి. హీరోయిన్ ఓవియా చాలా బాగా నటించారు. ఫిబ్రవరి 14న సినిమాను విడుదల చేయబోతున్నాం. సినిమాపై చాలా కాన్ఫిడెంట్‌గా ఉన్నాం' అని అన్నారు. 'ఈ ట్రైలర్‌ను హీరో తరుణ్‌కి బర్త్‌డే గిఫ్ట్‌గా ఇస్తున్నాం. ప్రతి ఒక్కరికి మనసుంటుంది. అది లవ్ చేయకుండా ఉండదు. ప్రతి మనసున్న మనిషికి కనెక్ట్ అయ్యే చిత్రమిది. అబ్బాయిలు మాత్రమే దేవదాసులవ్వాలా.. అమ్మాయిలు కూడా దేవదాసు అయితే పోలా అనే డైలాగ్‌లు ఆకట్టుకుంటాయి. తెలుగు ప్రేక్షకులకు డిఫరెంట్ లవ్‌స్టోరీ అవుతుంది. సినిమా చూసేటప్పుడు ప్రతి ఒక్కరు ఇది నా లవ్‌స్టోరీ అని ఫీలవుతారు. సినిమా సక్సెస్ అవుతుందని కన్ఫిడెంట్‌గా ఉన్నాం. వాలెంటైన్ డే సందర్భంగా ప్రేమికులకు గిఫ్ట్‌గా ఇస్తున్న చిత్రమిది' అని దర్శకులు రమేష్–గోపీ తెలిపారు. 'తరుణ్‌తో సినిమా చేయడం ఆనందంగా ఉంది. సినిమాకు సపోర్ట్ చేసిన అందరికీ ధన్యవాదలు' అని నిర్మాత తెలిపారు. ఈ కార్యక్రమంలో సంగీత దర్శకుడు శ్రీనాథ్ విజయ్, కెమెరామెన్ క్రిస్టోఫర్ జోసెఫ్, జగదీష్, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల్లో ఎనిమిది మంది మృతి

నవతెలంగాణ-జోగులాంబ/ధరూరు

బొలేరోలో 40 మంది కూలీలను ఎక్కించిన యాజమాన్య నిర్లక్ష్యం...డ్రైవర్ నిద్రమత్తు వెరసి జోగులాంబ గద్వాల జిల్లాలో సోమవారం తెల్లవారు జామున జరిగిన ఘోర రోడ్డుప్రమాదంలో ఐదుగురు కూలీలు అక్కడికక్కడే చనిపోయారు. 29 మందికి గాయాలయ్యాయి. అందులో తొమ్మిది మంది కూలీల పరిస్థితి విషమంగా ఉంది. అలాగే, మహబూబ్‌నగర్ జిల్లాలో జరిగిన రోడ్డుప్రమాదంలో ఇద్దరు, నాగర్‌కర్నూల్ జిల్లాలో కారు పల్టీ కొట్టిన ఘటనలో ఒకరు మృతిచెందారు. నలుగురికి తీవ్రగాయాలు అయ్యాయి. ఈ ప్రమాదాల్లో మొత్తం ఎనిమిది మంది చనిపోయారు.

పోలీసులు, కూలీల వివరాల ప్రకారం...ధరూర్ మండలం చిన్నపాడు, యమునోనిపల్లి గ్రామాలకు చెందిన కూలీలు ప్రతి రోజూ గద్వాలలో కొండపల్లి రోడ్డులో గల జేసీ రంగారెడ్డికి చెందిన పత్తిమిల్లులోకి పనికెళ్తున్నారు. రోజుమాదిరిగానే ఆదివారం సాయంత్రం పనికెళ్లారు. తిరిగి సోమవారం తెల్లవారుజామున పని అయిపోగానే బొలేరో వాహనంలో స్వగ్రామాలకు బయలుదేరారు. డ్రైవర్ నిద్రమత్తులో ఉండటంతో గద్వాల మండలపరిధిలోని గోనుపాడు దాటిన తర్వాత పార్చర్లమిట్ల వద్ద బొలేరో వాహనం అదుపుతప్పి పల్టీకొట్టింది. దీంతో చిన్నపాడుకు చెందిన కమ్మరి లోహిత్(35), కమ్మరి గీతమ్మ(35), కోట్ల వెంకటన్న(40), కొత్త బాయి వెంకటన్న (35) యమినోనిపల్లికి చెందిన అరుణ(18) అక్కడికక్కడే చనిపోయారు. మరో 29 మంది కూలీలకు




గాయాలయ్యాయి. అందులో తొమ్మిది మంది పరిస్థితి విషమంగా ఉంది. వారిని డీఎస్పీ సురేందర్‌రావు పర్యవేక్షణలో గద్వాల ఏరియాస్పత్రికి తరలించి చికిత్స అందించారు. తీవ్రంగా గాయపడిన కర్నూల్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చిన్నపాడుకు చెందిన నలుగురు కూలీలు చనిపోవటంతో ఆ గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. జిల్లా కలెక్టర్ రజత్‌కుమార్ సైనీ, ఎస్పీ విజయ్‌కుమార్ ఘటన స్థలానికి చేరుకుని ప్రమాదం జరిగిన తీరు గురించి తెలుసుకున్నారు. మాజీ ఎమ్మెల్యే భరతసింహారెడ్డి, టీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, జెడ్పీచైర్మెన్ బండారి భాస్కర్, మార్కెట్‌యార్డు చైర్మెన్ బండ్ల లక్ష్మీదేవమ్మ గద్వాల ఏరియాస్పత్రికి చేరుకుని మృతుల బంధువులను ఓదార్చారు.

మృతుల కుటుంబాలకు రూ.6లక్షల ఎక్స్‌గ్రేషియా

మృతుల కుటుంబాలకు సీడ్ పత్తి ఆర్గనైజర్లు రూ. 6లక్షల ఎక్స్‌గ్రేషియా ఇచ్చేందుకు ఒప్పుకున్నారు. సీడ్‌పత్తి ఆర్గనైజర్లతో రాజకీయ నాయకులు, వివిధ ప్రజా సంఘాల నాయకులు ఆర్డీఓ కార్యాలయంలో చర్చించారు. మృతుల కుటుంబాలకు రూ. 6 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా ఇస్తామని, గాయపడిన వారి వైద్య ఖర్చులు భరిస్తామని సీడ్‌పత్తి ఆర్గనైజర్లు హామీ ఇచ్చారు.

వేరే ప్రమాదాల్లో...

మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర మండలం గోటూరు గ్రామానికి చెందిన గడ్డమోని వేణు (14), గడ్డమోని రాజు (17) డీజిల్ తేవడానికి ద్విచక్ర వాహనంపై వెళ్లి ప్రమాదానికి గురయ్యారు. వారు నాగారం గేటు సమీపంలో ఆగి ఉన్న ట్రాక్టర్‌ను వెనుక నుంచి ఢీకొట్టారు. ఇద్దరూ అక్కడికక్కడే చనిపోయారు. హైదరాబాద్ బోయిన్‌పల్లికి చెందిన ప్రసాద్(40) మరి కొందరితో కలిసి కారులో శ్రీశైలం వెళ్లి తిరిగి వస్తున్నారు. ఈ క్రమంలో కారు నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట మండల పరిధిలోని బ్రాహ్మణపల్లి గేటు సమీపానికి రాగానే బోల్తా కొట్టింది. ఈ ప్రమాదంలో ప్రసాద్(40) అక్కడిక్కడే దుర్మరణం చెందగా, మరో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. వారిని చికిత్స నిమిత్తం హైదరాబాద్ తరలించారు.



లెఫ్ట్, అంబేద్కరిస్ట్ ప్రొఫెసర్లే టార్గెట్!

(మొదటిపేజీ తరువాయి)

కోఆర్డినేటర్‌గా ఉన్న కరన్ పల్సనియా అనే హెచ్‌సీయూ విద్యార్థి ఫేస్‌బుక్‌లో ఓ పోస్టు చేశాడు. " బాస్టర్డ్ లక్ష్మీనారాయణ...తో మొదలు పెట్టిన అతని పోస్టులో కాషాయీకరణ అంటే ఏంటో ఇప్పుడు ప్రచారం చేస్తున్నాడు..అతనికి ఎకనామిక్స్‌లో ప్రాథమిక అవగాహన కూడా లేదు..అయినా కాషాయీకరణపై ప్రచారం చేస్తున్నాడు. బెదిరించడం ద్వారానే ప్రొఫెసర్‌గా మారాడు...ఆయన గురించి విద్యార్థులు ఎప్పుడు చెబుతారు.." అంటూ పోస్టు చేశాడు. ఈ విషయాన్ని కొందరు విద్యార్థులు ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ దృష్టికి తీసుకుపోయారు. దీంతో ఆయన నవంబర్ 30న వర్సిటీ వీసీ అప్పారావుతో పాటు ప్రోక్టోరల్ బోర్డుకూ ఏబీవీపీ నేత చేసిన ఫేస్‌బుక్ పోస్టుపై ఆధారాలతో ఫిర్యాదు చేశారు. ఈ విషయం తెలిసిన ఆ ఏబీవీపీ నేత ప్రొఫెసర్‌పై చేసిన పోస్టులను ఫెస్‌బుక్ నుంచి తొలగించారు. ప్రొఫెసర్ ఫిర్యాదు చేసిన వారం తర్వాత కూడా హెచ్‌సీయూ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో..మరోసారి వీసీ ఆఫీస్‌కు ఆయన లేఖరాశారు. డీన్ అభిప్రాయం కోసం లేఖ రాశామని వారు ప్రొఫెసర్‌కు తిరిగి సమాధానం ఇచ్చారు. వాస్తవానికి డీన్ డిసెంబర్ 10లోపే రిప్లే ఇచ్చారు. అయినా దాన్ని 17 వరకు వీసీ వద్దే పెట్టుకుని, 18న ప్రోక్టోరల్ బోర్డుకు పంపారు. అయితే ఇప్పటి వరకూ ప్రొఫెసర్‌పై అసభ్యకరంగా పోస్టు చేసిన ఏబీవీపీ నేతపై ప్రోక్టోరల్ బోర్డు ఎలాంటి చర్య తీసుకోలేదు. దీంతో మరోసారి బోర్డుకు ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ లేఖరాసినా ఫలితం లేకపోయింది. వర్సిటీలో కొద్ది రోజుల క్రితం అగ్రవర్ణానికి చెందిన ప్రొఫెసర్లను విద్యార్థులు తిట్టారనే కారణంతో ఎలాంటి ఆధారాలు లేకున్నా పది వామపక్ష, అంబేద్కరిజం భావజాలంతో ఉన్న పది మంది విద్యార్థులపై చర్యలు తీసుకున్నారు. ఇద్దరు విద్యార్థులను రెండేండ్ల పాటు సస్పెండ్ చేశారు. అదే దళిత సామాజిక వర్గానికి చెందిన ప్రొఫెసర్‌పై నిస్సిగ్గుగా ఏబీవీపీ జాతీయ నేత వ్యాఖ్యలు చేసినా, వర్సిటీ అధికారులు మాత్రం చర్యలకు జంకుతున్నారు. హెచ్‌సీయూ విద్యార్థి రోహిత్ వేముల ఆత్మహత్య సమయంలో వర్సిటీ వీసీపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆందోళనల్లో ముందుండి పాల్గొన్నారనే అక్కసు ఏబీవీపీ నేతలతో పాటు వర్సిటీ ఉన్నతాధికారుల్లోనూ ఉందని దీని ద్వారా స్పష్టమవుతోంది. ఏబీవీపీ నేతపై చర్యలు తీసుకోవాలని అధ్యాపక, విద్యార్థి సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. మంగళవారం నుంచి ఆందోళనలకు సిద్ధమవుతున్నాయి.

నిబంధనల మేరకే బోధన: ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ

మేం విద్యార్థులకు ఎం బోధించాలనేది వర్సిటీ అధికారులే నిర్ణయిస్తారు. వారి నిబంధనల మేరకు విద్యాబోధన, పరీక్షలు నిర్వహిస్తాం. కానీ 'కాషాయీకరణ' పేరు ఉందని, ఎకనామిక్స్ సబ్జెక్టుతో సంబంధం లేని ఓ ఏబీవీపీ నాయకుడు అసభ్యకరమైన, బూతులతో పోస్టు చేయడం సరికాదు. బ్లాక్‌మెయిల్ చేసి ప్రమోషన్ పొందాల్సిన గత్యంతరం నాకులేదు. నా బోధనపై ఏమైనా అభ్యంతరముంటే వర్సిటీ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయాలి గానీ, ఇలా పోస్టులు పెట్టడం సరికాదు. వర్సిటీ కల్చర్ కాపాడాలని కోరుతూ వీసీకి ఫిర్యాదు చేశాను. అయినా ఇప్పటికీ ఎలాంటి చర్య తీసుకోలేదు. వర్సిటీ అధికారులు నిర్లక్ష్యం చేస్తే న్యాయపరంగా వెళ్తాను.

చర్యలు తీసుకోవాలి: మున్నా, ఏఎస్ఏ వర్సిటీ అధ్యక్షులు

గురుశిష్య పరంపర అంటూ నిత్యం నీతులు వల్లించే ఏబీవీపీ నేతలు...ఓ గురువుపై ఇంత ఘోరంగా వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటు. ఇది వాళ్ల సంస్కృతికి అద్దంపడుతుంది. గతంలో ప్రొఫెసర్ కంచ ఐలయ్య, ప్రొఫెసర్ సూరేపల్లి సుజాతతో పాటు పలువురు ప్రొఫెసర్లపై ఇలాంటి వ్యాఖ్యలే చేశారు. గతంలో ప్రొఫెసర్లను తిట్టినట్టు ఎలాంటి ఆధారాలు లేకున్నా, పది మంది విద్యార్థులపై చర్యలు తీసుకున్నారు. కానీ ఇప్పుడు అన్ని ఆధారాలున్నా, ఏబీవీపీ నేత అనేకారణంతోనే ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు.

మరుగుదొడ్డే నివాసం

గుడిసె కూలటంతో నాలుగేండ్లుగా...
డబుల్‌బెడ్‌రూం కోసం ఎదురుచూపులు

- హృదయవిదారకం...స్పందించకుంటే పోరాటం :పోతినేని

నవతెలంగాణ-బోనకల్

గుడిసె కూలింది. ఇల్లు కట్టుకునేందుకు చేతిలో చిల్లిగవ్వలేదు. సర్కారూ కనికరించలేదు. దీంతో బంగారు తెలంగాణలో ఓ కుటుంబం నాలుగేండ్లుగా మరుగుదొడ్డినే ఆవాసంగా మార్చుకున్నది. అందులోనే ముగ్గురు పెద్దవాళ్లు, ఇద్దరు పిల్లలు కాలం వెళ్లదీస్తున్నారు. ఖమ్మం జిల్లా బోనకల్ మండలం చిరునోములలో సమస్యలపై టీమాస్ సర్వే చేస్తుండగా ఆదివారం ఈ హృదయవిదారక ఘటన వెలుగులోకి వచ్చింది. విషయం తెలుసుకున్న టీమాస్ ఫోరం రాష్ట్ర స్టీరింగ్ కమిటీ సభ్యులు పోతినేని సుదర్శన్‌రావు బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా బూదెమ్మ కుటుంబ సభ్యులు పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. నాలుగేండ్ల కిందట గుడిసెలో నివాసముండేవారని, గుడిసె కూలిపోవడంతో పలుమార్లు అధికారుల చుట్టూ తిరిగినా ఎలాంటి ఫలితమూ లేదన్నారు. కూలి పని చేసుకుని జీవించే తమకు మరోమార్గం లేక మరుగుదొడ్డిలోనే నివాసముంటున్నట్టు కొర్ని బూదెమ్మ, ఆమె అల్లుడు పసుమతి జేమ్స్, కూతురు నాగరత్నం పోతినేని ఎదుట వాపోయారు. అంత చిన్న దానిలో ఐదుగురు కుటుంబ సభ్యులెలా నివసిస్తున్నారని అడగ్గా బేసిన్‌పై రాయి అడ్డుగా పెట్టి ఉంటున్నామని తెలిపారు. రాత్రి సమయంలో జేమ్స్ బయట పడుకుంటున్నాడనీ, కూతురు, మనవళ్లతో తానూ అందులోనే తలదాచుకుంటున్నట్టు ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. కాళ్లు ముడుచుకుని పిల్లలను తమపై పడుకోబెట్టుకుని ఎలా కాలం వెళ్లదీస్తున్నారో ఆయన ఎదుట ప్రత్యక్ష్యంగా చూపించారు. అక్కడి ఘటనను చూసి పోతినేని చలించిపోయారు.

అనంతరం విలేకరులతో పోతినేని మాట్లాడుతూ చిరునోములలో బూదెమ్మ కుటుంబం మరుగుదొడ్డిలో నివాసముండే విషయం వెలుగులోకి రాగానే తాను స్వయంగా పరిశీలించేందుకు వచ్చినట్టు తెలిపారు. ఇలాంటి ఘటనలు టీఆర్ఎస్ పాలనకు సిగ్గుచేటన్నారు. నాలుగేండ్లుగా ఆ కుటుంబం మరుగుదొడ్డిలోనే నివాసముంటున్నా అధికారులు, ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమన్నారు. చిరునోములలో నిర్మిస్తున్న డబుల్ బెడ్ రూం ఇండ్ల నిర్మాణాల్లో ఒక ఇంటిని



లాటరీతో నిమిత్తం లేకుండా బూదెమ్మ కుటుంబానికి కేటాయించాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. ఇంటిని బూదెమ్మ కుటుంబానికి ఇవ్వకుంటే టీ మాస్ ఆధ్వర్యంలో ప్రభుత్వంపై పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. అవసరమైతే టీ మాస్ ఆధ్వర్యంలో ఇంటి నిర్మాణానికి ఏర్పాటు చేస్తామని పోతినేని హామీ ఇచ్చారు.

తహసీల్దార్‌కు వినతి...

అనంతరం కొర్ని బూదెమ్మ కుటుంబం మరుగుదొడ్డిలో నివాసం ఉంటోందని తహసీల్దార్ గుండపనేని సుదర్శన్‌రావు దృష్టికి పోతినేని తీసుకెళ్లారు. ఆ కుటుంబ పరిస్థితిని తహసీల్దార్‌కు వివరించారు. స్పందించిన ఆయన బూదెమ్మ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తానని, డబుల్ బెడ్ రూం ఇండ్లలో ఒక ఇంటిని ఆమెకు కేటాయించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఇదే సమస్యపై కలెక్టర్‌ను కలిసి వివరిస్తామని, ఎట్టి పరిస్థితుల్లో బూదెమ్మ కుటుంబాన్ని ఆదుకోవాలని పోతినేని కోరారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో టీ మాస్ మండలాధ్యక్షులు కొట్టె జ్ఞానప్రకాశం, మండల కన్వీనర్ బోయినపల్లి కొండ, టీమా స్ ఫోరం లీడర్ దొండపాటి నాగేశ్వరరావు, .జెడ్పీటీసీ బానోతు కొండ, టీం సభ్యులు గుగులోతు నరేశ్, మర్రి తిరుపతిరావు, చిరునోముల ఎంపీటీసీ నీలకంఠం శ్రీలత, మాజీ ఉపసర్పంచ్ నీలకంఠం రాము, పంతంగి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నిఘా

మొదటిపేజీ తరువాయి

కెమెరాలను ఏర్పాటు చేస్తున్నారు. సాధారణంగా భద్రత కోసం అయితే భవన్ పరిసరాల్లో లేదా ఆఫీసు బయట కెమెరాలు ఏర్పాటు చేస్తారు. కానీ ఏకంగా ఆఫీసు గదుల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం వివాదాస్పదమవుతోంది. పైగా మహిళా సిబ్బంది కార్యాలయంలోనూ కెమెరాలు బిగిస్తున్నారు. మొత్తం భవన్‌లోని అధికారుల, సిబ్బంది ఆఫీసుల్లో, పరిసరాల్లో 20 నిఘా కెమెరాలు ఏర్పాటు చేస్తున్నారు.

తెలంగాణభవన్‌లో రెసిడెంట్ కమిషనర్(ప్రస్తుతం బదిలీ అయ్యారు), అదనపు రెసిడెంట్ కమిషనర్‌కు ఇతర సిబ్బందికి మధ్య వైరం నడుస్తోంది. ముఖ్యంగా ఇటీవల మంత్రి జోగురామన్న ప్రోటోకాల్ వివాదంతో పాటు దీపావళికి రాష్ట్ర ప్రభుత్వం విలువైన వస్తువులను కేంద్రమంత్రులకు ఇతర కార్యదర్శులకు బహుమతులుగా ఇవ్వాలని నిర్ణయించిన అంశం మీడియాలో కథనాలు వెలువడ్డాయి. దీంతో ఈ ఘటనలపై ఆర్‌సీతో పాటు ఏఆర్‌సీ.. భవన్ సిబ్బందిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసినట్టు తెలిసింది. మీడియాలో కథనాలు వస్తుంటే నిలువరించకుండా ఏం చేస్తున్నారని సిబ్బందిపై నోరుపారేసుకున్నట్టు సమాచారం. మంత్రి జోగురామన్న ప్రోటోకాల్ వ్యవహారంపై నవతెలంగాణలో వరుస కథనాలు ప్రచురితమయ్యాయి. దీంతో ఇకపై మీడియా సిబ్బందితో ఏ అధికారీ మాట్లాడొద్దని ఆదేశాలు జారీచేసినట్టు తెలిసింది. ఈ వరుస కథనాలు వెలువడిన నాటి నుంచి మీడియా ప్రతినిధులతో మాట్లాడేందుకే సిబ్బంది భయపడుతున్నారు. దీనికితోడు ఇప్పుడు కిందిస్థాయి అధికారుల, సిబ్బంది కార్యాలయాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. 'భద్రత' కోసమే సీసీ కెమెరాలు అని చెబుతున్నప్పటికీ... మీడియా ప్రతినిధులతో అధికారులు మాట్లాడకుండా నిలువరించడం ప్రధాన ఉద్దేశంగా కనిపిస్తోంది. దీపావళి బహుమతుల విషయం రెసిడెంట్ కమిషనర్ పీఎస్ ద్వారా సమాచారం పోయిందనేది ఆర్‌సీ, ఏఆర్‌సీ అనుమానం. అలాగే మంత్రి జోగురామన్న వ్యవహారంలో అసిస్టెంట్ కమిషనరే మీడియా వాళ్లకు సమాచారం ఇచ్చారనేది పైస్థాయి అధికారుల అనుమానం. అందువల్లే మంత్రి జోగురామన్న లేఖ గురించి ఏఆర్‌సీ వేదాంతం గిరిని సంప్రదించగా.. 'మిమ్మల్ని ఎవరు పంపించారు' అంటూ మీడియా వాళ్లను ఎదురు ప్రశ్నించడం గమనార్హం. కాగా సీసీ కెమెరాల ఏర్పాటుపై ఏఆర్‌సీ వేదాంతంగిరిని సంప్రదించేందుకు ఆయన కార్యాలయానికి వెళ్లగా... మాట్లాడేందుకు ఇష్టపడలేదు. నూతన రాష్ట్రమైన తెలంగాణ ఖ్యాతిని, అక్కడ అమలవుతున్న కార్యక్రమాలను ఢిల్లీ వేదికగా జాతీయస్థాయికి తీసుకెళ్లడంలో కృషి చేయాల్సిన అధికారులు.. ఒకరిపై ఒకరు అనుమానాలు పెంచుకుంటూ అసలు విషయాన్ని పక్కదారి పట్టిస్తున్నారు అనే విమర్శలు వినిపిస్తున్నాయి.

నూతన ఆర్‌సీగా అశోక్‌కుమార్ బాధ్యతల స్వీకరణ



తెలంగాణ భవన్ రెసిడెంట్ కమిషనర్‌గా జీ అశోక్‌కుమార్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. 1991 అఖిల భారత సర్వీసెస్‌కు చెందిన అశోక్‌కుమార్ దేశంలోని వివిధ విభాగాల్లో అనేక హోదాల్లో తన సేవలందించారు. గత ఆర్‌సీ అరవిందకుమార్ బదిలీ కావడంతో నూతనంగా ఆయన స్థానంలో అశోక్‌కుమార్ బాధ్యతలు స్వీకరించారు. నూతన ఆర్‌సీకి ఏఆర్‌సీ వేదాంతంగిరి, అసిస్టెంట్ కమిషనర్ రామ్మోహన్, తెలంగాణ భవన్ అధికారులు, సిబ్బంది స్వాగతం పలికారు.

సిఫారసుల అమల్లో తెలంగాణనే ఫస్ట్

- 18వ అఖిల భారత విప్‌ల సదస్సులో పల్లా

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

అఖిల భారత 'విప్' సదస్సులు చేసిన సిఫారసులను అమలు చేయడంలో తెలంగాణ రాష్ట్రమే మొదటి స్థానంలో ఉందని శాసనమండలిలో ప్రభుత్వ విప్ పల్లా రాజేశ్వరరెడ్డి తెలిపారు. గోవా-2014, విశాఖ-2016లో జరిగిన సదస్సుల్లో చేసిన సిఫారసులను అమలు చేశామని చెప్పారు. ఉదయ్ పూర్ (రాజస్థాన్)లో సోమవారం ప్రారంభమైన 18వ అఖిల భారత విప్‌ల సదస్సులో ఆయన మాట్లాడారు. గత సదస్సుల్లో చేసిన సిఫారసులు, అమలు తీరును ఈ సందర్భంగా ఆయన వివరించారు. ఫ్లోర్ మేనేజ్‌మెంట్, క్రమ శిక్షణ, కోడ్ ఆఫ్ కండక్టు వంటి అంశాలపై సిఫారసులను వివరించారు. బీఏసీ సమావేశాలు నిర్వహించి అన్ని పార్టీల నేతలతో చర్చలు జరుపుతున్నామని పేర్కొన్నారు. సభలో అర్థవంతమైన చర్చలు జరిగే విధంగా ఇంటర్ ఫోరం ఏర్పాటు, ప్రజా ప్రతినిధులకు ఇచ్చే నిధుల వినియోగంలో అవరోధాలు తొలగిస్తున్నామని వివరించారు.

టీఆర్ఎస్ మునిగిపోయే నావ

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నిస్సందేహంగా అధికారంలోకి వస్తుందని టీపీసీసీ అధ్యక్షులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చెప్పారు. ఇదే అంశంపై ప్రజల్లో చర్చ జరుగుతున్నదన్నారు. రాష్ట్రంలో టీఆర్ఎస్ పాలన బరువెక్కిందని, రాబోయే కాలంలో ఆ పార్టీ మునిగిపోయే నావ అని చెప్పారు. వచ్చే ఎన్నికలను సమిష్టిగా ఎదుర్కొంటామని చెప్పారు. ఎన్నికల నాటికి ఏ పార్టీ ఉండదని, కాంగ్రెస్, టీఆర్ఎస్ మధ్య పోటీ ఉంటుందన్నారు. అధ్యక్షుడిగా కొనసాగిస్తూ ఏఐసీసీ ప్రకటన తర్వాత ఆయన సోమవారం గాంధీభవన్‌కు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన రాహుల్‌గాంధీకి కృతజ్ఞతలు తెలియజేశారు. రాహుల్‌గాంధీ నాయకత్వంలో తెలంగాణతో పాటు కేంద్రంలోనూ అధికారంలోకి వస్తామని ధీమా వ్యక్తం చేశారు. టీపీసీసీలో కొంత మంది అనాసక్తితో ఉన్నారని, అటువంటి స్థానంలో ఆసక్తి కలిగిన నాయకులకు స్థానం కల్పిస్తామన్నారు. సంక్రాంతి తర్వాత కార్యకర్గంలో మార్పులు, చేర్పులు చేస్తామన్నారు. మేనిఫెస్టో, ప్రచార కమిటీలను ప్రకటిస్తామన్నారు. త్వరలో బస్సుయాత్ర నిర్వహిస్తామని, ప్రతిరోజు మూడు నియోజకవర్గాలల్లో పర్యటిస్తామన్నారు. మేడారం జాతర సందర్భంగా రాహుల్ పర్యటన ఉంటుందన్నారు. ఓయూలో అవకాశం ఇస్తుంటే సభ పెడతామన్నారు. ఇతర పార్టీలకు చెందిన పెద్ద నాయకులు కాంగ్రెస్‌లో చేరుతారని, ఇప్పటికే చర్చలు ప్రారంభమైనట్టు తెలిపారు. నియోజకవర్గాల పునర్విభజన కోసం టీఆర్ఎస్ కేంద్రంపై ఒత్తిడి పెంచుతోందన్నారు. పార్లమెంటులో బిల్లు ప్రవేశపెడితే ఉభయ సభల్లో పార్టీ స్పందిస్తుందన్నారు. సర్పంచులకు ఎన్నికలు ప్రత్యక్షంగా జరగాలని డిమాండ్ చేశారు. దక్షణ తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ స్వీప్ చేస్తోందన్నారు. 70 స్థానాలకు పైగా కాంగ్రెస్ సాధించి అధికారాన్ని కైవసం చేసుకుంటుందన్నారు. 'ప్రతి కాంగ్రెస్ కార్యకర్త నా కుటుంబ సభ్యుడే. ఏ కష్టమెచ్చినా నా నెంబర్‌కు 9848051082కు ఫోన్ చేయండి. ఆదుకుంటా' అని భరోసా ఇచ్చారు. అంతకు మందుకు దేవరకద్ర నియోజకవర్గానికి చెందిన టీఆర్ఎస్, టీడీపీ పార్టీలకు చెందిన నాయకులు పవన్‌కుమార్‌రెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి ఉత్తమ్ వారికి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

అమాంతం ఎగిసిన అదానీ సంపద

మొదటిపేజీ తరువాయి

కార్పొరేట్‌గా ఉన్నారు. బ్లూమ్‌బర్గ్ రిపోర్టు ప్రకారం 2017 ఏడాదిలో అదానీ నికర సంపద అత్యధికంగా 124.6 శాతం ఎగిసింది. 2017 డిసెంబర్ 31 నాటికి ఆయన మొత్తం సంపద 10.4 బిలియన్ డాలర్ల(సుమారుగా రూ.66 వేల కోట్లు)కు చేరింది. గతేడాది జనవరి నాటికి అదానీ ఆస్తులు 4.63 బిలియన్ డాలర్లు(సుమారుగా రూ.29 వేల కోట్లు)గా ఉన్నాయి.

అదానీ తర్వాత డిమార్ట్ యాజమాని రాధాక్రిష్ణన్ దమాని సంపద 80 శాతం పెరిగి 6.96 బిలియన్ డాలర్ల(సుమారుగా రూ.44 వేల కోట్లు)కు చేరింది. గతేడాది మార్చి నాటికి ఆయన ఆదాయం 3.88 బిలియన్ డాలర్లు(రూ.24.6 వేల కోట్లు)గా ఉంది. ధమానీ ప్రస్తుతం ముంబయి కేంద్రంగా అవెన్యూ సూపర్ మార్కెట్స్ గ్రూపులో భాగంగా డి-మార్ట్ స్టోర్లను నిర్వహిస్తున్నారు. 2017 మార్చిలో దమానీకి చెందిన అవెన్యూ సూపర్ మార్కెట్స్ లిస్టింగ్‌కు వచ్చింది. ఈ కంపెనీ ఈక్విటీ షేర్‌ను రూ.299తో ఇష్యూ చేసింది. కాగా జనవరి 8 నాటికి ఈ సూచీ విలువ అమాంతం 340 శాతం పెరిగి రూ.1,235కు చేరింది. దీంతో ఆయన ఆదాయం భారీగా పెరిగింది.

పెరిగిన సంపద..

పేరు	2017లో (డాలర్లలో)	ఇంతక్రితం (డాలర్లలో)	తేడా
గౌతం అదానీ	10.4 బిలియన్లు	4.63 బిలియన్లు	125%
రాధాక్రిష్ణన్ దమానీ	6.96 బిలియన్లు	3.88 బిలియన్లు	80%
ముఖేష్ అంబానీ	40.30 బిలియన్లు	22.70 బిలియన్లు	78%
జెఫ్ బెజోస్	99 బిలియన్లు	65 బిలియన్లు	52%
బిల్‌గేట్స్	91.83%	-	12%
వారెన్ బఫెట్	85.3 బిలియన్లు	-	17%

కాగా కార్పొరేట్ దిగ్గజం ముఖేష్ అంబానీ నికర సంపద 77.53 శాతం పెరిగి 40.30 బిలియన్ డాలర్ల(రూ.2.53 లక్షల కోట్లు)కు చేరింది. 2017లో ఆయన ప్రపంచంలోనే 20వ అతిపెద్ద కుబేరుడిగా గుర్తింపు పొందారు. కాగా 2017 జనవరిలో ముఖేష్ ఆదాయం 22.70 బిలియన్లు(లక్షా 44 వేల కోట్లు)గా ఉంది. గతేడాది కుమార్ బిర్లా, అజీమ్ ప్రేమ్‌జీ, ఉదయ్ కొటాక్, విక్రమ్ లాల్, లక్ష్మీ మిట్టల్‌ల నికర సంపద వరుసగా 50.41 శాతం, 46.72 శాతం, 44.87 శాతం, 44.03 శాతం, 36.11 శాతం చొప్పున పెరిగింది. అదే విధంగా పల్లోంజీ మిస్త్రీ(నిర్మాణ రంగం), సైరస్ పునవల్లా(చిన్న పిల్లల వ్యాక్సిన్ల తయారీ), శివ్ నాడార్(ఐటీ, హార్డ్‌వేర్)ల నికర ధనం వరుసగా 27.01 శాతం, 16.50 శాతం, 15.83 శాతం చొప్పున పెరిగి వరుసగా 17.40 బిలియన్లు(లక్షా 10 వేల కోట్లు), 9.32 బిలియన్లు(రూ.59 వేల కోట్లు), 13.90 బిలియన్ల(రూ.88 వేల కోట్లు)కు చేరింది. మరోవైపు 2017 డిసెంబర్ 31 నాటికి ప్రపంచంలోనే అత్యంత కుబేరుడు జెఫ్ బెజోస్ సంపద 52 శాతం ఎగిసి 99 బిలియన్ల(రూ.6.28 లక్షల కోట్లు)కు చేరింది. జనవరి 2017లో ఆయన ఆదాయం 65 బిలియన్లు(రూ.4.12 లక్షల కోట్లు)గా ఉంది. ప్రపంచంలోనే అతిపెద్ద ఆన్‌లైన్ పోర్టల్ అమెజాన్‌కు బెజోస్ వ్యవస్థాపకులుగా ఉన్నారు. రెండు, మూడు స్థానాల్లో ఉన్న బిల్ గేట్స్, వారెన్ బఫెట్‌ల నికర ఆస్తులు వరుసగా 12 శాతం, 17 శాతం పెరిగి 91.8 బిలియన్లు(రూ.5.82 లక్షల కోట్లు), 85.3 బిలియన్ల(రూ.5.39 లక్షల కోట్లు)కు చేరింది.

ఇద్దరు రైతుల ఆత్మహత్యాయత్నం

నవతెలంగాణ-జగిత్యాల/కొల్చారం

తాతల కాలం నుంచి వారసత్వ సంపదగా వస్తున్న 23 గుంటల భూమిని తన పేర మార్చుకునే క్రమంలో రెవెన్యూ అధికారులకు రూ. లక్షన్నర లంచం ఇవ్వలేక...డబుల్ రోడ్డులో భాగంగా ఉన్న రెండెకరాలూ పోతుంటే తట్టుకోలేక...ఇద్దరు రైతులు ఆత్మహత్యాయత్నం చేసుకున్నారు. ఈ ఘటనలు జగిత్యాల, మెదక్ జిల్లాల్లో సోమవారం జరిగాయి. జగిత్యాల కలెక్టరేట్ వద్ద జరిగిన ఘటనలో పోలీసులు పక్కనే ఉన్నా పట్టించుకోకపోవటం దారుణం. స్థానిక రైతులు, బాధితుల వివరాల ప్రకారం... జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండల కేంద్రానికి చెందిన ఎమ్‌డీ మౌలానాకు అదే మండలంలోని చెప్యాలలో సర్వే నెంబర్ 48పీలో తాతల కాలం నుంచి వస్తున్న వారసత్వ సంపదగా 23 గుంటల భూముంది. నాలుగేండ్లుగా కొందరు కబ్జాదారులతో మౌలానాకు ఘర్షణ జరిగింది. ఈ నేపథ్యంలోనే పోలీసులకు, రెవెన్యూ అధికారులకు మౌలానా ఫిర్యాదు చేశాడు. అధికారులు పట్టించుకోలేదు. రెండ్రోజుల కింద తహసీల్దార్ రవీందర్‌రావు వద్దకెళ్లి ఆ భూమిని తన పేరా చేయాలని అర్జీ పెట్టుకున్నాడు. పని చేసి పెట్టేందుకు తహసీల్దార్ రూ.లక్ష డిమాండ్ చేశాడు. వీఆర్వో దగ్గరకు వెళ్తే అతనూ రూ.50 వేలివ్వాలన్నాడు. దీంతో ఉన్న భూమి పోతుందన్న బెంగతో ఇద్దరు అధికారులకు రూ.50 వేలను మౌలానా ముట్టజెప్పాడు. మిగతా లక్ష రూపాయలు తెస్తేనే పత్రాలు సవరిస్తామని ఆ ఇద్దరు అధికారులు చెప్పి పంపారు. దీంతో మౌలానా తన భార్యను వెంట తీసుకుని సోమవారం ప్రజావాణి కార్యక్రమానికి వెళ్లాడు. కార్యాలయం ఎదుటే ఒంటిపై కిరోసిన్ పోసుకున్నాడు. నిప్పంటించుకునేందుకు యత్నించగా పక్కనే ఉన్నవారు, అధికారులు అడ్డుకున్నారు. పోలీసులు మాత్రం మౌలానా సమస్యను పట్టించుకోకుండా వెళ్లిపోవడం గమనార్హం. మౌలానాను అధికారులు లోపలికి తీసుకెళ్లి అర్జీ తీసుకున్నారు. విచారణ జరిపి తహసీల్దార్‌పై, వీఆర్వోపై చర్యలు తీసుకుంటామని, సమస్యను పరిష్కరిస్తామని హామీనిచ్చారు.

బలవంత భూసేకరణ వద్దంటూ..

మెదక్ జిల్లా కొల్చారం మండలం పోతన్‌షెట్‌పల్లి శివారులోని ఏడుపాయల దేవస్థానానికి వెళ్లే మంజీరా పరివాహక ప్రాంతంలో అధికారులు బ్రిడ్జి నిర్మిస్తున్నారు. పోతన్‌షెట్‌పల్లి చౌరస్తా నుంచి బ్రిడ్జి నిర్మాణం వరకు రైతులు సాగు చేస్తున్న పంట పొలాల నుంచి డబుల్‌రోడ్డు నిర్మాణం కోసం అధికారులు సర్వేచేశారు. హద్దులు పాతారు. ఈ క్రమంలో అధికారులతో రైతులు వాగ్వాదానికి దిగారు. అయినప్పటికీ అధికారులు పట్టించుకోలేదు. ఎంత మొరపెట్టుకున్నా అధికారులు వినట్లేదని, తనకున్న రెండెకరాలు రోడ్డులో పోతే బతికేదెట్టా అని ఆవేదనతో అక్కడే పురుగుల మందు తాగాడు. స్పృహ తప్పి పడిపోయాడు. సకాలంలో అంబులెన్స్ రాకపోవడంతో అక్కడి రైతులు బైక్‌పై మెదక్ ఏరియాస్పత్రికి తరలించారు. ఆరోగ్యపరిస్థితి నిలకడగానే ఉందని వైద్యులు తెలిపారు. రోడ్డు నిర్మాణంలో 20 మంది రైతులు ఎకరం చొప్పును భూమిని కోల్పోతున్నారు. ప్రస్తుతం లక్షల రూపాయల పెట్టుబడులుపెట్టి బోర్లు వేసి సాగు చేశారు. రోడ్డు వేస్తే తాము ఎక్కడకు పోవాలని రైతులు ప్రశ్నిస్తున్నారు. పాత రోడ్డునే పునరుద్ధరించాలని బాధిత రైతులు డిమాండ్ చేశారు.

సర్పంచినీ వదలని వీడీసీ

మొదటిపేజీ తరువాయి

కక్షపెంచుకున్న పెత్తందారులు సర్పంచ్‌తో పాటు కుటుంబ సభ్యులను బహిష్కరించినట్టుగా ఈనెల 7న చాటింపు వేయించారు. గ్రామాల్లో జరిగే శుభకార్యాలకు కూడా పిలువొద్దని, ఎవరైనా దీన్ని ఉల్లంఘిస్తే రూ.5వేల జరిమానా చెల్లించాల్సిందిగా వీడీసీ తీర్మానించింది. దాంతో బాధితులు సోమవారం కలెక్టర్ రామ్మోహనరావు, పోలీస్ కమిషనర్ కార్తికేయను కలిసి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేపట్టి మీడియాతో తమ గోడును వెళ్లబోసుకున్నారు.

చట్టపరంగా చర్యలు తీసుకోవాలి :మమత- సర్పంచ్ బుస్సాపూర్

గురిడి కుల సంఘానికి భూములివ్వాలని ఒత్తిడి చేస్తూ తమను దూషించి, బహిష్కరణకు గురిచేసిన నాగంపేట్ శేఖర్‌రెడ్డి, అరుగుమీది మోహన్‌రెడ్డి, కొప్పెలవాలి గంగారెడ్డిపై కేసు నమోదు చేయాలి. సర్పంచ్‌కు సహకరించొద్దని నిర్ణయించిన వీడీసీపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి.

అట్రాసిటీ కేసు నేస్రె ం ఖీ చేయాలి
పెద్దివెంకట్రాములు- టీమాస్ జిల్లా కన్వీనర్

దళిత సర్పంచ్‌ను బహిష్కరించిన వీడీసీ, పెత్తందారులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలి. అవమానానికి గురైన దళిత కుటుంబానికి ఎస్సీ కమిషన్ నిబంధనల ప్రకారం రూ.2 లక్షలు అందజేయాలి. బహిష్కరణలు ఎత్తివేయంతో సరిపెట్టకుండా గ్రామాభివృద్ధి కమిటీలపై కఠిన చర్యలు తీసుకోవాలి.

పదిహేనో ఆర్థిక సంఘం ద్వారా అధిక నిధులు పొందుదాం.. సీఎస్ ఎస్పీ సింగ్

- పురోగతి ఆధారంగా రాష్ట్రాలకు ఇన్సెంటివ్ గ్రాంట్లు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

పదిహేనో ఆర్థిక సంఘం ద్వారా రాష్ట్రానికి అత్యధిక నిధులు పొందాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్పీ సింగ్ సూచించారు. ఇందుకనుగుణంగా వివిధ శాఖలు తమ ప్రతిపాదనలను రూపొందించి, ఆర్థికశాఖకు సమర్పించాలని ఆదేశించారు. సోమవారం సచివాలయంలో వివిధ శాఖల ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించిన సీఎస్.. పదిహేనో ఆర్థిక సంఘానికి సమర్పించాల్సిన నివేదిక, బడ్జెట్ ప్రతిపాదనలు, ఎస్సీ, ఎస్టీ ప్రత్యేక నిధుల వ్యయం, గణతంత్ర దినోత్సవంనాడు గవర్నర్ ప్రసంగం, వివిధ శాఖల సమాచారం తదితరాంశాలపై చర్చించారు. ఆర్థిక సంఘం 2019 అక్టోబరు 30 నాటికి కేంద్రానికి నివేదిక సమర్పిస్తుందని తెలిపారు. ఈ క్రమంలో వచ్చే ఏప్రిల్ నుంచి వివిధ రాష్ట్రాల్లో పర్యటిస్తుందని అన్నారు. అందువల్ల అన్ని శాఖలు ఫిబ్రవరి 7 లోపు విధిగా తమ ప్రతిపాదనలను పంపించాలని ఆదేశించారు. కేంద్ర ఆర్థిక సంఘం తొలిసారిగా రాష్ట్రాల పురోగతిని దృష్టిలో ఉంచుకుని ఇన్సెంటివ్ బేస్‌డ్ గ్రాంట్లను ఇవ్వనుందని తెలిపారు. ఇందుకోసం కొన్ని అంశాలను ప్రాతిపదిగ్గా తీసుకుంటుందని వివరించారు. ఈ అంశాలపై రాష్ట్రానికి సంబంధించి ప్రత్యేకంగా నివేదికలు రూపొందించాలని సూచించారు.

ప్రతిపాదనల సమర్పణకు 15 తుది గడువు...

రాబోయే ఆర్థిక సంవత్సరాని(2018-19)కి సంబంధించిన బడ్జెట్ ప్రతిపాదనల సమర్పణకు ప్రభుత్వం గడువును పొడిగించింది. తొలుత సోమవారం నాటికే వీటిని సమర్పించాలంటూ సూచించిన ఆర్థికశాఖ.. ఈ గడువును ఈనెల 15 వరకు పొడిగిస్తూ నిర్ణయం తీసుకుంది. ప్రతిశాఖలో పనిచేస్తున్న ఉద్యోగుల వివరాలను సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ (సీజీజీ) పోర్టల్‌లో ఉంచామని ఆర్థికశాఖ ముఖ్య కార్యదర్శి రామకృష్ణారావు ఈ సందర్భంగా తెలిపారు. వాటిని సరిచూసుకుని, ఏమైనా తేడాలుంటే వెంటనే తెలపాలని కోరారు.

హీరో నితిన్ ఫ్యామిలీపై కేసు కొట్టివేత

నవతెలంగాణ-హైదరాబాద్

అఖిల్ సినిమా హక్కులు ఇవ్వలేదంటూ తెలుగు సినిమా హీరో నితిన్,ఆయన సోదరిపై నమోదైన కేసును హైకోర్టు కొట్టేస్తూ తీర్పు చెప్పింది. హీరో నితిన్, ఆయన సోదరి నిఖితారెడ్డిలపై అభియోగాలను కొట్టివేస్తూ హైకోర్టు న్యాయ మూర్తి ఎం.సత్య నారాయణ మూర్తి ఇటీవల తీర్పు చెప్పారు. అఖిల్ అనే సినిమా హక్కుల కోసం తమ వద్ద రూ.50 లక్షలు తీసుకుని ఇవ్వలేదంటూ స్థానిక సైనిక్‌పురి కాలనీకి చెందిన గంగాధర సత్యనారాయణ మల్కాజిగిరిలోని 20వ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టులో 2017 సెప్టెంబర్‌లో కేసు వేశారు. ఈ కేసులో వరసగా శ్రేష్ట మూవీస్, నిర్మాత అయిన నితిన్ తండ్రి సుధాకర్‌రెడ్డిలపై, నిఖిత, అఖిల్‌లు నిందితులుగా చేర్చిన కేసులో కోర్టు సమన్లు జారీ చేసింది. శ్రేష్ట మూవీస్ సుధాకర్‌రెడ్డికి సంబంధించినదని, తమపై కావాలని కేసు పెట్టారని నితిన్, నిఖితల వాదనను హైకోర్టు ఆమోదించింది.

కోర్టుకు వచ్చిన అభ్యర్థులకు మాత్రమే అనుమతి

ఉపాధ్యాయ నియామకాల పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు డిగ్రీ ఓపెన్ క్యాటగిరీలో 45 శాతం, ఎస్సీ,ఎస్టీ,బీసీ,వికలాంగ రిజర్వేషన్ల కేటగిరీల్లో 40 శాతం మార్కులు పొందిన వారి దరఖాస్తులను అనుమతించాలని తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌ను హైకోర్టు రెండు రోజుల క్రితం మధ్యంతర ఆదేశాలిచ్చింది.

రచనారెడ్డి తండ్రిపై కేసు నమోదు..కోర్టులో విచారణ

కామారెడ్డి జిల్లా నాగిరెడ్డిపేట తహసీల్దార్ మంత్రనాయక్‌ను ఎస్టీ కులస్తుడంటూ తిట్టారన్న కేసులో చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని హైకోర్టు న్యాయమూర్తి ఎం.సత్యనారాయణమూర్తి ఇటీవల ఆ జిల్లా పోలీసులకు ఆదేశాలు జారీ చేశారు. సి.ఆర్.పి.సి. సెక్షన్ 41ఎ కింద ఆరోపణలు ఎదుర్కొనేవారికి నోటీసులిచ్చి వివరణ స్వీకరణ తర్వాతే చర్యలు ఉండాలని స్పష్టం చేశారు.

సెన్సెక్స్ ▲184	నిఫ్టీ ▲54	డాలరుకు రూపాయి విలువ	బంగారం(10.గ్రా)	వెండి (కేజీ)
34,153	10,558	63.37	రూ. 30,160	రూ. 41,700





కోడిగుడ్లు

హైదరాబాద్	368	విజయవాడ	374
ఒక్కగుడ్డుకు	4.30	చెన్నై	397
వరంగల్	370	ముంబయి	410



కార్డు లావాదేవీ(లై ఛార్జీ(ు తగ్గించాలి

- బ్యాంకులకు చమురు కంపెనీల సూచన



ముంబయి : కార్డుల ద్వారా జరిగే పెట్రోల్, డీజిల్ ఉత్పత్తుల కొనుగోళ్లపై లావాదేవీల చార్జీలను తగ్గించాలని చమురు కంపెనీలు బ్యాంకులను కోరాయి. సోమవారం బ్యాంకులతో జరిగిన చమురు సంస్థల భేటీలో ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్, భారత్ పెట్రోలియం, హిందుస్థాన్ పెట్రోలియం ఈ ప్రతిపాదన చేశాయి. ఈ అంశంపై వచ్చే జనవరి 8న మరోసారి భేటీ కావాలని నిర్ణయించాయి. ఇప్పటికే చెల్లిస్తున్న ఛార్జీల కంటే తాము ఎక్కువగా చెల్లించలేమని చమురు కంపెనీలు స్పష్టం చేశాయి.. ప్రస్తుత నిబంధనల ప్రకారం ఈ ఛార్జీలు ఎక్కువగా ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశాయి. ఈ ఛార్జీలను మరింత తగ్గించాల్సిన అవసరం ఉందని చమురు కంపెనీల ప్రతినిధి ఒక్కరు తెలిపారు.

వినియోగదారులు విసా, మాస్టార్ ఇతర డెబిట్ కార్డులతో జరిపే లావాదేవీలపై మర్చంట్ డిస్కౌంట్ రేటు (ఎండిఆర్) పేరుతో బ్యాంకులు చమురు కంపెనీల నుంచి రుసుం వసూలు చేస్తున్నాయి. నిబంధనల ప్రకారం గత డిసెంబర్ 31 వరకు రూ.1,000లోపు లావాదేవీలపై ఎండిఆర్ 0.25 శాతంగా ఉంది. రూ.1,000 నుంచి రూ.2,000 చెల్లింపులపై 0.5 శాతం, అపై విలువ చేసే అధిక చెల్లింపులపై 1 శాతం ఛార్జీలు వసూలు చేస్తున్నాయి.

నేడు ఎన్ఎండిసిలో వాటా విక్రయం

ముంబయి : దేశంలోనే అతిపెద్ద ముడి ఇనుప ఖనిజం ఉత్పత్తిదారు ఎన్ఎండిసిలో మంగళవారం 1.5 శాతం వాటాను ప్రభుత్వం ఉపసంహరించుకోనుంది. ఈక్విటీ కనీస ధర రూ.153.50గా నిర్ణయించింది. ఆఫర్ ఫర్ సేల్ (ఒఎఫ్ఎస్) ద్వారా ప్రభుత్వం ఈ వాటాను ఉపసంహరించుకోనుంది. తొలి రోజు ఇన్‌స్ట్యూషనల్ ఇన్వెస్టర్స్‌కు అవకాశం కల్పించగా, బుధవారం రిటైల్ ఇన్వెస్టర్లకు ఈక్విటీలను కేటాయించనుంది. ఈ 1.5 శాతం వాటా విక్రయం ద్వారా రూ.750 కోట్లు సమీకరించుకోవాలని కేంద్రం నిర్దేశించుకుంది.

ఐఐఎంబి నుంచి 'మహిళా స్టార్టప్'



బెంగళూరు : ఎన్ఎస్ రాఘవన్ సెంటర్ ఫర్ ఎంటర్‌ప్రిన్యూరల్ లెర్నింగ్ (ఎన్ఎస్ఆర్సిఇఎల్) దేశ వ్యాప్త 'వుమెన్ స్టార్టప్ ప్రోగ్రామ్ (డబ్ల్యు ఎస్‌పి)'ను ప్రారంభించినట్లు ఒక ప్రకటనలో తెలిపింది. సోమవారం బెంగళూరులో ఇండియన్ ఇన్‌స్ట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ బెంగళూరు (ఐఐఎంబి) మొదలుపెట్టిన ఈ కార్యక్రమానికి గోల్డ్‌మాన్ సాచే నిధులు సమకూరుస్తుండగా, సైన్స్ అండ్ టెక్నలాజీ శాఖ, భారత ప్రభుత్వం మద్దతునిస్తున్నట్లు ప్రకటించాయి. వచ్చే కొద్ది ఏళ్లలో 12,000 వేల మంది మహిళలకు ఇందులో శిక్షణ ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

ఈ-వే బిల్లు ట్రయల్‌కు నో

● వ్యతిరేకిస్తున్న వ్యాపార సంఘాలు ● నేడు ఢిల్లీలో అత్యవసర సమావేశం ● మొన్నటివరకూ జీఎస్టీ... ఇపుడు ఈవే బిల్లు

జీఎస్టీ కష్టాలు తీరకముందే.. మోడీ సర్కారు కొత్త పన్ను విధానం (ఈవే బిల్లును) తెరపైకి తేవాలనుకుం టున్నది. నోట్ల రద్దుతో వ్యాపారరంగమంతా చెల్లాచెదురైతే.. జీఎస్టీతో దేశ ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నమైందన్న కఠోరవాస్తవాలు వెలుగులోకి వస్తున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో ఈవే బిల్లులు వ్యాపారులు, వినియోగదారులకూ భారమవుతాయని వ్యాపారసంఘాలు అంటున్నాయి. కేంద్ర ప్రభుత్వం మాత్రం ఎలాగైనా ఈ నెల 15 నుంచి ఈ-వే బిల్లు ట్రయిల్ రన్ చేయాలని భావిస్తోంది. అయితే ఈ ప్రతిపాదనను వ్యాపారసంఘాలన్నీ వ్యతిరేకిస్తున్నాయి. కొన్నాళ్లు వాయిదా వేసుకోవాలని కోరేందుకు.. మంగళవారం ఢిల్లీలో అత్యవసర సమావేశాన్ని నిర్వహించాలని నిర్ణయించాయి.

- నవతెలంగాణ బిజినెస్ డెస్క్



నిన్న జీఎస్టీ రిటర్న్ ఫైయిలింగ్ కష్టాలు..ఇపుడు ఈ వేబిల్లులకు ప్రభుత్వం రంగం సిద్ధం చేసింది. ఈ-వే బిల్లును 15 నుంచి ట్రయల్‌గా ప్రారంభించటానికి వ్యాపారులు, ట్రేడర్స్ నిరాకరిస్తున్నారు. జీఎస్టీలో సాంకేతికపరమైన అంశాలు ముడిపడిఉన్నాయి. ఈలోపు ఈ-వే బిల్లు ప్రతిపాదనను తాత్కాలికంగా వాయిదా వేయాలని వారు కోరుతున్నారు. ఈ-వే బిల్లు విధానాన్ని ఫిబ్రవరిలో కాకుండా ఏప్రిల్ వరకు గడువు పెంచాలని ప్రతిపాదిస్తున్నారు. కానీ మోడీ ప్రభుత్వం మాత్రం ఎలాగైనా ట్రయల్ రన్ చేయాలని మొండిపట్టుపడుతోంది.

15నుంచి ఈ-వే బిల్లు ట్రయల్..

ఫిబ్రవరి ఒకటి నుంచి ఈ-వే బిల్లు అమల్లోకి రానున్నది. ఈ బిల్లు పారదర్శకంగా రెండు విధాలుగా తీసుకుని రావాలని కేంద్రం భావిస్తోంది.అంతర్రాష్ట ఈ-వే బిల్లుపై ఫిబ్రవరి ఒకటిన డెడ్‌లైన్ పెట్టింది.మరో వైపు ఇంట్రా స్టేట్ ఈ-వే బిల్లు ఈ ఏడాది జూన్ నుంచి అమల్లోకి తేవాలని కేంద్రం నిర్ణయించింది. అయితే నిర్దేశిత గడువు కన్నా లోపు ఈనెల 15 ఈ-వే బిల్లును ట్రయల్ రన్ నిర్వహించేలా మోడీ సర్కారు ప్రణాళిక తయారు చేసింది. ఈ విధానం అమలు చేయటం వల్ల పన్ను చోరీని అరికట్టడం సులువవుతుందని సర్కార్ భావిస్తోంది.

వ్యాపారులను వెంటాడుతున్న భయం..

కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ట్రేడర్స్(సీఏఐటీ) జనరల్ సెక్రెటరీ ఖండేల్‌వాల్ మాట్లాడుతూ.. ఈ-వే బిల్లు గురించి వ్యాపార వర్గాల్లో ఆందోళన ఉన్నదని తెలిపారు. ఇప్పటికే రిటర్న్ దాఖలు చేసే విషయంలో నానా ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. నెలవారీ రిటర్న్లు దాఖలు చేస్తుంటే..రోజూ కోట్ల సంఖ్యలో ఈ-వే బిల్లులు జనరేట్ అవుతాయి.ఇలాంటి పరిస్థితిలో పారదర్శకత పేరుతో మోడీ సర్కారు తేవాలనుకుంటున్న కొత్త విధానం సరిగా పనిచేస్తుందా..అనే అనుమానాలను వ్యాపార వర్గాలు వ్యక్తం చేశాయి.

నేడు వ్యాపారుల అత్యవసర సమావేశం

మెటల్ అండ్ స్టయిల్‌నెస్‌స్టీల్ మర్చంట్ అధ్యక్షుడు జితేంద్ర షా మాట్లాడుతూ..దేశ వ్యాప్తంగా అన్ని వ్యాపార సఘాలు జీఎస్టీ గురించి అన్ని విధాలుగా ఇబ్బందుల్లో ఉన్నారని తెలిపారు.

ఈ విషయంపైనే చర్చించటానికి మంగళవారం సమావేశాన్ని ఏర్పాటు చేసినట్టు చెప్పారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఈ-వే బిల్లును అమలు,లిమిట్ పెంపు,జీఎస్టీ పోర్టర్‌లో వస్తున్న కష్టాలు,ఏపీఎమ్‌సీ సెస్సు తొలగింపు,బ్రాండెడ్ ఫుడ్‌పై జీఎస్టీ భారం తదితర అంశాలను చర్చించనున్నారు.

అవసరమైతే సమ్మెకు పోదాం..ట్రేడర్స్

సదర్ బజార్ అసోసియేషన్ సెక్రెటరీ తారాచంద్ మాట్లాడుతూ జీఎస్టీ పోర్టర్ రిటర్న్ దాఖలు,రిఫండ్ అంశాలపై ట్రేడర్స్ ఊపిరి సలపనంత బిజీగా ఉన్నారని తెలిపారు. ఈ-వే బిల్లులతో సమస్యలు ఎదురైతే..దాని ప్రభావం నేరుగా ఉత్పాదక రంగంపై పడుతుంది. ఇలాంటి పరిస్థితుల్లో ట్రేడర్స్,వ్యాపారులు భవిష్యత్తు ఆందోళనకరంగా మారనున్నది వివరించారు. తమ సమస్యను పరిష్కరించటానికి అవసరమైతే సమ్మెకు సిద్ధమేనని ఆయన స్పష్టం చేశారు.

ఈ-వే బిల్లు లిమిట్ పెంచాలి..

సీఏఐటీ జనరల్ సెక్రెటరీ ప్రవీణ్ ఖండేల్‌వాల్ మాట్లాడుతూ.. ఈ-వే బిల్లు లిమిట్ (50వేలు)చాలా తక్కువగా నిర్ధారించారు.దీన్ని మూడు లక్షల వరకు పెంచాలి. తక్కువ ధర కలిగిన వస్తువు(లక్ష నుంచి పదిలక్షల వరకు)లు సులువుగా అమ్మటానికి వీలవుతుంది.అలానే వ్యాపారులపై డాక్యుమెంటేషన్ కూడా తలనొప్పిగా మారనున్నది. అలానే ఈవే బిల్లులో ట్రాన్స్‌పోర్టులను పెంచాల్సిన అవసరమున్నదని వివరించారు.

ఓపెల్ లైటింగ్ ట్రేడ్ సదస్సు..



హైదరాబాద్ : ప్రముఖ లైటింగ్ సొల్యూషన్స్ కంపెనీ ఒపెల్ ఆల్ ఇండియా ట్రేడ్ పార్ట్‌నర్స్ సదస్సును నిర్వహించింది. హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి వంద పైగా భాగస్వాములు హాజరయ్యారని ఒపెల్ ఇండియా హెడ్ రాంబో జాంగ్ పాల్గొని అత్యధిక అమ్మకాలు చేసిన వారికి అవార్డులను అందించారు.

మార్కెట్ల కొత్త రికార్డులు..

ముంబయి : వరుసగా రెండో సెషన్‌లోనూ దేశీయ స్టాక్ మార్కెట్లు దూకుడును ప్రదర్శించాయి. డిసెంబర్‌తో ముగిసిన త్రైమాసికంలో కార్పొరేట్ కంపెనీలు మెరుగైన ఆర్థిక ఫలితాలు ప్రకటించనున్నాయనే అంచనాలకు తోడు అంతర్జాతీయ మార్కెట్ల ర్యాలీ విశ్వాసంతో సోమవారం మదుపర్లు భారీ కొనుగోళ్లకు మొ గ్గు చూపారు. దీంతో సెన్సెక్స్, నిఫ్టీలు పరుగులు పెట్టాయని బ్రోక ర్లు తెలిపారు. బిఎస్ఇ సెన్సెక్స్ 198.94 పాయింట్లు పెరిగి రికా ర్డు స్థాయిలో 34,352.79కి చేరింది. ఎన్ఎస్ఇ నిఫ్టీ 64.75 పాయింట్లు రాణించి 10.62 3.60 గరిష్ఠ స్థాయి వద్ద ముగిసిం ది. బిఎస్ఇలో రంగాల వారిగా ఐటి సూచీ 1.4 శాతం, కాపిటల్ గూడ్స్ 1.22 శాతం, వైద్య 1.2 శాతం, రియాల్టీ 0.87 శాతం చొప్పున పెరిగి మార్కెట్లకు దన్నుగా నిలిచాయి. సెన్సెక్స్‌లో కోల్ ఇండియా 3.26 శాతం, ఇన్ఫోసిస్ 2.33 శాతం, సన్‌ఫార్మా 2.28 శాతం, ఎల్అండ్‌టి 1.8 శాతం, హీరో మోటో కార్ప్ 1.37 శాతం చొప్పున అధిక లాభాలు సాధించిన వాటిలో ముందు వరుసలో ఉన్నాయి.

పెట్టుబడి పథకంపై తరజ్జభర్జన

- ప్రభుత్వానికి ఝలక్‌లిస్తున్న బ్యాంకులు
- రైతులకు నేరుగా అందజేసేందుకు మొగ్గు



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఎకరానికి రూ. 4వేల చొప్పున నగదు ఇవ్వబోయే 'పంట పెట్టుబడి పథకం'పై రాష్ట్ర ప్రభుత్వం తర్జనభర్జన పడుతున్నది. నేరుగా ఇవ్వాలా? బ్యాంకుల ద్వారా అందించాలా? అన్నదానిపై స్పష్టత రాలేకపోయింది. బ్యాంకుల వల్ల అపోహలుంటే పోస్టల్ శాఖ సహాయంతో అందించేందుకు క్యాబినెట్ సబ్‌కమిటీ మొగ్గుచూపింది. వ్యవసాయ శాఖ మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డి అధ్యక్షతన ఏర్పాటైన క్యాబినెట్ సబ్‌కమిటీ సమావేశం సోమవారం సచివాలయంలో సమావేశమైంది. రైతులకు పెట్టుబడి కింద ఎకరానికి ఇవ్వాలనుకున్న అంశంపై చర్చ జరిగింది. రెవెన్యూ రికార్డుల ప్రక్షాళన తర్వాత కేటగిరి ఏ కింద రాష్ట్ర వ్యాప్తంగా 71, లక్షల 75వేల రైతు ఖాతాలున్నట్టు ప్రభుత్వం గుర్తించింది. రైతులకు ఏవిధంగా అయితే నేరుగా పెట్టుబడి అందుతుందో సలహాలు, సూచనలు, అభిప్రాయాలు వెల్లడించాలని కోరింది. గతంలో నాలుగు దఫాలుగా రుణమాఫీ డబ్బులు రైతుల ఖాతాల్లో జమ చేసిన విషయం తెలిసిందే. రుణమాఫీపై ఇప్పటికీ స్పష్టత రాలేదు. రుణమాఫీ పూర్తయిందని, రైతులు రుణ విముక్తులయ్యారని ప్రభుత్వం చెబుతున్నది. కానీ కింది స్థాయిలో రైతులు ఇంకా బకాయిలున్నారని బ్యాంకు అధికారులు పేర్కొంటున్నారు. పాసు పుస్తకాలు కూడా బ్యాంకుల్లోనే ఉన్నాయని సమాచారం. ఈ నేపథ్యంలో పెట్టుబడి నిధులు సదరు బ్యాంకుల్లో జమ చేస్తే రైతులకు చేరతాయా లేక బ్యాంకులు అప్పుల కింద జమ చేసుకుంటాయా అనే అనుమానాలు వ్యక్తం అయ్యాయి. ఈ విషయంపై బ్యాంకర్లు స్పష్టత ఇవ్వకుండా ఆలోచించుకొని చెబుతామని చెప్పడంతో సందిగ్ధత నెలకొంది. దీనిపై అనేక అనుమానాలు తలెత్తుతున్నాయి. దీంతో క్యాబినెట్ సబ్ కమిటీ ఈ నెల 10న మరోసారి భేటీ కావాలని నిర్ణయించింది. ఈ లోగా వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిలో వెళ్లి పెట్టుబడి కింద ఇచ్చే రూపాయలు ఏ విధంగా చెల్లిస్తే బాగుంటుంది అనే అంశంపై రైతుల అభిప్రాయ సేకరణ చేపట్టాలని నిర్ణయం తీసుకుంది. ఉపాధి హామీ పథకం కింద కూలీలకు పోస్టాఫీసుల ద్వారా చెల్లిస్తున్నాయి. ఎక్కువ శాతం మంది రైతులు బ్యాంకుల మీద విశ్వసనీయత లేకపోవడంతో పోస్టాఫీసు ద్వారా ఇవ్వాలని కోరుతున్నట్టు తెలిసింది. అన్ని గ్రామాల్లో పోస్టాఫీసులు అందుబాటులో ఉంటాయి కనుక ఎక్కువ మంది రైతులు ఆసక్తి చూపిస్తున్నట్టు తెలిసింది. అంతే కాకుండా సహకార సంఘాల ద్వారా కూడా చెల్లించవచ్చనే అభిప్రాయం కూడా చర్చకొచ్చినట్టు తెలిసింది. దీనిపై క్యాబినెట్ సబ్ కమిటీ సభ్యులు ఏకాభిప్రాయానికి వచ్చారు. గ్రామ సభలు నిర్వహించి, రైతులు, ప్రజా ప్రతినిధుల అభిప్రాయాలు తెలుసుకోవాలని నిర్ణయం తీసుకున్నారు. ఈ సమావేశంలో పోచారం తోపాటు రాష్ట్ర మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, టి. హరీశ్‌రావు, ఈటెల రాజేందర్, కేటీఆర్, ప్రభుత్వ సలహాదారు రాజీవ్‌శర్మ, వ్యవసాయ శాఖ ముఖ్య కార్యదర్శి సి. పార్థసారధి, కమిషనర్ జగన్‌మోహన్, టెస్కాబ్ చైర్మెన్ కొండూరు రవీందర్‌రావు, రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల కమిటీ ప్రతినిధులు, పోస్టల్ డిపార్టుమెంట్ సీజీఎమ్, వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.

ఆమోదయోగ్యమైన నిర్ణయం తీసుకుంటాం
వ్యవసాయ శాఖ మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డి

రైతులకు పెట్టుబడి కింద వానకాలం రూ. 4వేలు, యాసింగుకు రూ. 4వేల చొప్పున ఎకరానికి రూ. 8 రైతులకు ఏ విధంగా అందజేయాలనేదానిపై కసరత్తు చేస్తున్నామని వ్యవసాయ శాఖ మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డి చెప్పారు. రైతులకు నేరుగా డబ్బులు ఇచ్చే ఆలోచనను పరిశీలించామన్నారు. బ్యాంకర్లతోనూ మరోసారి మాట్లాడుతామని చెప్పారు. అవినీతికి తావు లేకుండా, నిధులు దుర్వినియోగం కాకుండా ఉండాలనేది ప్రభుత్వ ఉద్దేశమన్నారు. అయితే సోమవారం జరిగిన క్యాబినెట్ సబ్ కమిటీ సమావేశంలో అనేక అభిప్రాయాలు రావడంతో మరోసారి సమావేశం భేటీ కావాలని నిర్ణయం తీసుకున్నామన్నారు. రైతులు, అధికారులు, బ్యాంకర్లు, సహకార సంఘాల ప్రతినిధులతో సమాలోచనలు చేసిన అనంతరం అందరికీ ఆమోదయోగ్యమైన నిర్ణయం తీసుకుంటామని వెల్లడించారు.


హన్మంతరావు సేవలు అమూల్యం

ఆయన సలహాలు సర్కార్ పట్టించుకోకపోవటం విచారకరం :

ఎన్డీఆర్ఏ మాజీ సభ్యుడు మర్రి శశిధర్‌రెడ్డి ● పలువురు విశ్రాంత ఇంజినీర్ల నివాళి

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి

ప్రముఖ ఇంజినీర్ దివంగత టి. హన్మంతరావు సూచనలు అమూల్యమైనవని అయితే రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోక పోవటం విచారకరమని జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ మాజీ సభ్యుడు మర్రి శశిధర్‌రెడ్డి అన్నారు. దివంగత హన్మంతరావు ప్రథమ వర్ధంతి సందర్భంగా స్థానిక ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజనీర్స్ ఆడిటోరియంలో జరిగిన సంస్మరణ కార్యక్రమంలో పలువురు మాట్లాడారు. పలువురు విశ్రాంత ఇంజనీర్లు, హన్మంతరావు అనుచరులు, కుటుంబ సభ్యులు ఆయనకు ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా శశిధర్‌రెడ్డి మాట్లాడుతూ గోదావరి జలాలను వినియోగించుకోవటం ద్వారా తెలంగాణను సస్యశ్యామలం చేయటానికి హన్మంతరావు పలు సూచనలు చేశారని ఆయన గుర్తు చేశారు. గోదావరి ప్రాజెక్టుల రీడిజైనింగ్ కోసం ఆయన పలు సూచనలు చేశారని, కాళేశ్వరం వంటి భారీ ఎత్తిపోతల పథకంలో నీటిని నిల్వ చేసే భారీ రిజర్వాయర్లు అవసరం లేదన్నారని తెలిపారు. ఎత్తిపోతల పథకాల్లో ప్రపంచంలో ఎక్కడా భారీ రిజర్వాయర్ల నిర్మాణం జరగలేదని పలు ఉదాహరణలు కూడా హన్మంతరావు చెప్పారని అన్నారు. రాయలసీమలో రిజర్వాయర్లు అవసరమని హన్మంతరావు చెప్పటాన్ని తెలంగాణ నేతలు విమర్శించారని, వారి విమర్శలకు కూడా ఆయన ధీటైన సమాధారం చేప్పారన్నారు. నీటి లభ్యత తక్కువగా ఉండే ప్రాంతంలో రిజర్వాయర్లు అవసరమని, నీటి లభ్యత కాలం, పంటల కాలం ఒకటైనప్పుడు ఎత్తిపోతల ద్వారా నేరుగా నీరందించే అవకాశం ఉందని హన్మంతరావు వివరించారని తెలిపారు. హర్యానాలోని జవహర్‌లాల్ నెహ్రూ ఎత్తిపోతల పథకంలో భాగంగా ఎటువంటి భారీ రిజర్వాయర్లు నిర్మించలేదనే విషయం ఆయన చెప్పిన తర్వాత తాను మీడియా మిత్రులతో కలిసి ఆ ఎత్తిపోతల పథకాన్ని సందర్శించినట్టు శశిధర్‌రెడ్డి తెలిపారు. భారీ ప్రాజెక్టుల నిర్మాణంతో కరువు నివారించవచ్చనే వాదన కూడా పూర్తిగా సమర్థించలేమన్నారు. దీనికి మహారాష్ట్ర ఒక ఉదాహరణగా చెప్పారు. నదీ జలాల వినియోగంలో దేశంలోనే ప్రథమ స్థానంలో ఉన్న మహారాష్ట్రలో రైతులు ఆత్మహత్యల్లో కూడా ప్రథమ స్థానంలో ఉన్నదని, తెలంగాణ ద్వితీయ స్థానంలో ఉన్నదని అన్నారు. హన్మంతరావు ప్రతిపాదించిన చతుర్విధ జలప్రక్రియ ద్వారా వర్షపు నీటిని ఎక్కడికక్కడ ఒడిసి పట్టుకుని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారని తెలిపారు. తక్కువ ఖర్చుతో జలవనరులను నిర్మించటం ద్వారా రాజస్థాన్ ఎడారి ప్రాంతంలో కూడా జలసిరులు ఉప్పొంగే విధంగా హన్మంతరావు చేసిన కృషిని ఆయన కొనియాడారు. దేశంలో వర్షాభావ ప్రాంతంలో ఉన్న 14 కోట్ల హెక్టార్ల భూమిని ఎకరానికి కేవలం రూ. 5 వేలతో చతుర్విధ జలప్రక్రియ ద్వారా మూడు పండలు పండే విధంగా మార్చ వచ్చన్నారు. ఈ ప్రక్రియ కోసం రూ. 2,14,000 కోట్లు ఖర్చవుతుందని చెప్పారు. రాజస్థాన్‌లో చతుర్విధ జలప్రక్రియను అమలు చేస్తున్న హన్మంతరావు అనుచరుడు ఎండీ అఫ్సర్ మాట్లాడుతూ చతుర్విధ జలప్రక్రియ మొదట రెండు జిల్లాల్లో ప్రారంభమై ఇప్పుడు రాజస్థాన్ అంతటా విస్తరించిందన్నారు. డాక్టర్ రాజశేఖరెడ్డి హయాంలో సీఎం కార్యాలయ అధికారిగా పనిచేసిన ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ కృష్ణా జలాల వినియోగం సక్రమంగా జరగాలంటే బేసిన్‌లోని అన్ని రాష్ట్రాలనూ బోర్డు పరిధిలోకి తేవాలని హన్మంతరావు సూచించారని తెలిపారు. గోదావరి నదిపై చిన్న బ్యారేజీల ఆవస్యకత గురించి హన్మంతరావు పదే పదే చెప్పారని తెలంగాణ జలసాధన సమితి నాయకుడు నైనాల గోవర్ధన్ అన్నారు. మాజీ శాసనసభ్యుడు మాదాసు గంగాధరం, నిజామాబాద్ ఎమ్మెల్యే బి. గణేశ్, హుస్సేన్, టి. మదుసూదన్, అనూరాధారెడ్డి, పశ్య పద్మ తదితరులు హన్మంతరావు సేవలను కొనియాడారు. హన్మంతరావు కుటుంబ సభ్యులు కూడా తమ అనుభవాలను వివరించారు.



హన్మమంతరావు కుటుంబ సభ్యులు

హన్మంతరావు స్మారక గోల్డ్ మెడల్స్...

తెలుగు రాష్ట్రాల్లోని ప్రముఖ ఇంజినీరింగ్ కళాశాలల్లో అసాధారణ ప్రతిభ కనపరచిన విద్యార్థులకు హన్మంతరావు స్మారక బంగారు పతకాలను ప్రతియేటా అందిస్తామని హన్మంతరావు కుమారుడు మధుసూదన్ తెలిపారు. మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీర్స్ ఆధ్యర్యంలో ఈ బంగారు పతకాలను అందచేస్తా మని, హైదరాబాద్‌లోని ఐఐటీ, కాకినాడ జెఎన్‌టీయూ, వరంగల్‌లోని నిట్, తిరుపతిలోని వెంకటేశ్వర యూనివర్సిటీల్లో ఈ బంగారు పతకాలను ఇస్తామని తెలిపారు. ప్రతియేటా హన్మంతరావు స్మారక ఉపన్యాసాన్ని కూడా నిర్వహించటానికి ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీర్స్ అంగీకరించిందని చెప్పారు. హన్మంతరావు అమలు చేసిన చతుర్విధ జల ప్రక్రియను ఇంజినీరింగ్ విద్యార్థులకు పాఠ్యాంశంగా బోధించటానికి ప్రయత్నిస్తా మన్నారు. ఈ ప్రక్రియను అధ్యయనం చేయటా నికి విద్యార్థులను ఫీల్డ్‌కు తీసుకు వెళ్తామని వివరించారు.

టీఆర్టీకి 2,77,574 దరఖాస్తులు

ఎస్ఏకు 1,45,158, ఎస్జీటీకి 89,149

- నేటినుంచి వివరాలు సవరణలకు అవకాశం
- టీఎస్‌పీఎస్సీ వెల్లడి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఉపాధ్యాయ నియామక పరీక్ష (టీఆర్టీ) రాతపరీక్షలకు రాష్ట్రవ్యాప్తంగా 2,77,574 దరఖాస్తులొచ్చాయి. ఇందులో స్కూల్ అసిస్టెంట్ (ఎస్ఏ)కు 1,45,158 మంది, సెకండరీ గ్రేడ్ టీచర్స్ (ఎస్జీటీ)కి 89,149 మంది, భాషా పండితులు (ఎల్‌పి)కి 24,219 మంది, స్కూల్ అసిస్టెంట్ (ఫిజికల్ ఎడ్యుకేషన్)కు 2,177 మంది, ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్స్ (పీఈటీ)కి 16,871 మంది చొప్పున మొత్తం 2,77,574 మంది దరఖాస్తు చేశారు. ఈ మేరకు తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ) కార్యదర్శి ఎ వాణీప్రసాద్ సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఆదివారం అర్ధరాత్రితో టీఆర్టీకి దరఖాస్తు చేసే గడువు ముగిసిన విషయం తెలిసిందే. పాత పది జిల్లాల ప్రాతిపదికన 8,792 ఉపాధ్యాయ నియామకాలకు 2017, అక్టోబర్ 21న టీఆర్టీ నోటిఫికేషన్ విడుదలైంది. ఆన్‌లైన్ దరఖాస్తుల దాఖలులో అభ్యర్థులు వారి వివరాలను భర్తీ చేయడంలో కొన్ని తప్పులు చేశారని తెలిపారు. బయోడేటా, ఇతర వివరాలు సవరణ కోసం మంగళవారం ఈనెల 11వ తేదీ వరకు టీఎస్‌పీఎస్సీ వెబ్‌సైట్ ద్వారా అవకాశముందని పేర్కొన్నారు. సరైన వివరాలతో దరఖాస్తు చేయడం అభ్యర్థుల బాధ్యత అని తెలిపారు. వివరాలు సరిచేసుకునేందుకు, తప్పులను సరిదిద్దుకునేందుకు అవకాశం కల్పించామని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని అభ్యర్థులందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాలకు టీఎస్‌పీఎస్సీ వెబ్‌సైట్‌ను సంప్రదించాలని కోరారు.

ఫిబ్రవరి 24 నుంచి 28 వరకు రాతపరీక్షలు

టీఆర్టీ దరఖాస్తుల వివరాలు

పోస్టు	దరఖాస్తులు
ఎస్ఏ	1,45,158
ఎస్జీటీ	89,149
ఎల్‌పీ	24,219
ఎస్ఏ(పీఈ)	2,177
పీఈటీ	16,871
మొత్తం	2,77,574

టీఆర్టీ రాతపరీక్షలు ఫిబ్రవరి 24 నుంచి 28వ తేదీ వరకు నిర్వహించాలని టీఎస్‌పీఎస్సీ నిర్ణయించింది. మార్చి 1 నుంచి 5 వరకు టీఆర్టీ రాతపరీక్షల ప్రాథమిక కీ విడుదల కానుంది. వాటిపై అభ్యంతరాలను మార్చి 2 నుంచి 10వ తేదీ వరకు స్వీకరిస్తారు. మార్చి 25న తుది కీ విడుదలవుతుంది. ఏప్రిల్ 16 నుంచి 20వ తేదీ వరకు టీఆర్టీకి ఎంపికైన అభ్యర్థులకు ధ్రువపత్రాల పరిశీలన జరుగుతుంది. మే 10న టీఆర్టీ నియామకాల జాబితా విడుదలవుతుంది. వచ్చే విద్యాసంవత్సరం ప్రారంభం నాటికి ఉపాధ్యాయ పోస్టులకు ఎంపికైన అభ్యర్థులకు నియామక పత్రాలు అందించే దిశగా టీఎస్‌పీఎస్సీ చర్యలు చేపట్టింది.



జానపద కథాగేయాలు

జానపద సాహిత్యంలో జానపద కవిత్వం ఒక భాగం. ఇందులో సంగీతానికి సంబంధించిన విషయాలు రెండున్నాయి. వాటిలో గేయ సాహిత్యం ప్రధానమయితే రెండవది సంగీతమనే చెప్పాలి. అయితే గేయాలలో ముఖ్యంగా కథతో కూడుకొనిన అంశాలు కూడా ఉన్నాయి. అందులో ముఖ్యంగా నాటకీయమైన అంశాలు ప్రధాన ఇతివృత్తం కలిగి ఉన్నప్పడే కథాగానం అవుతుంది. జానపద సంగీతం స్వయంభువు. ప్రాచీన మానవుడు తనకు కష్టం వచ్చినప్పడు దానిని భరించలేక బాధ నివారణ కోసం, సంతోషం వచ్చినప్పడు ఎగురుతూ, గెంతుతూ కూనిరాగాలతో ఆనందోత్సాహంతో చేసిన రాగాలాపన ఫలితం ఈ సంగీతం. అదే జానపద సంగీతానికి తొలి రూపం. జానపదులు వారు అనుభవించిన అనుభూతిని అప్రయత్నంగా స్పందించి ప్రదర్శించే ప్రయత్నంలో రాగాలు తీయడం వల్ల గేయం పుట్టింది. క్రమక్రమంగా గానం పరిణామం చెంది సంగీతంగా మారింది.

జానపద సంగీతం పరిణామం గేయోత్పత్తి లాగా అభివృద్ధిని సంతరించుకుం దని, స్వచ్ఛమైన జానపదుల సంగీతం ఎటువంటి కట్టుబాట్లకు నియమ నిబంధనలకు లోనుకాకుండా స్థిరమైన సాహిత్యం ఉండకుండ వివిధ రకాల తాళాలతో, రాగాలతో పాడటం జానపద సంగీతంలో ప్రధానంగా కనిపిస్తుంది. ఏదైనా ఒక వాయిద్యం సహకారంగా ఉంటే చాలు జానపద సంగీతం సులభంగా సాగిపోతుంది. అలాంటి జానపద సంగీతానికి ప్రాచుర్యాన్ని తెచ్చినవారు జానపద భిక్షుగాయకులు. వీరు కొన్ని వందల ఏళ్ల గా జానపద గేయాలను పాడుకుంటూ అందులోని సంగీతాన్ని కాపాడు కుంటూ వస్తున్నారు. ప్రకృతి పరంగా వచ్చిన శృతితో జానపద సంగీతానికి జీవం పోశారు. ఈ జానపద గేయాలు కాలానుగుణంగా తరతరాలుగా అనేక రూపాంతరాలుచెందుతూ వస్తున్నాయి. సామూహిక విధానంగా మారిన కథాగేయాలు ఇటువంటి జానపద సంగీతానికి ప్రదర్శన కళలకు అన్వయించుకుంటే అవి కథాగానాలుగా ప్రదర్శితమవుతున్నాయి.

నామౌచిత్యం

కథలు వచన రూపంలో ఉంటాయి. కాల క్రమేణ కథకు రాగాన్ని జోడించి కథను పాటల రూపంలో పాడటం వలన వీటికి కథాగేయాలుగా పేరొచ్చింది. దీన్నే 'కథాగానం' అంటారు. ఈ కథాగానాల కథారూపాల పేర్లు ఆ కథలను చెప్పేవారి కులాలను బట్టి కత చెప్పే సమయంలో ఉపయోగించే వాయిద్యాలను బట్టి వచ్చాయని పరిశోధకులు అంటున్నారు. కథను గానం చేస్తూ నాటకంగా మలచడం వల్ల కథాగానమయింది. ఈ కథాగానాల్లో కాలానుగుణంగా వచ్చిన మార్పుల వల్ల, సందర్భాలను కతను ప్రదర్శించేవారు, సంగీతం, అభినయాలతో ఏదో ఒక కథను ఆలంబనంగా చేసుకొని కథాగానం చేయటం వల్లం వీటికి కథాగానాలు అనే పేరు వచ్చిందని చెప్పవచ్చు.

కథగా పాడటానికి అనువుగా ఉండే గేయం సరళమైన ఛందస్సుతోను, దేశీయమైన ఇతివృత్తాలతోను గేయరూపంలో నిర్మితమై ఉంది. జానపదులు పాడటానికి అనువుగా కథాగేయాలు ఏర్పడినాయి. జానపదుల నోళ్లలో రాగాలు నాని సంచార భిక్షుక గాయకుల ద్వారా ఇతర ప్రాంతాలకు వ్యాపించడం, వారి వారి సంతానానికి వృత్తిపరంగా అవి సంక్రమించడం జరిగింది. ఒక వ్యక్తిని ఉద్దేశించిగాని, కుటుంబాన్ని ఉద్దేశించిగాని హృదయాన్ని కదిలించే యుద్ధ సన్నివేశాలను ఉద్దేశించిగాని, పుణ్యవతులైన గ్రామదేవతలను కీర్తించే ప్రయత్నంలో కథాగేయాలు సహజంగా రూపొందుతాయి. రామాయణ, భారత కథలలోని పవిత్రతను ప్రచారం చేసే ప్రయత్నంలో జానపదులు దానిని తమ పద్ధతికి, లయకు అనుగుణంగా గేయరూపకంగా అవతరిస్తాయి. అందుకనే ఈ కథాగానాలకునేటికీ ప్రదర్శన పరంగా ప్రజల దృష్టిలో అంతగా ప్రచారం లేనప్పటికీ, ఈ కళనే పవిత్రంగా భావించే ప్రధాన కులాలకు ఆశ్రిత కళారూపాలుగా కొన్ని కథాగానాలు ప్రచారంలో ఉన్నాయి. అవి ప్రధాన కులాలు ఆదరించే వాటిని బట్టి కొన్ని నేటికీ ప్రచారంలో ఉన్నాయి. మరికొన్ని కనుమరుగయినాయి.





కథాగేయాల పుట్టుక

వాగ్రూపమైన సంప్రదాయాలు కలిగి, తరతరాలుగా అనేక రూపాంతరాలుగా ప్రచారం పొంది సామూహిక వికాసం కలిగినవే కథాగేయాలు, కథాగేయాల పుట్టుక గురించి సుందరంగారు "కథాగేయాలు ఎప్పుడు అవతరించాయి, ఎప్పుడు వికాసం చెందాయని చెప్పడం చాలా కష్టం. ప్రాథమిక రూపమైన భాగవతానికి కథ, కథనం చేరి కథాగేయాలుగా పుట్టి ఉండవచ్చని వివరించడం జరిగింది" అని తన సిద్ధాంత గ్రంథంలో రాశారు. కథాగేయాల పుట్టుకకు కారణాలు వెదకడం చాలా కష్టం. ఎందుకంటే వీటన్నింటికి ఒకవిధమైన చరిత్ర అన్నది లేదు. నిరంతరం మార్పులు చెందుతూ ఉండటమే జానపద సాహిత్య లక్ష్యం.ప్రాచీన కాలంలో జరిగిన అనేక సంఘటనలు, నమ్మకాలు, మూలాంశాలు కథాగేయాల పుట్టుకకు కొన్ని కారణాలయి ఉండవచ్చని కొందరి బావన.

దేవతలపై కథలు అల్లి పాటలుగా పాడుకోవడం కథాగేయాల సృష్టికి మూలమై ఉంటుంది. తమ నాయకుడో లేక తమ జట్టులోని ఎవరో సాధించిన ఘనకార్యాలపై రకరకాలుగా జానపదులు అల్లుకున్న గాథలు గేయరూపంలో చెప్పవచ్చు. వీరుల వీరోచిత కృత్యాలు, దాతల ఉదార స్వభావ గుణకీర్తనలు, అభాగ్యుల కరుణామయ గాథలు, మాయాజాల, మంత్రజాల అద్భుత కథలు, దైవలీలలు, మధుర గాధలు.. ఇలా ఈ కథాగేయాలలో సామాన్యంగా కన్పించే వస్తువులు. సాధారణంగా కథాగేయాల్లో వీర కరుణ రస ప్రధాన గేయాలే ఎక్కువగా కనిపిస్తాయి. ఏదైనా ఒక సంఘటన జరిగిన వెంటనే ఆ దృశ్యాన్ని కనులారా చూచి, చెవులారా విని వారు ఉద్వేగంగా పాదుకున్న ఈ కథాగేయాలు కాలక్రమంలో ఎన్నో మార్పులకు గురై కొన్ని నమ్మశక్యం కానంత అభూత కల్పనలతో కూడా ప్రచారం పొందాయి. కథాగేయాలు ఎప్పుడు ఎట్లా పుట్టాయనేదానికి చారిత్రక ఆధారాలు లేవు. ప్రకృతిపరంగా వచ్చిన శృతి జానపద సంగీతాన్ని ప్రాచుర్యంలోకి తెచ్చినవారు జానపదభిక్షుగాయకులు. పిచ్చుకుంటు, వీరముష్టిలు, జంగాలు, భాగవతులు, కొమ్ములవారు, బవనీలు, దాసర్లు, బొమ్మలాటకాండ్రు గేయములను పాడుకుంటూ ఒక తరం నుంచి మరో తరానికి అందించారని చెప్పవచ్చు.

-బోనాల ప్రకాష్,
9290556682



క్రొయేషియా సంస్కృతి

పూర్వపు యుగోస్లావియాలోని ఆరు రిపబ్లిక్‌లలో ఒకటి క్రొయేషియా. క్రొయేషియా ప్రజలు తాము చుట్టుపక్కల ఉన్న ఇతర రిపబ్లిక్‌లతో కన్నా ఆస్ట్రియాతోను, దాని సంస్కృతితోను సన్నిహిత సంబంధాలు ఉన్నవారిగా భావించుకుంటారు. తమ దేశాన్ని బాల్కన్ దేశంగా కన్నా యూరప్ దేశంగా భావించడానికి ఇష్టపడతారు.

ప్రస్తుతం ఉన్న క్రొయేషియన్ ప్రజలు 14 వందల ఏండ్లుగా ఇక్కడ నివసిస్తున్నారు. అంతకు ముందు సంస్కృతుల గుర్తులూ ఇంకా ఈ ప్రజల్లో కనిపిస్తాయి. నిజానికి క్రొయేషియా ఇటు పశ్చిమదేశాలు, అటు తూర్పుదేశాల ప్రభావానికి గురవ్వడానికి అనువైన భౌగోళిక ప్రదేశంలో ఉంది.



కళలు : క్రొయేషియా వాసులు రోమన్ కళా ప్రభావానికి గురయ్యారు. ముఖ్యంగా రోమన్ క్రైస్తవ చర్చిల భవన నిర్మాణ శైలి వీరిపై పడటం వల్ల అదే శైలిలో తమ దేవాలయాలను నిర్మించుకున్నారు. వారి శిల్పంలో 'వెల్ ఆఫ్ లైఫ్' చాలా ప్రసిద్ధి చెందింది. గోథిక్ పెయింటింగ్స్ ఉన్నా చాలా తక్కువగా రక్షితమై ఉన్నాయి. ఎక్కువగా ఫ్రెస్కో పెయింటింగ్స్‌నే వీరు సృష్టించారు. ఫెడ్రికో బెన్కోవిక్ అనే చిత్రకారుడు క్రొయేషియా పెయింటర్స్‌లో అతి ముఖ్యుడు. ఇతడు దాదాపు తన జీవితాంతం ఇటలీలోనే గడిపాడు.

ఇక సంగీతం విషయానికి వస్తే క్రొయేషియా మూజిక్‌పై రెండు ప్రభావాలు ఉన్నాయి. మధ్యయూరప్ ప్రభావం మధ్య, ఉత్తర క్రొయేషియా సంగీతంపై ఉంటే; కోస్తా ప్రాంత సంగీతంపై మధ్యధరా ప్రాంత ప్రభావం ఉంది. పాప్, రాక్ మ్యూజిక్‌లు ఇక్కడ మంచి ఆదరణ కలిగి ఉన్నాయి.

వివాహం : యువతీ యువకులు తమ భాగస్వామిని తామే ఎన్నుకుంటారు. స్కూల్, కాలేజీ, పని ప్రదేశాల్లో స్నేహితుల ద్వారా ఒకరికొకరు పరిచయం పెంచుకొని బంధాన్ని పెంచుకుంటారు. సాధారణంగా క్రొయేషియాలో యువత బృందాలుగా కాలం గడుపుతారు. ఓ జంటమధ్య సీరియస్ బంధం ఏర్పడిన తరువాత మాత్రమే తల్లిదండ్రులకు తమ సంగతి చెబుతారు. జాతి, మతం, చదువు, హోదా ఉన్న వారినే భాగస్వాములుగా ఎన్నుకోవడం యువతీయువకులు చేస్తుంటారు. ఇరవైల్లోనే ఎక్కువగా పెండ్లిల్లు చేసుకుంటారు. విడాకులు కూడా ఎక్కువగానే కనిపిస్తాయి. వివాహానికి ముందే గర్భం దాల్చడమూ కనిపిస్తుంది. కొత్తగా పెండ్లయిన జంట ఎవరో ఒకరి తల్లిదండ్రులతో కాని, తాత ఇంట్లో కాని నివసిస్తారు. ఇందుకు ప్రధాన కారణం వారికి గృహాల కొరత ఉండటమే.



ఆస్తిని పిల్లలందరికీ లింగభేదం లేకుండా సమానంగా పంచుతారు తల్లిదండ్రులు. ఆస్తిలో ముఖ్యమైనది ఇల్లు లేక అపార్ట్‌మెంట్. సాధారణంగా కుటుంబంలో మగపిల్లవాడు కాని, ఆడపిల్లకాని ఎవరికో ఒకరికి (ఎవరు నివసిస్తే వారికి) ఇంటిని ఇస్తారు.

వ్యక్తిత్వం, మూర్తిమత్వం-సంస్కృతి



సంస్కృతే చరాచర ప్రపంచానికి మూలమనిగాని, అదే సర్వస్వమనిగాని భావించకూడదు. సంస్కృతి అతి ముఖ్యమైనదన్న విషయం నిర్వివాదాంశం. అయితే మరి సంస్కృతిని సృజించిన మానవుడు ఉన్నాడు కదా. సంస్కృతే సర్వస్వమైతే ఒకే సంస్కృతిలో పుట్టిన మావులంతా ఒకే రకంగా ఎందుకుండరు? మనుషుల్లో వైయక్తిక విభేదాలున్నాయి. వారిమధ్య సామాన్య లక్షణాలున్నాయి. సామాన్య లక్షణాలకు సంస్కృతి కారణమైతే వైయక్తిక భేదాలకు, వైలక్షణాలకు, మూర్తిమత్వం వ్యక్తిత్వం, సృజనాత్మకతలు కారణాలు. మనిషి వ్యక్తిగా అనన్యుడు. అచ్చు అతనిని బోలినవాడు వేరొకడు ఉండడు. ఒకే సంస్కృతిలో పుట్టి పెరిగినప్పటికీ వ్యక్తులు తమ తమ వ్యక్తిత్వాలను పెంచుకుంటారు.

వ్యక్తిత్వానికి మూలకందకమైన ఆత్మ సాంఘిక ప్రక్రియా ప్రభావితం కావచ్చు. అయినా "తనను తాను గుర్తించిన" మానవుడు, తన వ్యక్తిత్వాన్ని పరిసరం మీద ప్రసరింపజేసి అందులో మార్పులు తీసుకురావడానికి ప్రయత్నిస్తాడు. అంతేగాక ప్రతిమనిషికి ఆత్మాభివ్యక్తి అనే మానసిక అవసరం ఉంది. తన కోర్కెలను, అనుభవాలను, అనుభూతులను, భావనలను ఇతరులకు చెప్పుకోవాలి. అట్లా చెప్పుకోకుండా మనిషి బతకలేడు. ఈ అవసరం ప్రభావం వ్యక్తి వ్యక్తికీ మారవచ్చు. అది వారి బాహ్య, అంతర పరిస్థితుల మీద ఆధారపడి ఉంటుంది. ఈ ఆత్మాభివ్యక్తీకరణం అప్పుడప్పుడు సంస్కృతిని తృణీకరిస్తుంది. తను విధించుకున్న నియమాలను తానే ధిక్కరించడంలోనే మనిషికి ఆనందం ఉంది. ఇది మానవ జాతికి సామాన్యం కూడా. ఇది మరో విజ్ఞాన శాస్త్ర సత్యం. వాస్తవ ప్రవర్తనకు, ఆదర్శ ప్రవర్తనకు మధ్య ఎప్పుడూ తేడా ఉంటుంది. ఇంతేకాక మనం మామూలుగా ఒకటి వల్లిస్తుంటాం. వేరొకటి చేస్తూ ఉంటాం.ఈ వైరుధ్యం కూడా ఎప్పుడూ ఉండనే ఉంది. అందుకే సమాజ శాస్త్రజ్ఞులు ఆదర్శ, వాస్తవ సంస్కృతులకు మధ్య తేడా చెప్పారు. దాదాపు ప్రపంచంలోని అన్ని సమాజాల్లోనూ 'అగమ్య గమన' (ఇన్‌సెస్ట్) నిషేధం ఉంది. ఈ నియమాన్ని పాటించకపోతే ఎంత బాగుండు! ఒకరు ఏర్పరచిన నియమాన్ని ఉల్లంఘించడం ఎంత తృప్తిగా ఉంటుంది! పిల్లల ప్రవర్తన జాగ్రత్తగా పరిశీలించినట్లయితే ఈ వైరుధ్యాలు గోచరిస్తాయి. వారికి సంస్కృతిని అలవాటు చేసే క్రమంలో వారి నుంచి ఎదురయ్యే సంఘర్షణ, విముఖత, పెనుగులాటలు మనకు అనుభవాలే. బహుశ మానవునిలోని నిరంతర వేదన, నిస్పృహ, నిరాశలకు ఈ వైరుధ్యం (ఆచణాదర్శాల మధ్య అంతరం) కారణమేమో. తన అభివ్యక్తీకరణాన్ని సమాజం కుంటుపరిచినప్పుడు భద్రత లేని వ్యక్తి బాధపడతాడు. బానిసనని సిగ్గుపడతాడు. అందుకేనేమో "ప్రపంచం దు:ఖమయం" అనే తత్వం మనకు బాగా నచ్చుతుంది.

జీవపదార్థంతో తయారైన పశువులాంటి శిశువు సాంఘికీకరణ ప్రక్రియ ద్వారా మనిషి అవుతుంది. పుట్టినప్పుడు శిశువు రక్తమాంసాల ముద్ద. ఆత్మగాని, మనసుగాని ఉండవు. తర్వాతనే ఇవి ఏర్పడతాయి. ఎట్లా ఏర్పడతాయో చూద్దాం.

బిడ్డ ముందు తల్లితో, తరువాత కుటుంబ సభ్యులతో, ఆ తరువాత ఇరుగుపొరుగుతో ప్రతిచర్య జరుపుతుంది. ఈ ప్రతి చర్యలో అతని మూర్తిమత్వం రూపురేఖలు దిద్దుకుంటుంది. తను నివసించే సమూహం భాష, అలవాట్లు, ఆచార వ్యవహారాలు నేర్చుకొంటాడు. ఒక వ్యక్తి సుఖసంతోషాలు ఇతరులతో అతడు నెరపే పరస్పర సంబంధాలపై ఆధారపడి ఉంటాయి.

ఒకపక్క మూర్తిమత్వం వికసిస్తూ ఉంటే, అదే సమయంలో మరో వైపు నుంచి వ్యక్తిత్వం ప్రాదుర్భావం చెందుతుంది. ఒకపక్క సమాజం కట్టుబాట్లను పాటిస్తూనే తాను ప్రతిచర్య జరిపే ఇతరులకంటే 'తాను వేర'ని గుర్తిస్తాడు. ఒకపక్క సామాజిక స్పృహ ఏర్పడుతూ ఉంటే మరోపక్క ఆత్మ స్పృహ రూపొందుతుంది. రెండింటి మధ్య సాన్నిహిత్యం అత్యంతం. ఒకటి లేకుండా రెండోది లేదు. ఒకే నాణేనికి ఈ రెండూ రెండు ముఖాలు. సమాజ భావంలో వ్యక్తి తనను తాను ఎరగలేడు. ఎందుకంటే ఆత్మ నిష్పన్నం కాదు. ఇతరులతోడి ప్రతిచర్యతోనే క్రమంగా వ్యక్తి తనను గురించిన తన ప్రతిమనొకదాన్ని రూపొందించుకుంటాడు. ఆవిధంగా అతడు అనన్యుడవుతాడు. ఈ అనన్యత, వ్యక్తిత్వాలు ఇతరులను అర్థం చేసుకోవడానికి ఉపయోగ పడతాయి. ఈ వైయక్తీకరణ ప్రక్రియలో వ్యక్తి స్వతంత్రుడవుతాడు. ఆత్మ సంయమనుడవుతాడు. ఆత్మ పెరిగేకొద్దీ, కట్టుబాట్లు, ఆచారాల ప్రభావం అతని మీద తగ్గిపోతుంది. అధికారాన్ని, ఆప్తవాక్యప్రమాణాన్ని అంగీకరించక, గుర్తించక స్వతంత్ర అభిప్రాయాలను ఏర్పరచుకుంటాడు.

మూర్తిమత్వం పొందే తీరు చూస్తే అక్కడ కూడా సంస్కృతితో ఘర్షణ కనిపిస్తుంది. సంస్కృతి లక్ష్యం వ్యక్తిని తనకు అనుగుణ్యంగా, అనువృత్తునిగా చేసుకోవడం. మరి జరుగుతున్నదేమిటి? అనువృత్తితో పాటు దానిననుసరించి ఫ్రస్టేషన్, టెన్షన్లు వస్తున్నాయి. సంస్కృతికి రెండు పక్షాలున్నాయి. ఒకటి అది జీవనవనావరాలను తీరుస్తుంది. రెండోది ఆ అవసరాలను కుంఠితమూ చేస్తుంది. సంస్కృతికి ఉన్న ఈ రెండు పక్షాలను మనం అర్థం చేసుకోవాలి. తల్లి బిడ్డను ప్రేమతో పెంచుతుంది. అవసరమైతే కొడుతుంది కూడా.

సాంఘిక కుంఠనం (సోషల్ ఫ్రస్టేషన్) ద్వారా మూర్తిమత్వాలలోని భిన్నత్వాన్ని అర్థంచేసుకోవచ్చని మనో విశ్లేషణ వేత్తలు చెబుతున్నారు. నియమబద్ధమైన ప్రవర్తన శిశువుకు ఎప్పుడూ కంటకంగానే ఉంటుంది. చికాకు కలిగిస్తుంది. మరి సంఘం సాఫీగా సాగిపోవాలంటే, మూర్తిమత్వం వికసించాలంటే, అది ఎంతైనా అవసరం. భారతీయులు ఈ విషయాన్ని ఎప్పుడో గుర్తించారు. మానవ సంబంధాలకు మూలం రాగద్వేషాలన్నారు. దీనిని ఫ్రాయిడ్ తిరిగి కనుక్కున్నాడు. వాటికి ఈరీస్, తానటాస్-జనన మరణాలు అని పేర్లు పెట్టాడు. జీవన గతిలో వ్యక్తి లభించిన రాగద్వేషాల సాంద్రత అతని మూర్తిమత్వ విశేషాలను నిర్ణయిస్తుంది.కుంఠనాన్ని ఎదుర్కొనడంలో మనిషి ఎదుగుతాడు. పరిణతి చెందుతాడు.

-ఎ.వి.రెడ్డి




అజేయ యాత్రకు తెర

విజయావకాశాన్ని వదిలేశారు..!

'మా పొరపాట్లను సరిదిద్దుకుంటాం. భాగస్వామ్యాలు టెస్టును నిర్దేశించాయి. తొలుత అవకాశాలను వడిసిపట్టి ఉంటే సఫారీలను తొలి ఇన్నింగ్స్‌లో 220 లోపు కట్టడి చేసేవాళ్లం. కానీ అలా జరుగలేదు. ఓటమి అంతరం 70 పరుగులు. జట్టులో 20, 30 పరుగులు ఆటగాళ్లు 70-80 చేయాల్సిన అవసరం ఉంది. విజయానికి ఆ ప్రదర్శన సరిపోదు. ప్రత్యర్థి ఓ పేసర్‌ను కోల్పోయినా.. సరైన ప్రదేశాల్లో బంతులేసి విజయవంతమైంది. కేప్‌టౌన్ టెస్టు ప్రదర్శనపై మేము సంతృప్తితోనే ఉన్నాం. హార్దిక్ పాండ్య విలువైన ఆటగాడు. అతడి పట్ల అపారమైన నమ్మకం ఉంది. స్వదేశంలోనే కాదు విదేశాల్లోనూ అతడు కీలకం కాగలడు'

- కోహ్లి, భారత కెప్టెన్

సోమవారం, 1997 మార్చి 31. బ్రిడ్జ్‌టౌన్‌లో వెస్టిండీస్‌తో తొలి టెస్టు. చందర్ పాల్ సెంచరీతో విండీస్ తొలి ఇన్నింగ్స్ స్కోరు 298. సచిన్ టెండూల్కర్ (92) మెరుపులతో టీమ్ ఇండియా స్కోరు 319. విలువైన తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం. అబె కురువెల్లి ఐదు వికెట్ల విజృంభణతో విండీస్ రెండో ఇన్నింగ్స్‌లో 140కే కుప్పకూలింది. భారత్ ముందు 120 పరుగుల స్వల్ప లక్ష్యం. విండీస్ వైపు భీకర పేసర్లున్నా విజయంపై భారత్ ధీమాగా కనిపించింది. కానీ ఛేదనలో లక్ష్మణ్ (19) ఏ ఒక్కరూ రెండెంకల స్కోరు చేయలేదు. ఆంబ్రోస్ (3/36), బిషప్ (4/22), రోస్ (3/19) నిప్పులు చెరిగారు. భారత్ 81 పరుగులకే చేతులెత్తేసింది. భారత క్రికెట్ చరిత్రలోనే ఇదోక చీకటి రోజుగా పరిగణిస్తారు. అప్పట్లో అగ్రజట్టు విండీస్‌పై విజయావకాశాన్ని మనోళ్లు చేజేతులా వదిలేశారు.

అప్పుడు సారథి సచిన్ టెండూల్కర్.

సోమవారం, 2018 జనవరి 8. అదే కథ. భారత పేసర్ భువనేశ్వర్ (4/87) మెరుపులతో దక్షిణాఫ్రికా సొంతగడ్డపై తొలి ఇన్నింగ్స్‌లో 286 పరుగులకే పరిమితమైంది. మన తరపున హార్దిక్ పాండ్య (93) వీరోచిత ఇన్నింగ్స్ భారత్ పరుగుల లోటును 77కు కుదించింది. షమి (3/28), బుమ్రా (3/39) నిప్పులు చెరిగిన వేళ సఫారీ రెండో ఇన్నింగ్స్‌లో ఆఖరి 8 వికెట్లను 65 పరుగులకే కోల్పోయి 130 పరుగులకే కుప్పకూలింది. దీంతో ఛేదించగల లక్ష్యం 208 భారత్ ముందింది. కానీ కోహ్లి (28), అశ్విన్ (37) మినహా అందరూ విఫలమయ్యారు. టీమ్ ఇండియా 135 పరుగులకు చేతులెత్తేసింది. దీంతో ఈసారి అగ్రజట్టుగా విదేశీ గడ్డపై చారిత్రక విజయావకాశాన్ని టీమ్ ఇండియా వదిలేసింది.

ఇప్పుడు సారథి విరాట్ కోహ్లి

అప్పటికీ, ఇప్పటికీ 21 ఏండ్ల కాలంతో పాటు పరిస్థితుల్లోనూ ఊహించలేని మార్పు. కానీ విదేశీ గడ్డపై గెలిచి నిలువాలనే సంకల్ప సారూప్యతలో మార్పు లేదు. రెండు సందర్భాల్లోనూ స్వల్ప ఛేదనలో చేతులెత్తేసిన టీమ్ ఇండియా వదిలేసింది విజయాన్ని కాదు, ఓ చరిత్రను అని చెప్పడానికి ఎలాంటి సందేహం లేదు!.

కేప్‌టౌన్‌లో 72 పరుగులతో సాధికారిక విజయం సాధించిన దక్షిణాఫ్రికా ఫ్రీడం సిరీస్‌లో 1-0తో ముందంజ వేసింది.



- సఫారీ పేస్, బౌన్స్‌కు బిత్తరపోయిన భారత్
- 208 ఛేదనలో 135కే కోహ్లిసేన ఖతం
- 72 పరుగులతో టీమ్‌ఇండియా ఓటమి

ఫ్రీడం సిరీస్‌లో దక్షిణాఫ్రికా 1-0 ఆధిక్యం


పాండ్య (1)


కోహ్లి (28)

18 తొలి టెస్టు నాల్గో రోజు ఆటలో పడిపోయిన వికెట్లు. 64 ఓవర్లలో ఇరు జట్లలో 18 మంది అవుటయ్యారు.

నవతెలంగాణ- కేప్‌టౌన్

65/2తో నాల్గో రోజు బ్యాటింగ్‌కొచ్చిన దక్షిణాఫ్రికా మరో 65 పరుగులకే చివరి 8 వికెట్లు కోల్పోయింది. దీంతో భారత శిబిరంలో ఆనంద వెల్లువ. 300 టార్గెట్ ఖాయమనున్న చోట 208 పరుగులే చేయాలి. ఇంకేముంది మనోళ్లు కొట్టేస్తారులే అనుకున్న అభిమానులకు కోహ్లిసేన నిరాశే మిగిల్చింది. తొలి సెషన్ పేసర్లకు అనుకూలించగా, మిగతా రెండు సెషన్లలో బ్యాటింగ్‌కు సానుకూలంగా ఉంటుంది. దీంతో టీమ్ ఇండియా పని సులువే అనిపించింది. అందుకు తగినట్టే క్లిష్ట పరిస్థితుల్లో ఓపెనర్లు 30/0తో శుభారంభం అందించారు. కానీ ఏం లాభం, మిడిల్ ఆర్డర్ నిలిచి సద్వినియోగం చేసుకుంటేనా?. చూస్తుండగానే ఓపెనర్లు విజయ్ (13), ధావన్ (16) సహా కెప్టెన్ కోహ్లి (28), పుజార (4), రోహిత్ శర్మ (10)లు పెవిలియన్‌కు చేరుకున్నారు. స్వల్ప ఛేదనలో 76/5తో ఓటమి అంచుల్లో టీమ్ ఇండియా. ఆఖర్లో అశ్విన్ (37), భువనేశ్వర్ (13) పోరాటం ఓటమి అంతరాన్ని తగ్గించింది. విజయావకాశాలు రెండు జట్లకూ సమంగా ఉన్న వేళ దక్షిణాఫ్రికా పేసర్ వెర్నన్ ఫిలాండర్ (6/42) కెరీర్ అత్యుత్తమ ప్రదర్శన మ్యాచ్‌ను మలుపు తిప్పింది. డెల్ స్టెయిన్ సేవలు లేకున్నా.. రబాడ (2/41), మోర్నీ మోర్కెల్ (2/39) అండతో ఫిలాండర్ పని పూర్తి చేశాడు. భారత్‌ను 135 పరుగులకే కుప్పకూల్చి దక్షిణాఫ్రికాకు 72 పరుగుల తేడాతో కేప్‌టౌన్ విజయాన్ని అందించారు. మూడు మ్యాచుల సిరీస్‌లో తొలి టెస్టు నెగ్గిన దక్షిణాఫ్రికా 1-0 ఆధిక్య సాధించింది. ఫిలాండర్ 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు అందుకున్నాడు. రెండో టెస్టు జనవరి 13 నుంచి సెంచూరియన్‌లో ఆరంభం కానున్నది.

ఛేదనలో విలవిల : ఛేదించాల్సిన లక్ష్యం 208. ఇంకా ఐదు సెషన్ల ఆట ఉంది. క్లిష్టమైన ఉదయం సెషన్ అయిపోయింది. తర్వాతి రెండు సెషన్లలో బ్యాటింగ్ కాస్త సులువే. ఇందుకు తగినట్టుగానే ఓపెనర్లు విజయ్ (13), ధావన్ (16)ను ఇన్నింగ్స్‌ను ఆశాజనకంగా ఆరంభించారు. ఫిలాండర్ ఓవర్లో విజయ్ రెండు సార్లు అవుటైనా.. రివ్యూకి వెళ్లి జీవనదానం పొందాడు. ఈ సమయంలో చెరో రెండు బౌండరీలు సహా వికెట్ల మధ్య పరుగుకు ప్రాధాన్యం ఇచ్చిన ఓపెనర్లు చకాచకా స్కోరు ముందుకు తీసుకెళ్లే ప్రయత్నం చేశారు. ఫిలాండర్ పేస్ పరీక్షను ఎదుర్కొన్న ఓపెనర్లు.. మోర్కెల్ బౌన్స్‌ను బదులివ్వలేదు. ఎక్స్‌ట్రా బౌన్స్‌తో వచ్చిన బౌన్సర్‌ను ఆడబోయిన ధావన్ వికెట్ల వెనకాల దొరికిపోగా.. విజయ్ ఎట్టకేలకు ఫిలాండర్‌కు చిక్కాడు.

దీంతో ఆరు బంతుల వ్యవధిలోనే భారత్ ఓపెనర్లను కోల్పోయింది. ఈ దశలో కీలక భాగస్వామ్యంతో గెలుపు దారి చూపుతారని భావించిన పుజార (4), కోహ్లి (28) జోడీ ఎంతో సేపు నిలువలేదు. అద్భుతమైన డిఫెన్స్ ఆడగల పుజారా.. మోర్కెల్ బంతిని ఆడాలా వద్దా అనే మీమాంసలో ఎడ్జ్ తీసుకొని కీపర్‌కు క్యాచౌట్‌గా దొరికిపోయాడు. అయినా, క్రీజులో కోహ్లి ఉండటం అతడికి తోడు రోహిత్ (10) రావటంతో భారత్ ఆశలు సజీవంగా ఉన్నాయి. కానీ ఫిలాండర్ ఈ ఇద్దరినీ వెనక్కి పంపి భారత ఆశలపై నీళ్లు చల్లాడు. తొలి ఇన్నింగ్స్ హీరో హార్దిక్ పాండ్య (1)ను వచ్చీరాగానే రబాబ బలిగొన్నాడు. 82/7తో టీమ్ ఇండియా వందలోపే ఆలౌట్ అయ్యేలా కనిపించింది. కానీ అశ్విన్ (37), భువనేశ్వర్ (13) అదిరే భాగస్వామ్యంతో ఆకట్టుకున్నారు. అద్భుతం చేసేలా కనిపించిన ఈ జోడీని ఫిలాండర్ విడదీశాడు. ఒకే ఓవర్లో వరుసగా అశ్విన్, షమి, బుమ్రాలను అవుట్ చేసిన ఫిలాండర్ భారత్ పోరాటానికి తెరదించాడు. 135 పరుగులకు కుప్పకూలిన టీమ్ ఇండియా 72 పరుగుల తేడాతో ఓటమిపాలైంది.

షమి, బుమ్రా మిలమిల : నాల్గో రోజు ఉదయం సెషన్లో భారత పేసర్లు మహ్మద్ షమి, జశ్‌ప్రీత్ బుమ్రా ధాటికి సఫారీ విలవిల్లాడింది. సెషన్ రెండో ఓవర్లోనే బిగ్ వికెట్ హాషీమ్ ఆమ్లా (4)ను ఓవర్‌నైట్ స్కోరుకే వెనక్కి పంపించిన షమి.. రబాడ (5)కూ అదే దారి చూపించాడు. దీంతో ఆరంభంలోనే సఫారీ ఓవర్‌నైట్ బ్యాట్స్‌మెన్‌ను కోల్పోయింది. కెప్టెన్ డుప్లెసిస్ (0)ను సున్నాకే అవుట్ చేసిన బుమ్రా.. కొద్ది వ్యవధిలోనే డికాక్ (8)నూ పెవిలియన్‌కు చేర్చాడు. డివిలియర్స్ (35, 50 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్స్‌లు) మినహా టాప్ ఆర్డర్‌ను అవుట్ చేసిన భారత పేసర్లు... లోయర్ ఆర్డర్‌నూ ఎంతోసేపు నిలువనీయలేదు. కేశవ్ మహరాజ్ (15), డెల్ స్టెయిన్ (2)లను భువనేశ్వర్ పడగొట్టగా.. ఏబీ వికెట్‌తో బుమ్రా లాంఛనానికి తెరదించాడు. దీంతో దక్షిణాఫ్రికా రెండో ఇన్నింగ్స్‌లో 135 పరుగులకే కుప్పకూలింది. తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం 77 పరుగులతో కలిపి భారత్‌కు 208 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది.


దక్షిణాఫ్రికా విజయానందం


మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ ఫిలాండర్ 6/42


బౌన్సర్‌కు అవుటైన ధావన్ (16)

దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్ : 286 ఆలౌట్
భారత్ తొలి ఇన్నింగ్స్ : 209 ఆలౌట్
దక్షిణాఫ్రికా రెండో ఇన్నింగ్స్ : మార్క్‌రం (సి) భువనేశ్వర్ (బి) పాండ్య 34, ఎల్గార్ (సి) సాహా (బి) పాండ్య 25, రబాడ (సి) విరాట్ కోహ్లి (బి) షమి 5, ఆమ్లా (సి) రోహిత్ (బి) షమి 4, డివిలియర్స్ (సి) భువనేశ్వర్ (బి) బుమ్రా 35, డుప్లెసిస్ (సి) సాహా (బి) బుమ్రా 0, డికాక్ (సి) సాహా (బి) బుమ్రా 8, ఫిలాండర్ (ఎల్బీ) షమి 0, మహరాజ్ (సి) సాహా (బి) భువనేశ్వర్ 15, మోర్కెల్ (సి) వృద్ధిమాన్ సాహా (బి) భువనేశ్వర్ 2, డెల్ స్టెయిన్ నాటౌట్ 0, ఎక్స్‌ట్రాలు :02, **మొత్తం : (41.2 ఓవర్లలో ఆలౌట్) 130.**
వికెట్ల పతనం : 1-52, 2-59, 3-66, 4-73, 5-82, 6-92, 7-95, 8-122, 9-130, 10-130.
బౌలింగ్ : భువనేశ్వర్ 11-5-33-2, బుమ్రా 11.2-1-39-3, మహ్మద్ షమి 12-3-28-3, హార్దిక్ పాండ్య 6-0-27-2, అశ్విన్ 1-0-3-0.
భారత్ రెండో ఇన్నింగ్స్ : విజయ్ (సి) డివిలియర్స్ (బి) ఫిలాండర్ 13, ధావన్ (సి) మోరీస్ (బి) మోర్కెల్ 16, పుజార (సి) డికాక్ (బి) మోర్కెల్ 4, విరాట్ కోహ్లి (ఎల్బీ) ఫిలాండర్ 28, రోహిత్ శర్మ (బి) ఫిలాండర్ 10, సాహా (ఎల్బీ) రబాడ 8, హార్దిక్ పాండ్య (సి) డివిలియర్స్ (బి) రబాడ 1, అశ్విన్ (సి) డికాక్ (బి) ఫిలాండర్ 37, భువనేశ్వర్ నాటౌట్ 13, మహ్మద్ షమి (సి) డుప్లెసిస్ (బి) ఫిలాండర్ 4, బుమ్రా (సి) డుప్లెసిస్ (బి) ఫిలాండర్ 0, ఎక్స్‌ట్రాలు : 01, **మొత్తం : (42.4 ఓవర్లలో ఆలౌట్) 135.**
వికెట్ల పతనం : 1-30, 2-30, 3-39, 4-71, 5-76, 6-77, 7-82, 8-131, 9-135, 10-135.
బౌలింగ్ : ఫిలాండర్ 15.4-4-42-6, మోర్కెల్ 11-1-39-2, రబాడ 12-2-41-2, మహరాజ్ 4-1-12-0.

ఐపీఎల్ 12కు ఎన్నికల ఎఫెక్ట్?

దక్షిణాఫ్రికా, యు.ఏ.ఈ లలో నిర్వహించే అవకాశం!

నవతెలంగాణ-ముంబయి



ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) మరోసారి సార్వత్రిక ఎన్నికల ప్రభావం ముందు నిలువబోతున్నది!. 2009, 2014 సార్వత్రిక ఎన్నికల సమయంలో భద్రతా కారణాల రీత్యా ఐపీఎల్‌ను భారత్‌లో నిర్వహించలేదు. 2009లో పూర్తి సీజన్‌ను దక్షిణాఫ్రికాలో నిర్వహించగా, 2014లో తొలి అంచె మ్యాచులను యు.ఏ.ఈలో జరిపారు. ప్రతి ఏడాది వేసవిలో క్రికెట్ ప్రియులను సందడి చేసేందుకు సిద్ధంగా ఉండే ఐపీఎల్ ఈ ఏడాది సైతం అదే జోరుతో రానున్నది. కానీ 2019లోనే ఐపీఎల్‌కు చిక్కు. షెడ్యూల్ ప్రకారం 2019 ఏప్రిల్, మే నెలల్లో భారత్‌లో ఎన్నికలు జరుగనున్నాయి. 2019 ఐపీఎల్ సీజన్ సైతం అదే సమయంలో జరగాల్సి ఉంది. దీంతో ఎన్నికల సమయంలో భద్రత కోసం ఐపీఎల్‌కు భారీ స్థాయిలో పోలీసు బలగాలను వినియోగిం చలేరు. దీంతో మ్యాచుల నిర్వహణ కష్టం. కాబట్టి ఐపీఎల్‌ను వేరే వేదికకు మార్చుకోవటమే ఇందు కున్న ఏకైక మార్గం. ఐపీఎల్ 12కు ఇంకా చాలా సమయమే ఉన్నప్పటికీ.. బీసీసీఐ ఉన్నతాధి కారులు ఇప్పటి నుంచే కసరత్తు మొదలెట్టారని విశ్వసనీయ సమాచారం. అధికారికంగా వెల్లడి కాకపోయినా, పూర్తిగా లీగ్‌ను తరలించాలా లేదా పాక్షికంగా వేరే వేదికలో నిర్వహించాలా అనే అంశాలపై బోర్డు అప్పుడే లెక్కలు వేస్తోంది. ముందస్తు ఎన్నికల ఊహాగానాలు సైతం వినిపిస్తున్న వేళ.. అదే జరిగితే ఐపీఎల్ 12కు ఎటువంటి ఆటంకం ఉండబోదు. కానీ షెడ్యూల్ ప్రకారమే 2019 వేసవిలో ఎన్నికలొస్తే ఐపీఎల్‌ను తరలించక తప్పదు. దీనిపై దక్షిణాఫ్రికా, యు.ఏ.ఈ అధికారులతో బీసీసీఐ సంప్రదింపులు జరిపినట్టు తెలుస్తోంది. ఇక దీనితో పాటు ఐపీఎల్ 12 సీజన్ కాస్త ముందుగానే ఆరంభమయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. 2019 వన్డే ప్రపంచకప్ మే 30 నుంచి మొదలుకానున్నది. జస్టిస్ లోధా సిఫారసుల ప్రకారం ఐపీఎల్‌కు, అంతర్జాతీయ షెడ్యూల్‌కు కనీసం 15 రోజుల విరామం ఉండాలి. దీంతో ఐపీఎల్ 12 ఎక్కడ జరిగినా ఓ 15-20 రోజుల ముందుగానే ఆరంభం కానున్నది. ఎందుకంటే లోధా సిఫారసులే కాదు జాతీయ జట్ల తరపున శిక్షణ శిబిరాల్లో పాల్గొనేందుకు విదేశీ ఆటగాళ్లు వీలైనంత త్వరగానే స్వదేశానికి పయనమవుతారు. దక్షిణాఫ్రికాలో 2009లో నిర్వహించిన ఐపీఎల్ అక్కడ బిగ్ హిట్ కొట్టింది. యు.ఏ.ఈలో నిర్వహించిన 2014 తొలి దశ మ్యాచులకు సైతం అపూర్వ ఆదరణ లభించింది. ఈ రెండు వేదికల్లోని సానుకూలాంశాలను పరిగణనలోకి తీసుకొని ఆ సమయానికి వెంటనే నిర్ణయం తీసుకునేలా బోర్డు అధికారులు ముందు జాగ్రత్త చర్యల్లో ఉన్నారని సమాచారం.



ఆసీస్ 4-0 విజయం

- సిడ్నీ టెస్టులో ఇన్నింగ్స్ 123 పరుగులతో గెలుపు
- యాషెస్ సిరీస్ కంగారూల వశం

సిడ్నీ : స్మిత్ సారథ్యంలో ఆస్ట్రేలియా సరికొత్త చరిత్ర సృష్టించింది. 4-0తో యాషెస్ సిరీస్‌ను సొంతం చేసుకుని ఇంగ్లాండ్‌ను చిత్తుచిత్తుగా ఓడించింది. మెల్‌బోర్న్ టెస్టు డ్రాగా ముగియగా.. సిడ్నీ సహా నాలుగు టెస్టుల్లో కంగారూలు అలవోకగా గెలుపొందారు. ఇక సిడ్నీ ఆఖరు రోజు ఆటలో ఇంగ్లాండ్ సారథి జో రూట్ (58) అర్ధ సెంచరీ ఆ జట్టును ఓటమి నుంచి తప్పించలేక పోయింది. ఆసీస్ పేసర్ పాట్ కమిన్స్ (4/39), స్పిన్నర్ నాథన్ లియాన్ (3/54) చెలరేగటంతో ఇంగ్లాండ్ 180 పరుగులకే కుప్పకూలింది. దీంతో ఆస్ట్రేలియా ఇన్నింగ్స్ 123 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. మ్యాచ్‌లో ఎనిమిది వికెట్లు కూల్చిన కమిన్స్ మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు అందుకున్నాడు. 687 పరుగులతో కదం తొక్కిన స్టీవ్ స్మిత్ 'ప్లేయర్ ఆఫ్ ది సిరీస్'గా నిలిచాడు. ఆస్ట్రేలియా క్లీన్‌స్వీప్ చేయకపోయినా.. ఇది ఇంగ్లాండ్ వైట్‌వాష్ ఓటమి సమానమే. ఈ సిరీస్‌తో యాషెస్ సిరీస్ విజయాల్లో ఇంగ్లాండ్‌ను వెనక్కి నెట్టి ఆస్ట్రేలియా ముందు నిలిచింది. ఇక గాయంతోనే బరిలోకి దిగిన రూట్ విమర్శకుల ప్రశంసలు అందుకున్నా.. రిటైర్డ్ హర్ట్‌గానే నిష్క్రమించాడు.

ఢిల్లీ జట్టులో పప్పు తనయుడు

- ప్రతిభావంతుడిని పక్కనబెట్టిన సెలక్టర్లు



న్యూఢిల్లీ : వరుస వివాదాలకు కేంద్రంగా నిలుస్తోన్న ఢిల్లీ అండ్ డిస్ట్రిక్ట్ క్రికెట్ అసోసియేషన్ (డీడీసీఏ) వివాద పంథాను వీడటం లేదు. తాజాగా సయ్యద్ ముస్తాక్ అలీ టీ20 టోర్నీకి ఎంపిక చేసిన జట్టులో బిహార్ ఎంపీ పప్పూ యాదవ్ తన యుడికి చోటివ్వటం వివాదస్పదమైంది. పప్పూ యాదవ్ అలి యాస్ రాజేశ్ రంజన్.. రాష్ట్రీయ జనతా దళ్ (ఆర్జేడీ) మాజీ నేత. పప్పూ భార్య రంజిత్ రంజన్ కాంగ్రెస్ ఎంపీగా కొనసాగు తున్నారు. బలమైన రాజకీయ నేపథ్యం ఉన్న సార్థక్ రంజన్‌ను ఢిల్లీ జట్టులోకి తీసుకునేందుకు అండర్-23 టాప్ స్కోరర్ హితన్ దలాల్‌ను పక్కనపెట్టారు. సార్థక్ రంజన్ రంజీ సీజన్ ప్రాబబుల్స్‌లో చోటుచేసుకున్నా.. ఆటకు దూరమవుతు న్నానని తప్పుకున్నాడు. కానీ ఇప్పుడు హఠాత్తుగా ఒక్క మ్యాచ్‌లో కూడా ఆడకుండానే జట్టులోకి వచ్చేశాడు. సార్థక్ ప్రతిభావంతుడని, మానసిక సంబంధ సమస్యలతోనే ఆటకు దూరంగా ఉన్నాడని, రెండు మాసాలుగా అతడిని పరిశీలించిన తర్వాతే జట్టులోకి ఎంపిక చేశామని సెలక్టర్ అతుల్ వాసన్ వెల్లడించారు. మ్యాచ్ ప్రదర్శనలు కాకుండా మానసిక పరిస్థి తిని పర్యవేక్షించి ఎంపిక చేయటం ఎప్పటి నుంచి మొదలెట్టారో మాత్రం సెలక్టర్ సెలవివ్వలేదు. గతేడాది సైతం టీ20 లీగ్‌లో మూడు మ్యాచులు ఆడిన సార్థక్ వరుసగా 5, 3, 2 పరుగులు చేశాడు. దీంతో అతని ఎంపికపై అప్పట్లోనే దుమారం రేగింది. రాజకీయ నేపథ్యం ఉన్న ఆటగాడి కోసం అండదండలు లేని ప్రతిభావంతుడికి అన్యాయం చేశారని డీడీసీఏలో పేరు చెప్పడానికి ఇష్టపడని అధికారులు వాపోతున్నారు. సార్థక్ తల్లి రంజిత్ రంజన్ డీడీసీఏ అడ్మినిస్ట్రేటర్ జస్టిస్ విక్రంజిత్ సేన్‌కు లేఖ రాశారు. సార్థక్ ఆడేందుకు సిద్ధంగా ఉన్నాడని, ఎంపికకు పరిగణనలోకి తీసుకోవాలని లేఖ సారాంశం. దాన్ని ఆయన సెలక్షన్ కమిటీకి పంపించారు. సెలక్టర్లు ప్రదర్శనను పక్కపెట్టి పలుకుబడి కల్గిన సార్థక్‌ను జట్టులోకి తీసుకోవటం జరిగిపోయింది. జట్టులోని మరో ఆటగాడు క్షితిజ్ శర్మ సైతం అర్హత లేకుండానే ఢిల్లీ జట్టులోకి వచ్చాడని విమర్శలు వినిపిస్తున్నాయి. సయ్యద్ ముస్తాక్ అలీ టీ20 లీగ్ తర్వాత ఐపీఎల్ వేలం జరుగనున్నది. దీంతో ఫ్రాంచైజీల కంట పడేందుకే పలుకుబడి కల్గిన వ్యక్తులు సిఫారసులతో తమ వాళ్లను టీ20 జట్టులో ఉండేలా చేసుకున్నారని తెలుస్తోంది.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State,
Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State Editor : S.Veeraiah.Tel Tel/2014/59462.